మంచి మాట

బాగా గుర్తుపెట్టుకో..
మన స్థాయిని బట్టి మన
మాటలు ఉండకూడదు..
మన మాటలకే ఒక స్థాయి
ఉండాలి..

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250

Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, Rajahmundry, Kakinada, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram, Yanam, Bhubaneswar, Raipur

RNI No.52722/90 సంపుటి : 38 సంచిక : 126 విశాఖపట్నం, 20 ఫిబ్రవరి 2026 శుక్రవారం E-mail : vspnews@gmail.com పేజీలు : 8 వెల : రూ.2.00

# అధికవడ్డీ రుణాలపై వడ్డీ తగ్గింపు

### డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు

### కొత్త ఆవిష్కరణలు ఆర్థిక వ్యవస్థ వృద్ధికి తోడ్పాటు

### ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో టెక్ దిగ్గజాల వెల్లడి

### విశాఖ మీదుగా ఐఐటి ఖరగ్‌పూర్‌కు వెళ్లేవాడిని

### అదే విశాఖలో ఇప్పుడు గూగుల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం

### ఏఐ సదస్సులో గూగుల్ సిఇవో సుందర్ పిచాయ్



**న్యూఢిల్లీ, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 19 :** డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు సాధిస్తోందని, ఏఐ కేంద్రంగా మారుతోందని పలుదేశాల ప్రతినిధులు ప్రశంసించారు. ప్రపంచంలోనే అతిపెద్ద కృత్రిమ మేధ సదస్సుకు భారత్ వేదికైంది. దిల్లీలోని భారత మండపంలో జరుగుతోన్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్'లో 118 దేశాలు పాల్గొన్నాయి. గురువారం జరిగిన సదస్సు అధికారిక ప్రారంభ కార్యక్రమంలో పలువురు దేశాధినేతలు, టెక్ దిగ్గజాలు పాల్గొని కీలక ప్రసంగం చేశారు. కొత్త ఆవిష్కరణలు ఆర్థిక వ్యవస్థను వృద్ధి పథంలో నడిపిస్తాయి. ఏఐ నిర్మాణం అందరికీ చాలా ఉపయోగంగా ఉంటుంది. భారత్‌ను సందర్శించిన ప్రతిసారీ మార్పుల వేగం చూసి ఆశ్చర్యపోతున్నా. విద్యార్థిగా ఉన్నప్పుడు ఐఐటీ ఖరగ్‌పూర్‌కు విశాఖ మీదుగా వెళ్లేవాడిని. అదే విశాఖ తీరంలో ఇప్పుడు గూగుల్ ఫుల్ స్టాక్ ఏఐ హబ్ ఏర్పాటవుతోంది' అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తెలిపారు. డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు సాధిస్తోంది. గతంలో భారత్‌లో బ్యాంకు ఖాతా తెరవాలంటే సమస్యగా ఉండేది. ప్రస్తుతం ఎలాంటి పత్రాలు లేకుండానే బ్యాంకు ఖాతా తెరవగలుగుతున్నారు. ఫోన్‌లోనే బ్యాంకు ఖాతా తెరిచే సౌలభ్యం వచ్చింది. 140 కోట్ల మంది ప్రజలకు భారత్ డిజిటల్ ఐడెంటిటీ తీసుకొచ్చింది. ఆవిష్కరణల పథంలో అందరూ కలిసి ముందుకు సాగాలి. ప్రతినెలా 20 బిలియన్ల డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయి. 500 మిలియన్ల మందికి డిజిటల్ హెల్త్ ఐడీలు ఇచ్చారని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ ప్రశంసించారు. ఏఐ కృత్రిమమైనది కాదు.. వాస్తవమైనదని టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ వ్యాఖ్యానించారు. ఏఐ సదస్సులో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్యక్రమాలకు భారత్ సాక్షిగా నిలుస్తోంది. 140 కోట్ల మంది ప్రజలతో అతిపెద్ద డిజిటల్ ఐడెంటిటీ వ్యవస్థ కలిగిఉంది. ప్రపంచంలో జరిగే వాటిలో భారత్ నుంచే సగం డిజిటల్ లావాదేవీలు ఉన్నాయి. భారత్‌ను ఏఐ కేంద్రంగా ప్రధాని తీర్చిదిద్దుతున్నారు. సెమీకాన్ ఇండియా, ఇండియా ఏఐ మిషన్‌లో భాగంగా సాంకేతికత అభివృద్ధి జరుగుతోంది. ఏఐ నైపుణ్య శిక్షణలో భారత్ పురోభివృద్ధి సాధిస్తోందన్నారు. గత దశాబ్దకాలంగా ఏఐ వేగంగా ముందుకెళ్తోంది. అతి త్వరలోనే మనుషులు చేసే అత్యంత క్లిష్టమైన పనులను ఏఐ మోడళ్లు ⏭ తరువాయి 2లో..

# కర్నూలు క్లస్టర్ విశ్వవిద్యాలయం కోసం రూ.139 కోట్లు

### రూసా కింద రూ.55 కోట్లు ఇప్పటికే ఖర్చు చేశాం

### అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి లోకేశ్



**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 19 :** కర్నూలు క్లస్టర్ విశ్వవిద్యాలయం కోసం రూ.139 కోట్ల నిధులు మంజూరు చేశామని... దాంట్లో రూసా కింద రూ.55 కోట్లు ఖర్చు చేశామని మంత్రి లోకేశ్ వెల్లడించారు. ఏ కార్యక్రమం చేసినా క్లస్టర్ బేస్డ్ అప్రోచ్ తీసుకుంటున్నామని తెలిపారు. ఏపీ అసెంబ్లీ బ్జడెట్ సమావేశాలు ఆరో రోజు ప్రారంభమయ్యాయి. ప్రశ్నోత్తరాలతో సభను మొదలుపెట్టారు స్పీకర్ అయ్యన్నపాత్రుడు. కర్నూలు క్లస్టర్ విశ్వవిద్యాలయానికి సంబంధించి ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు. కర్నూలు పార్లమెంట్ చుట్టు పక్కల ఎక్కువ పెట్టుబడులు వస్తున్నాయన్నారు. క్లస్టర్ యూనివర్సిటీల్లో ఫోకస్ సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. అందుకే స్పెషలైజేషన్‌లపైనా శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. బ్యాలెన్స్ పనులు వచ్చే అకాడమిక్ ⏭ తరువాయి 2లో..

# ఉప్పాడతీర ప్రాంత అభివృద్ధే లక్ష్యం



### అన్నిశాఖల సమన్వయంతో ప్రణాళికలు

### ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 19 :** ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకార సోదరుల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా సమగ్ర ప్రణాళికను రూపొందించినట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో ఈ ప్రణాళికలకు రూపొందించినట్లు చెప్పారు. 'గతేడాది అక్టోబర్ 9వ తేదీన కాకినాడ కలెక్టరేట్‌లో మత్స్యకారులు ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు అన్వేషించాం. తీర కాలుష్య నివారణ, కోత నివారణ, మత్స్య సంపద వృద్ధి, అధునాతన పద్ధతుల్లో వేట, మార్కెటింగ్ సదుపాయాలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ, ఇలా మత్స్యకారుల జీవితాలకు భద్రత, భరోసా కల్పించేందుకు ⏭ తరువాయి 2లో..

# రాష్ట్రానికి వైకాపా హానికరం

## ఈ వార్నింగ్ నిరంతరం ఇవ్వాలి: పయ్యావుల



**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 19 :** గత ప్రభుత్వం ప్రతి శాఖలోనూ బకాయిలు మిగిల్చి వెళ్లిందని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. అధిక వడ్డీలతో తెచ్చిన రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించేలా సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. సుమారు రూ.2వేల కోట్ల మేర వడ్డీలు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ డబ్బుతో చాలా పథకాలు సమర్థంగా అమలు చేయవచ్చని తెలిపారు. శాసనసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చకు మంత్రి సమాధానమిచ్చారు. "గత ప్రభుత్వంతో పోల్చుకుంటే మైనింగ్ శాఖలో 33 శాతం, ఎక్సైజ్ శాఖలో 24 శాతం ఆదాయం పెరిగింది. గతంలో ఆ ఆదాయం తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లింది. వైకాపా హయాంలో తెలుగుజాతి ఎన్ని కష్టాలు పడిందో చూశాం. రాష్ట్రానికి ఆ పార్టీ హానికరమనే వార్నింగ్‌ను నిరంతరం ఇస్తూనే ఉండాలి. వైకాపా నెవర్ ఎగైన్.. వన్స్ ఎగైన్ కూటమి" అని పయ్యావుల కేశవ్ వ్యాఖ్యానించారు.

పులివెందుల నియోజకవర్గంలోని సమస్యలను కూడా గత పాలకులు పట్టించుకోలేదని మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. సీఎం చంద్రబాబు నిర్వహిస్తున్న జిల్లాల వారీ సమీక్షల్లో భాగంగా పులివెందుల నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యలు వెలుగులోకి వచ్చాయని ఆయన అన్నారు. పులివెందుల సమస్యలను గత పాలకులు గాలికి వదిలేస్తే.. కూటమి ప్రభుత్వం పరిష్కారానికి ప్రయత్నిస్తోందని చెప్పారు. మల్లెల గ్రామంలో మహాత్మా జ్యోతిబాపులే ఆంధ్రప్రదేశ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్) బాలికల పాఠశాల నిర్మాణం కోసం రూ.19.62 కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బనానా ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ హౌస్ నిర్మాణాన్ని గాలికి వదిలేశారని.. దానిని ప్రారంభించేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందని చెప్పారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో సమగ్ర నీటిసరఫరా పథకం నిర్మాణం పూర్తి చేయలేదని విమర్శించారు. వేంపల్లి నుంచి గండి వరకు రోడ్ విస్తరణ, కాలేటి వాగు రిజర్వాయర్ తదితర పనులను గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని మంత్రి వివరించారు.

# వైకాపా సభ్యులు క్షమాపణ కోరి లెంపలేసుకోవాలి

## అచ్చెన్నాయుడు



**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 19 :** శాసన మండలిలో వైకాపా సభ్యులు క్షమాపణలు చెప్పాకే కల్తీ లడ్డూ వ్యవహారంపై తాము చర్చిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఆ పార్టీ ఎమ్మెల్సీలు క్షమాపణలు కోరి లెంపలేసుకుంటేనే వారికి తిరుమల పేరెత్తే అర్హత ఉంటుందన్నారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, కొండపల్లి శ్రీనివాస్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు. లడ్డూలో కల్తీ జరిగిందని వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి అంగీకరించారని..వారిద్దరితో పాటు సిట్, వివిధ ల్యాబ్స్ కూడా కల్తీని ధ్రువీకరించాయని అచ్చెన్నాయుడు అన్నారు. గత 3 రోజులుగా మండలిలో వైకాపా వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమని మండిపడ్డారు. లడ్డూలో కల్తీ జరగలేదని ఆ పార్టీ ఎమ్మెల్సీలు సభలో అనడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు అబద్ధాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. ఇందాపూర్ డెయిరీ నుంచి హెరిటేజ్ చీజ్ కొనుగోలు చేస్తే.. ⏭ తరువాయి 2లో..




**హిందూపురం, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 19 :** ప్రముఖ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా నియోజకవర్గంలోని పట్టణ, మిగతా 2లో

## ఏపీ శాసనమండలిలో విజిల్స్ వేసి వైకాపా సభ్యుల హంగామా




**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 19 :** ఏపీ శాసనమండలి వరుసగా మూడోరోజూ ప్రారంభమైన కాసేపటికే వాయిదా పడింది. ఇందాపూర్ డెయిరీ–హెరిటేజ్ సంబంధాలపై చర్చించాలంటూ వైకాపా సభ్యులిచ్చిన ⏭ తరువాయి 2లో..

# హెరిటేజ్ చీజ్ ప్యాకెట్ చూపించి వైకాపా పరువు పోగొట్టుకుంది: బీఆర్ నాయుడు



**తిరుమల, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 19 :** కల్తీ నెయ్యి కేసులో పీకల్లోతు కూరుకుపోయిన వైకాపా నేతలు.. హెరిటేజ్‌పై ఆరోపణలు చేయడం దుర్మార్గమని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సంస్థ ఎప్పుడూ తితిదేకు నెయ్యి సరఫరా చేయలేదని.. ఇది నిప్పులాంటి నిజమని చెప్పారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "ప్రత్యక్షంగా, పరోక్షంగా నెయ్యి సరఫరాలో హెరిటేజ్ పాత్ర లేదు. అబద్ధాన్ని పదే పదే చెబితే నిజమవుతుందనుకోవడం మీ భ్రమ. మండలిలో ప్రతిపక్ష నేతగా బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న బొత్స సత్యనారాయణ అన్ని విషయాలు తెలుసుకుని మాట్లాడాలి. హెరిటేజ్ చీజ్ ప్యాకెట్ చూపించి నెయ్యి అని చెప్పి పరువు పోగొట్టుకున్నారు. జగన్ చెప్పినట్లు ఆడకుండా మాట్లాడే ముందు విజ్ఞతతో వ్యవహరించండి. నెయ్యి ధరలపైనా వైకాపా నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. ⏭ తరువాయి 2లో..

# అనుమతి లేకుండా భారత్ వీడను

## అనిల్ అంబానీ



**న్యూఢిల్లీ :** ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లనని రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ గురువారం సుప్రీం కోర్టుకు తెలిపారు. అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ ప్రమేయం ఉన్న రూ.40 వేల కోట్ల బ్యాంకింగ్, కార్పొరేట్ మోసం కేసుల్లో ఏజెన్సీల దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనిల్ అంబానీ విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని, ఈ కేసుల్లో సత్వర, నిష్పాక్షిక దర్యాప్తు చేపట్టాలని కోరుతూ మాజీ అధికారి ఈఏఎస్ శర్మ దాఖలు చేసిన పిల్‌కు ప్రతిస్పందనగా ఆయన ఈమేరకు అఫిడవిట్ దాఖలు చేశారు. "ఈ కేసుల్లో దర్యాప్తు మొదలు.. గతేడాది జులై నుంచి నేను దేశం విడిచి వెళ్లలేదు. ప్రస్తుతానికి విదేశాలకు వెళ్లే ఉద్దేశం, ప్రణాళికలేవీ లేవు. ఒకవేళ విదేశీ ప్రయాణం చేయాల్సి వస్తే.. కోర్టు నుంచి ముందస్తు అనుమతి తీసుకుంటాను. సంబంధిత కేసుల్లో దర్యాప్తు సంస్థలకు అత్యంత నిజాయతీతో పూర్తిగా సహకరిస్తున్నాను. మున్ముందు కూడా కొనసాగిస్తాను" అని అనిల్ అంబానీ తెలిపారు. చట్ట ప్రక్రియ నుంచి తప్పించుకునే ఉద్దేశం తనకు లేదని, తాను అలాంటి వ్యక్తిని కాదని పేర్కొన్నారు.

**ఏఐలో జియో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు: ముకేశ్ అంబానీ**

మనీలాండరింగ్ కేసులో ఈ నెల 26న విచారణకు హాజరు కావాలని ఈడీ సమన్లు జారీ చేసిందని, హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నానని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ⏭ తరువాయి 2లో..

## 'నీ అంతు చూస్తా'.. ఎస్సైపై అంబటి రాంబాబు దురుసు ప్రవర్తన

**గుంటూరు (ఏఎన్‌యూ):**

వైకాపా నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మరోసారి నోరు పారేసుకున్నారు. సీఎం చంద్రబాబుపై మురికి వ్యాఖ్యల కేసులో అరెస్టయి, బెయిల్ రావడంతో జైలు నుంచి విడుదలైన రాంబాబు.. రాజమహేంద్రవరం నుంచి భారీ కాన్వాయ్‌తో స్వగృహానికి బయల్దేరారు. ఈ క్రమంలో గుంటూరు జిల్లా కాజా టోల్‌గేట్ వద్ద వైకాపా నేతలు హడావుడి చేశారు. పోలీసులపై రాంబాబు దురుసుగా ప్రవర్తించారు. వాహనాలు వరుసలో రావాలని చెప్పిన మంగళగిరి ఎస్సై వెంకట్‌పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నీ అంతు చూస్తా'నని బెదిరించారు.

## ఏఐ ఎక్స్‌పోలో చైనా రోబో వివాదం


**- వెంటనే స్టాల్‌ను ఖాళీ చేయించిన ప్రభుత్వం**

**- దేశ ప్రతిష్ఠను దెబ్బతీశారన్న రాహుల్ గాంధీ**



**దిల్లీ:** దేశ రాజధానిలో జరుగుతున్న అంతర్జాతీయ ఏఐ ఎక్స్‌పోలో ఓ ప్రైవేటు విశ్వవిద్యాలయం చేసిన తప్పిదం తీవ్ర వివాదానికి దారి తీసింది. చైనాలో తయారైన ఓ రోబో డాగ్‌ను తామే తయారు చేశామని ఆ విశ్వవిద్యాలయ ప్రతినిధి ప్రకటించడం వివాదానికి కారణమైంది. వెంటనే స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఎక్స్‌పో నుంచి ఆ విశ్వవిద్యాలయ స్టాల్‌ను తొలగించింది. నొయిడాకు చెందిన గల్గోటియాస్ వర్సిటీ ఏఐ ఎక్స్‌పోలో ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసింది. అందులో ఒక రోబో డాగ్‌ను ప్రదర్శించింది. దీనిపై ఆ వర్సిటీ కమ్యూనికేషన్స్ ప్రొఫెసర్ నేహా సింగ్ డీడీ న్యూస్‌తో మంగళవారం మాట్లాడారు. ఆ రోబోను తమ వర్సిటీకి చెందిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ తయారు చేసిందని వివరించారు. ఈ వీడియో వైరల్ కావడంతో సోషల్ మీడియాలో ఆ రోబో అసలు విషయాన్ని బయటపెట్టారు. అది యూనిట్రీ గో-2 రోబో అని, చైనాలోని యూనిట్రీ తయారు చేసిందని వెల్లడించారు. దీంతో వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆ వర్సిటీ స్టాల్‌ను ఖాళీ చేయించింది. మరోవైపు వర్సిటీ యాజమాన్యం క్షమాపణలు చెప్పింది. ఆ రోబో డాగ్ సాంకేతిక మూలాల గురించి తమ ప్రతినిధికి తెలియదని, కెమెరా ముందు అత్యుత్సాహంతో తప్పుడు సమాచారాన్ని అందించారని ఓ ప్రకటనలో తెలిపింది. ఏఐ సమిట్‌లో చైనా వస్తువులను ప్రదర్శించి దేశ ప్రతిష్ఠను దెబ్బతీశారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ విమర్శించారు. అస్తవ్యస్తంగా ఏర్పాటు చేసిన ఒక ప్రచార ఆర్భాటంగా ఏఐ సదస్సును ఆయన అభివర్ణించారు.

## 'ఘోస్ట్ ఉద్యోగి'కి.. వేతన రూపంలో రూ.10 కోట్లు



**అమెరికా :** అమెరికాలో ఓ భారత సంతతి వ్యక్తి చేసిన మోసం వెలుగు చూసింది. తప్పుడు పత్రాలతో తన స్నేహితుడిని నియమించుకొని సంస్థకు 1.2 మిలియన్ డాలర్ల (సుమారు రూ.10 కోట్లు) మేర నష్టం కలిగించినట్లు తేలింది. పని చేయకున్నా వేతనంతోపాటు ఇతర సదుపాయాలు పొందడం గమనార్హం. 'ఘోస్ట్ ఉద్యోగి' వ్యవహారంపై దర్యాప్తు జరిపిన న్యాయస్థానం.. అతడు అధికార దుర్వినియోగంతో సంస్థను మోసం చేసినట్లు నిర్ధరించింది.

భారత సంతతికి చెందిన కరణ్ గుప్తా.. మిన్నెసోటా రాష్ట్రంలో ఉన్న యునైటెడ్‌హెల్త్ గ్రూప్‌లో పనిచేసేవాడు. దానికి అనుబంధ సంస్థ 'ఆప్టమ్'లో డేటా అనలటిక్స్ విభాగానికి సీనియర్ డైరెక్టర్‌గా చేశాడు. అతడి వార్షిక వేతనం 2.60లక్షల డాలర్ల కంటే ఎక్కువే. ఈ క్రమంలో కొన్నేళ్లక్రితం తన చిరకాల మిత్రుడిని ఆ సంస్థలో చేర్చుకోవాలని భావించాడు. అతడికి అర్హత లేకున్నా తప్పుడు దస్త్రాలు (రెజ్యూమె సహా ఇతర) సృష్టించి 2015లో ఉద్యోగిగా నియమించుకున్నాడు. తన టీమ్‌లోనే పనిచేసేలా కేటాయించుకున్నాడు.

**ఇకపై వారికి 'ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ'..**


**ఇమిగ్రేషన్ రూల్స్‌లో కెనడా మార్పులు**

అతడి మిత్రుడు సంస్థలో పనిచేయకున్నా ప్రారంభంలో లక్ష డాలర్లకుపైగా వార్షిక వేతనం అందుకున్నాడు. ప్రతి ఏటా జీతం పెంపుతో పాటు బోనస్‌లను కూడా పొందాడు. ఉద్యోగిగా వేతనం పొందుతున్నప్పటికీ ఆ సంస్థలో ఒక్క సహోద్యోగినీ కలవలేదు. ఆయనకు సంబంధించి ఒక్క మెయిల్ లేదు. అసలు అతనికి కేటాయించిన కంప్యూటర్‌లో లాగిన్ కూడా కాలేదు. అయితే, అతడి స్నేహితుడికి వచ్చే జీతంలో సగానికిపైగా గుప్తా ఖాతాలోకి చేరేవి. న్యూజెర్సీలో ఉండే ఆ స్నేహితుడు నగదు విత్‌డ్రా చేసి గుప్తా అకౌంట్‌లో వేసేవాడు.

అయితే, 2019 నవంబర్‌లో ఓ మోసం కేసులో గుప్తాను ఆ సంస్థ ఉద్యోగం నుంచి తొలగించింది. అదే సమయంలో ఈ వ్యవహారం బయటపడింది. సంస్థ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన దర్యాప్తు సంస్థలు.. మొత్తంగా దాదాపు 1.2 మిలియన్ డాలర్లు (సుమారు రూ.10 కోట్లు) మోసం చేయడంతోపాటు, మనీలాండరింగ్ కుట్ర ఉన్నట్లు పేర్కొన్నాయి. అధికార దుర్వినియోగానికి పాల్పడిన గుప్తా.. ఘోస్ట్ ఉద్యోగిని నియమించుకొని సంస్థను మోసగించినట్లు న్యాయస్థానం నిర్ధరించింది. ఈ వ్యవహారానికి సంబంధించి న్యాయశాఖ పూర్తి వివరాలు వెల్లడించింది.

# ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ట్యూటర్ ప్రయోగాత్మకంగా అమలు

**ఐఐటీ మద్రాస్‌తో పాఠశాల విద్యాశాఖ ఒప్పందం 20న**



**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 19 :**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కృత్రిమ మేధ(ఏఐ) ట్యూటర్ విధానాన్ని తీసుకొస్తోంది. ఐఐటీ మద్రాస్ రూపొందించిన డిజిటల్ లెర్నింగ్ విధానాన్ని ప్రయోగాత్మకంగా ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయనున్నారు.

దీనికి సంబంధించి దిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సదస్సులో 20న (శుక్రవారం) ఐఐటీ మద్రాస్‌తో పాఠశాల విద్యాశాఖ ఒప్పందం కుదుర్చుకోనుంది. ప్రభుత్వ పాఠశాలలకు ఐఐటీ మద్రాస్ ఈ సాంకేతిక సహాయాన్ని ఉచితంగా అందించనుంది. పాఠశాల విద్యాశాఖ వద్ద ఉన్న కంటెంట్‌ను ఐఐటీ మద్రాస్‌కు అందిస్తుంది. దీన్ని విద్యార్థుల డివైజెస్‌కు అక్కడి నుంచి పంపిస్తారు. తెలుగు, ఆంగ్లం హిందీ భాషల్లో కంటెంట్ ఉంటుంది. మొబైల్ యాప్, వెబ్, వాట్సప్ ఇంటర్‌ఫేస్‌లలో పని చేస్తుంది. విద్యార్థులు నచ్చిన పాఠాన్ని నేర్చుకోవచ్చు. విద్యార్థి ఎంతవరకు నేర్చుకున్నారనేదాన్ని అక్కడే ప్రశ్నలు ఇస్తారు. వాటికి రాసిన సమాధానాల ఆధారంగా విద్యార్థి అభ్యసన సామర్థ్యాలను అంచనా వేస్తుంది.

**ఏం చేస్తుంది..**

పాఠశాలల్లో స్వీయ లెర్నింగ్ సంస్కృతిని నిర్మిస్తుంది

పాఠ్యాంశాలకు అనుగుణంగా సంభాషణాత్మక బోధన

వాయిస్, టెక్స్ట్ ఆధారిత ఇంటరాక్షన్

విద్యార్థి గత సమాచారం ఆధారంగా సందర్భానుసారంగా సమాధానాలు

తాత్కాలిక పునశ్చరణ (రెమిడియల్) కోచింగ్‌పై ఆధారపడడాన్ని తగ్గించడం

వినియోగం, అభ్యాస ధోరణులపై డ్యాష్ బోర్డులు

తరగతి అభ్యసనను పటిష్టం చేస్తుంది

పాఠ్యపుస్తకాలు, దీక్ష, ఎస్‌సీఈఆర్టీ, ఎన్‌సీఈఆర్టీ మెటీరియల్ వినియోగం తప్పుదోవ పట్టించే సమాధానాలు లేకుండా నియంత్రణ

**అమలు నమూనా..:** విద్యార్థులు వాళ్ల ఇంటి వద్ద ఉండే సెల్‌ఫోన్లు, పాఠశాలల్లోని కంప్యూటర్ ల్యాబ్‌ల ద్వారా ఏఐ ట్యూటర్‌ను వినియోగించవచ్చు. కొన్ని పాఠశాలల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్యాబ్‌ల ద్వారా ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవచ్చు.

# ఏఐ మనల్ని కాదు.. మనం ఏఐని శాసించాలి: ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ :** కృత్రిమ మేధ సామర్థ్యం మన ఆలోచనలకు అందనంత దూరంలో ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఏఐ వినియోగం చట్టబద్ధంగా, పునఃసమీక్షించేలా ఉండాలన్నారు. దేశ రాజధాని దిల్లీలో జరుగుతోన్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు'లో ప్రధాని మోదీ గురువారం ప్రసంగించారు. మానవ అభివృద్ధిలో ఏఐ కీలక భూమిక పోషిస్తోందని తెలిపారు. మేకిన్ ఇండియా, భారత ఆవిష్కరణ సామర్థ్యాన్ని ఈ సదస్సు చాటుతోందని పేర్కొన్నారు.

**ఏఐకి పరివర్తన శక్తి..**


"ప్రపంచంలోనే ఆరోవంతు జనాభా భారత్‌లోనే ఉంది. కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. కృత్రిమ మేధను ఉపయోగించుకోవడంలో దేశ యువత ఆసక్తి కనబరుస్తోందని తెలిపారు. భారత్ ఏఐ పురోభివృద్ధి ఒక చరిత్రగా నిలుస్తుంది. కృత్రిమ మేధకు పరివర్తన శక్తి ఉంది. దాన్ని దుర్వినియోగం చేస్తే విధ్వంసానికి దారితీస్తుంది. అదే సద్వినియోగం చేసుకుంటే పరిష్కారాలు చూపుతుంది. మనుషులు, సాంకేతికత కలిసి అభివృద్ధి పయనం సాగించే శకంలో ఉన్నాం. భవిష్యత్తులో ఏఐ ఏం చేయగలదో కాదు.. ప్రస్తుతం కృత్రిమ మేధను ఉపయోగించి మనం ఏం చేయగలమనేదే అసలు ప్రశ్న. ప్రజల సంక్షేమం, శ్రేయస్సే ఏఐకి మన బెంచ్‌మార్క్‌లు. మానవ కేంద్రీకృత ఏఐ నిర్మాణం మన లక్ష్యం కావాలి. కృత్రిమ మేధ మనల్ని కాదు.. మనం ఏఐని శాసించాలి" అని మోదీ వివరించారు.

**'మానవ్' విజన్‌తో..**

కృత్రిమ మేధ వినియోగంలో 'మానవ్ విజన్' ఉండాలని ప్రధాని మోదీ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ విజన్ అర్థం, ఫ్రేమ్‌వర్క్‌ను కూడా ఆయన వివరించారు. దానర్థం ఏంటంటే..

- మోరల్ అండ్ ఎథికల్ సిస్టమ్: నైతిక విలువలు, బాధ్యతలను పరిగణనలోకి తీసుకుని ఏఐ వ్యవస్థలకు మార్గనిర్దేశం చేయాలి.
- అకౌంటబుల్: పారదర్శక నిబంధనలతో, జవాబుదారీతనంతో ఏఐ వ్యవస్థలు పనిచేయాలి.
- నేషనల్ సావర్నిటీ: ఒక దేశంలో సృష్టించిన డేటా.. ఆ దేశానికే చెందాలి. ఆ దేశ పరిధిలోనే ఉండాలి.
- యాక్సెసిబుల్ అండ్ ఇంక్లూజివ్: ఏఐ వ్యవస్థలు గుత్తాధిపత్యంతో పని చేయకుండా అన్నివర్గాల వారికీ అందుబాటులోకి రావాలి.
- వేలిడ్ అండ్ లెజిటిమేట్: ఏఐ చట్టబద్ధంగా, విశ్వసనీయమైనదిగా పనిచేయాలి. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి అని మోదీ వెల్లడించారు.

# 37 రాజ్యసభ స్థానాలకు మార్చి 16న ఎన్నికలు



**ఈ నెల 26న నోటిఫికేషన్ విడుదల చేయనున్న ఈసీ**

**తెలంగాణ నుంచి 2 సీట్లకు..**

**దిల్లీ:** వచ్చే ఏప్రిల్‌లో ఖాళీ కానున్న 37 రాజ్యసభ స్థానాలను భర్తీ చేసేందుకు మార్చి 16న ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ద్వైవార్షిక ఎన్నికల కోసం ఎన్నికల సంఘం (ఈసీ) బుధవారం షెడ్యూలు ప్రకటించింది. ఈ నెల 26న సంబంధిత ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని.. వచ్చే నెల 16న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఓట్ల లెక్కింపు చేపడతామని తెలిపింది.

10 రాష్ట్రాలకు చెందిన ఈ 37 రాజ్యసభ స్థానాలు ఏప్రిల్ 2, 9 తేదీలతో ఖాళీ కానున్న సంగతి గమనార్హం. వీటిలో అత్యధికంగా మహారాష్ట్ర నుంచి ఏడు సీట్లు ఉన్నాయి. తర్వాతి స్థానాల్లో తమిళనాడు (6), పశ్చిమ బెంగాల్ (5), బిహార్ (5), ఒడిశా (4), అస్సాం (3), తెలంగాణ (2), ఛత్తీస్‌గఢ్ (2), హరియాణా (2), హిమాచల్ ప్రదేశ్ (1) ఉన్నాయి. ఏప్రిల్‌లో పదవీకాలం ముగియనున్న ప్రముఖ నేతల్లో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ (జేడీయూ), శరద్ పవార్ (ఎన్‌సీపీ-ఎస్పీ), రాందాస్ అఠవాలే (ఆర్‌పీఐ-ఏ), తిరుచ్చి శివ (డీఎంకే) తదితరులు ఉన్నారు. తెలంగాణ నుంచి ఎగువ సభకు ఎన్నికైన అభిషేక్ సింఘ్వీ (కాంగ్రెస్), కె.ఆర్.సురేశ్ రెడ్డి (భారాస) పదవీకాలం ఏప్రిల్ 9తో పూర్తికానుంది.

ప్రస్తుతం మహారాష్ట్ర, ఒడిశా, బిహార్, ఛత్తీస్‌గఢ్, హరియాణా, అస్సాంలలో భాజపా సొంతంగానో, పాలక సంకీర్ణంలో మిత్రపక్షంగానో అధికారంలో ఉంది. ఎగువ సభలో పార్టీ బలం పెరిగేందుకు ఇది దోహదపడనుంది. ఏప్రిల్‌లో 9 మంది భాజపా ఎంపీలు పదవీ విరమణ చేయనున్నారు. రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీ 15-18 స్థానాలు గెల్చుకునే అవకాశాలు ఉన్నాయి. హిమాచల్, తమిళనాడు, తెలంగాణ, బెంగాల్‌లలో విపక్ష పార్టీల ప్రభుత్వాలు ఉన్నాయి.

**బెంగాల్ నుంచి ప్రాతినిధ్యం కోల్పోనున్న వామపక్షాలు**

బెంగాల్‌లో ఎన్నికలు జరగనున్న ఐదు రాజ్యసభ స్థానాల్లో నాలుగింటిని దక్కించుకునే బలం తృణమూల్ కాంగ్రెస్‌కు ఉంది. మిగిలిన ఒక్క స్థానం భాజపా ఖాతాలో పడొచ్చు. బెంగాల్‌ను 2011 వరకు వరుసగా మూడు దశాబ్దాలు పాలించిన వామపక్షాలు.. రాష్ట్రం నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యాన్ని తొలిసారిగా ఈ ఎన్నికలతో పూర్తిగా కోల్పోనున్నాయి. సీపీఎం నేతృత్వంలోని వామపక్ష కూటమికి బెంగాల్‌లో ప్రస్తుతం లోక్‌సభ సభ్యులు కూడా లేరు. అసెంబ్లీలోనూ కూటమికి ప్రాతినిధ్యం లేకపోవడం గమనార్హం.

**సింఘ్వీకి మళ్లీ అవకాశం!**

ఈనాడు, హైదరాబాద్: రాజ్యసభ ఎన్నికల ప్రకటన వెలువడటంతో రాష్ట్ర కాంగ్రెస్ నేతల్లో టికెట్ కోసం పోటీ మొదలైంది. రాష్ట్రంలోని ఇద్దరు రాజ్యసభ సభ్యులు భారాసకు చెందిన సురేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి అభిషేక్ సింఘ్వీ పదవీకాలం పూర్తవుతున్నందున వచ్చే నెల 16న ఎన్నికలు జరగనున్నాయి. ఈ దఫా ఈ రెండు సీట్లు కాంగ్రెస్‌కే దక్కనున్నాయి. సింఘ్వీకి గతంలో రాష్ట్రం నుంచి టికెట్ ఇచ్చినా... పూర్తికాలం ఎంపీగా అవకాశం దక్కనందున మరోసారి ఆయనకు కాంగ్రెస్ అభ్యర్థిత్వం దాదాపు ఖరారయ్యే అవకాశాలున్నాయి. ఆయన సేవలు దిల్లీలో అవసరమని, తిరిగి తెలంగాణ తరఫున ఎంపీగా కొనసాగించేందుకు అవకాశం ఇవ్వాల్సి ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో మిగిలిన మరో సీటు కోసం పెద్దసంఖ్యలో కాంగ్రెస్ నేతలు పోటీపడుతున్నారు. గతంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ టికెట్ రానివారితో పాటు, గత రెండేళ్లుగా ప్రభుత్వానికి చిత్తశుద్ధితో సహకరిస్తున్న నేతలు పలువురు ఆశిస్తున్నారు. ప్రధానంగా సీఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డికి ఈసారి అవకాశం దక్కే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది.

## ఉప్పాడతీర ప్రాంత అభివృద్దే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ ప్రణాళికలో పొందుపర్చాం. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపర్చడంతోపాటు వ్యవసాయ అభివృద్ధి, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన తదితర అంశాలను కూడా పరిగణలోకి తీసుకున్నాం అని ఆయన అన్నారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు, మెరైన్ ఫిషరీస్ నిపుణులు, జిల్లా అధికారుల సహకారంతో రూపొందించిన ఈ ప్రణాళికను త్వరలో పిఠాపురం పర్యటనలో ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నిర్దిష్ట లక్ష్యంతో రూపొందించిన ప్రణాళిక - ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానని పవన్ అన్నారు.

## హెరిటేజ్ చీజ్ ప్యాకెట్ చూపించి వైకాపా పరువు పోగొట్టుకుంది: బీఆర్ నాయుడు

(మొదటి పేజీ తరువాయి)

ఓపెన్ టెండర్లలో పారదర్శకంగా వీటిని నిర్ణయించాం. మా పాలకవర్గం రాగానే మొదటగా మేం స్వామి వారి అన్న ప్రసాదాల నాణ్యతలో రాజీపడకూదని నిర్ణయించుకున్నాం. తక్కువ ధరలకు సరకులు కొని స్వామి వారికి నాణ్యత లేని నైవేద్యాలు, భక్తులకు అన్న ప్రసాదాలు అందించడమేంటి ఈ విషయంలో మేం రాజీపడే ప్రసక్తే లేదు. నెయ్యి ఒక్కటే కాదు అన్ని రకాల పదార్థాల్లోనూ నాణ్యతా ప్రమాణాలు పెంచాం. స్వామివారికి సమర్పించే వాటిలో డబ్బు ఎంత ఖర్చు అవుతుందని లెక్కలు వేసుకోం. ఇదంతా ఆయన సొమ్మే. దేవదేవుని సొమ్మును నైవేద్యాలకు, అన్న ప్రసాదాలకు వాడే అంశంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడేది లేదు" అని బీఆర్ నాయుడు పేర్కొన్నారు.

## అనుమతి లేకుండా భారత్ వీడను

(మొదటి పేజీ తరువాయి)

తన ప్రవర్తన పారదర్శకంగా, కేసుల దర్యాప్తునకు సహకరించే విధంగా ఉందని చెప్పేందుకే ఈ అఫిడవిట్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఈ కేసుల దర్యాప్తులో జాప్యంపై ఈ నెల 4న సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. దర్యాప్తును ముమ్మరం చేయాలని సీబీఐ, ఈడీలను ఆదేశించింది.

## హిందూపురంలో ఎమ్మెల్యే బాలకృష్ణ అభివృద్ధి పనులకు శంఖుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)

గ్రామీణ ప్రాంతాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు గురువారం భూమి పూజ, శంకుస్థాపన చేశారు. తొలుత లేపాక్షి మండలం మనేంపల్లిలో రూ.2.60 కోట్లతో ఏర్పాటు చేయనున్న బీటీ రోడ్డుకుబాలకృష్ణ భూమి పూజ చేశారు. స్వయంగా ప్రొక్లెయిన్ ఆపరేట్ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం మండలంలోని పులమతి చెరువులో పూజలు నిర్వహించి జల హారతి ఇచ్చారు. ఇటీవల హంద్రీనీవా నీటితో నియోజకవర్గంలోని చెరువులను నింపిన నేపథ్యంలో ఎమ్మెల్యేకు ప్రజలు కృతజ్ఞతలు చెప్పారు.

## వైకాపా సభ్యులు క్షమాపణ కోరి లెంపలేసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

దానితో తిరుమల లడ్డూకు సంబంధం ఏంటని అచ్చెన్నాయుడు నిలదీశారు. చీజ్ ప్యాకెట్, నెయ్యి ప్యాకెట్‌కూ తేడా తెలియని స్థితిలో వైకాపా ఉందని ఉందని ఎద్దేవా చేశారు. కల్తీ బురదలో కూరుకుపోయి ఎలా బయటకు రావాలో తెలియని దుస్థితిలో ఆ పార్టీ ఉందన్నారు. సీఎం చంద్రబాబు వేంకటేశ్వర స్వామి భక్తుడనే విషయం అందరికీ తెలుసని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. అలిపిరి ఘటనలో ఆయన ప్రాణాలు నిలబెట్టింది వేంకటేశ్వర స్వామేననే నమ్మకం చంద్రబాబుదని చెప్పారు. అలాంటి స్వామికి అపకీర్తి తెచ్చే పనిని ఆయన ఎప్పుడూ చేయరన్నారు. జగన్ మానస పుత్రిక అమూల్ కూడా ఇందాపూర్ నుంచి కొన్ని కొనుగోళ్లు చేసిందన్నారు. హెరిటేజ్‌తో ఇందాపూర్ డైరెక్టర్లకు ఎక్కడైనా సంబంధం ఉందా అని మంత్రి కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. అలాంటి ఆధారం ఒక్కటైనా వైకాపా చూపించగలదా అని సవాల్ విసిరారు.

## ఏపీ శాసనమండలిలో విజిల్స్ వేసి వైకాపా సభ్యుల హంగామా

(మొదటి పేజీ తరువాయి)

వాయిదా తీర్మానాలను ఛైర్మన్ మోషేన్‌రాజు తిరస్కరించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైకాపా సభ్యులు నినాదాలు చేస్తుండటంపై మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ప్రతిరోజూ ఒకే అంశంపై వాయిదా తీర్మానం తెచ్చి సభా సమయాన్ని వృథా చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ క్రమంలో వైకాపా ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, బొమ్మి ఇజ్రాయెల్, మొండితోక అరుణ్ కుమార్ తదితరులు ఛైర్మన్ పోడియం వద్ద విజిల్స్ వేసి హంగామా సృష్టించారు. మండలిలో విజిల్స్ వేయడం పెద్దల సభ ప్రతిష్ఠను దెబ్బతీయడమేనని అధికార పార్టీ సభ్యులు మండిపడ్డారు. సభలోకి విజిల్స్ ఎలా తెచ్చారనే అంశంపై అసెంబ్లీ భద్రతా సిబ్బంది ఆరా తీస్తున్నారు.

## అధికవడ్డీ రుణాలపై వడ్డీ తగ్గింపు

(మొదటి పేజీ తరువాయి)

సులువుగా పూర్తి చేసే రోజులు రానున్నాయి. ఏఐతో అవకాశాలతో పాటు సవాళ్లూ ఉన్నాయి. ఆ సవాళ్లను పరిష్కరించడంలో భారత్ కీలక పాత్ర పోషించనుందని ఆంథ్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ పేర్కొన్నారు.

## కర్నూలు క్లస్టర్ విశ్వవిద్యాలయం కోసం రూ.139 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఇయర్‌లో పెండింగ్ నిధులు మంజూరు చేస్తామని మంత్రి లోకేశ్ సభలో పేర్కొన్నారు.సమగ్ర శిక్షా అభియాన్ కింద పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగుల వేతనాలను 50 శాతం పెంచే ఉద్దేశం ఉందా అని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు ప్రశ్నించారు. వీరంతా చాలా తక్కువ జీతాలతో పనిచేస్తున్నారని తెలిపారు. వారి జీతభత్యాలు పెంచాలని, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఆ తర్వాత ఎమ్మెల్యే పార్థసారథి కస్తూరిబా బాలికా విద్యాలయాలపై మాట్లాడారు. కస్తూరిబా బాలికా విద్యాలయాల్లో ఆడపిల్లలకు గొప్పగా విద్యనందిస్తున్నాయని తెలిపారు. ఏపీ ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు దొరకని పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం 79 శాతం ఉత్తీర్ణత ఉన్న స్కూళ్లు త్వరలో 90 శాతం ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉందని తెలిపారు. మరిన్ని కస్తూరిబా బాలికా విద్యాలయాలను ప్రారంభించాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేశ్ సమాధానం ఇచ్చారు. సమగ్ర శిక్షా అభియాన్ కింద పనిచేస్తున్న ఉపాధ్యాయులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఎంత వేతనం చెల్లిస్తున్నారని మంత్రి నారా లోకేశ్ ప్రశ్నించారు. దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువ జీతాలు ఇస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఈ పథకం కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉందని, ఈ అంశాలను కేంద్ర దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే, సీజనల్ హాస్టళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు మంత్రి లోకేశ్. త్వరలోనే వాటిని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. డీఎస్సీలో కర్నూలు జిల్లాకు అదనపు ఉపాధ్యాయులను శాంక్షన్ చేశామన్నారు.

# పగలు ఖాళీ.. రాత్రుళ్లు లూటీ



**అనకాపలి, విశాఖసమాచారం:** అనకాపల్లి గ్రామీణం సంపతిపురం కొండవాలుప్రాంతంలో తవ్వకాలు అనకాపల్లి: జిల్లాలో గ్రావెల్ తవ్వకందారుల దందాకు అడ్డుకట్ట పడటం లేదు. గత ప్రభుత్వ హయాంలో చెలరేగిపోయిన వారు ఇటీవల కాలంలో మళ్లీ విజృంభించారు. రాత్రయితే చాలు.. కొండలను కొల్లగొట్టేస్తూ.. జేబులు నింపుకొంటున్నారు. కూటమి నేతలు ఈ దందాకు అడ్డుకట్ట వేయకపోగా తమవంతు మద్దతు ఇస్తున్నారు. అనకాపల్లి రూరల్, సబ్బవరం, చోడవరం మండలాల్లో తవ్వకాలపై ఫిర్యాదులు వస్తున్నా అధికారులు అడ్డుకట్ట వేసే దిశగా అడుగులు వేయడం లేదు. పగలు ఖాళీగా కనిపిస్తున్న క్వారీలు రాత్రయితే వాహనాలు, యంత్రాలతో నిండిపోతున్నాయి. అనకాపల్లి మండలం సంపతిపురం సర్వే నం. 2లోని కొండవాలులో పేదలకు ఇంటిస్థలాలు కేటాయించారు. ఇక్కడ ప్రతిరోజూ రాత్రి 11 గంటలు దాటిన తర్వాత భారీ యంత్రాలతో తవ్వేస్తూ అనకాపల్లి పరిసర ప్రాంతాల్లోని ఇంటి పునాదులకు, లేఅవుట్ల చదునుకు వేస్తున్నారు. రామాపురం కాలనీ సమీపంలోని బ్రిడ్జిమీదుగా అనకాపల్లి పట్టణం గుండా మట్టిలారీలు రాత్రి వేళ రయ్‌రయ్ మంటూ తిరుగుతున్నా.. కనీసం పట్టించుకోవడం లేదు. సబ్బవరం మండలం గ్రావెల్ దందాకు అడ్డాగా మారింది. నిన్న, మొన్నటివరకు గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు సాగించిన వారు ఇప్పుడు బరితెగించారు. గంగవరం, వెదుళ్లనరవ, నంగినారపాడు, అసకపల్లి, రాయపుర అగ్రహారం, గాలిభీమవరం గ్రామాలను ఆనుకొని ఉన్న కొండవాలులో తవ్వకాలు చేస్తున్నారు. గతంలో వైకాపాలో చక్రం తిప్పినవారే ఇప్పుడు కూటమి నేతలతో జతకట్టారు. ఇప్పటివరకు ట్రాక్టర్లతో సాగిన దందా.. ఇప్పుడు భారీ లారీల స్థాయికి చేరింది. కొన్నాళ్ల క్రితం గాలిభీమవరం, అసకపల్లి గ్రామాల ప్రజలు దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా.. అడపాదడపా తనిఖీలు చేసి మమ అనిపించేశారు. చోడవరం మండలం వెంకన్నపాలెం, దుడ్డుపాలెం, సేమునాపల్లి గ్రామాల పరిధిలోని కొండలు, చెరువు ప్రాంతాలకు రాత్రి 10 గంటల తర్వాత వాహనాలు వరుసకడుతున్నాయి. ఇక్కడ ఎక్కడా తవ్వకాలకు అనుమతులు లేకపోయినా.. నేతల పేర్లు చెప్పి దందా సాగిస్తున్నారు. దూరాన్ని బట్టి సొమ్ము వసూలు చేస్తున్నారు. మైనింగ్, రెవెన్యూ అధికారులు తెలిసినా.. కనీసం తనిఖీలు చేయడం లేదు. సహజవనరులను కొల్లగిడితే చర్యలు..

– శ్రీనివాస్, మైనింగ్ ఏడీ, అనకాపల్లి

ప్రభుత్వ నిర్మాణాలకు గ్రావెల్‌ను తరలించుకునేందుకు అనుమతులు ఇచ్చాం. అనధికారికంగా తవ్వడం నేరం. అనుమతులు తప్పనిసరి. అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ఫిర్యాదులు అందిన వెంటనే క్షేత్రస్థాయి సిబ్బందిని పంపించి పరిశీలిస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా సహజవనరులను కొల్లగొడితే కఠిన చర్యలు తప్పవు.


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

టెండరు నెం. MCSW-Brake-Van-25-26-29

పని పేరు: బ్రేకు వ్యాన్స్ నందు అడ్జస్టబుల్ గార్డు కుర్చీలు & ఇతర అవశ్యకమైన సదుపాయములు ఏర్పాటు చేయుట మరియు పిరియాడికల్ ఓవర్ హాలింగ్ సమయంలో బ్రేకు వ్యాన్స్ యొక్క అప్ గ్రేడేషన్ చేయుటను క్యారేజ్ రిపేరు వర్క్‌షాప్, మంచేశ్వర్ మరియు వాల్తేరు డివిజన్ వద్ద నిర్వర్తించుట.

ప్రకటిత విలువ: ₹ 9,40,51,120.50, బయానా: ₹ 6,20,300/-, పని పూర్తి చేయు కాలం: 24 నెలలు.

బిడ్డింగ్ ప్రారంభ తేదీ: 20.02.2026,

టెండరు ముగింపు తేదీ మరియు సమయం: 06.03.2026న 1500 గంటలకు.

ఈ టెండరునకు మాన్యువల్ ఆఫర్లు అనుమతించరు మరియు ఎవైన అట్టి మాన్యువల్ ఆఫర్ అందినచో తిరస్కరిస్తారు.

ఇ-టెండరు డాక్యుమెంట్లుతోపాటు పూర్తి సమాచారం & సవరణ లభించు వెబ్‌సైట్: www.ireps.gov.in

డిప్యూటి ఛీఫ్ మెకానికల్ ఇంజనీరు (POH-II) CRW/మంచేశ్వర్

PR-1138/Q/25-26


# పడిపోయిన హాట్ మెటల్ తయారీ



**సాగర్‌నగర్, విశాఖసమాచారం:** విశాఖపట్నం, ఉక్కునగరం ( స్టీల్ – సెక్టారు–3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారంలో మళ్లీ ఉత్పత్తికి ఆటంకం ఏర్పడుతోంది. ఈ ఏడాది జనవరిలో రూ.54కోట్ల లాభాలు రాగా, మరింత ప్రణాళికతో ముందుకు వెళ్లాల్సిన సమయంలో అడుగులు తడబడుతున్నాయి. కోక్, ముడి సరకు కొరతే దీనికి కారణమని చెబుతున్నారు.

దెబ్బతిన్న కోకోవెన్ బ్యాటరీలు: విశాఖ ఉక్కులో ఐదు కోకోవెన్‌లు ఉన్నాయి. ఇందులోని మూడు బ్యాటరీలు 30ఏళ్లు దాటగా, ఒక బ్యాటరీ 25ఏళ్ల నాటిది. ఒక్కో బ్యాటరీకి 67 ఓవెన్‌లుంటాయి. అన్ని కోకోవెన్‌లు కండిషన్‌లో ఉంటే ఒక్క పుష్షింగ్‌కు 25 టన్నుల కోక్ తీయగల్గుతారు. ప్రతిరోజూ 425 పుష్షింగ్‌లు చేస్తేనే 10వేల టన్నుల కోక్ అందుబాటులోకి వస్తుంది. బ్యాటరీలు దెబ్బతిన్న కారణంగా సరాసరిన 300లోపు పుష్షింగ్‌లు మాత్రమే తీస్తున్నారు. మూడు ఫర్నేస్‌ల నుంచి పూర్తిస్థాయిలో 7.2 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి తీయాలంటే కోకోవెన్‌లో మరో బ్యాటరీ (6వది) స్టాండ్‌బైగా ఉండాలి. అన్నీ బయట కొని.. ఉత్పత్తి ధర పెంచేసి..: కోక్ కొరత కారణంగా ఆస్ట్రేలియా, చైనా, ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకోవాలని అధికారులు నిర్ణయించారు. దిగుమతులపై యాంటీ డంపింగ్ డ్యూటీ 80–140 డాలర్ల వరకు చెల్లించాల్సి వస్తోంది. దానికి మినహాయింపు ఇవ్వాలని కోరినా ఆర్థిక మంత్రిత్వశాఖ ఒప్పుకోలేదు. దీంతో టన్నుకు అదనంగా రూ.5–6వేలు ఖర్చు పెట్టి బయట మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. అదే విధంగా ఎల్‌జీ గ్యాస్ బయట నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఎన్‌ఎండీసీ నుంచి ఇనుప ఖనిజం సరఫరా తగ్గడంతో ఐరన్‌ఓర్‌కు బదులు పెల్లెట్స్‌ను బయట మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా టన్ను స్టీలు ఉత్పత్తికి రూ.10–12వేలు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

**గ్యాస్ లేక ఇబ్బందులు:** కోకోవెన్‌లో కోక్‌తోపాటు గ్యాస్ కూడా ఉత్పత్తి అవుతుంది. ఈ గ్యాస్‌ను బ్యాటరీల్లో బర్న్ చేయడానికి, రోలింగ్ మిల్స్ నడపడానికి, ఎస్ఎంఎస్‌లోనూ ఉపయోగిస్తారు. రోజుకు 16,600 టన్నుల లిక్విడ్ ఐరన్ తీసినప్పటికీ, గ్యాస్ లేక రోలింగ్ మిల్స్‌లో 11,347 టన్నుల ఫినిష్డ్ స్టీల్ మాత్రమే తయారు చేస్తున్న పరిస్థితి నెలకొంది

# దివ్యాంగుల సమగ్ర అభివృద్ధికి 'దృష్టి' ప్రాజెక్టు



**నర్సీపట్నం, విశాఖసమాచారం:** నర్సీపట్నం, దివ్యాంగుల భవిత మరింత ఉజ్వలం కానుంది. సహిత విద్య ఇప్పుడు సమూల మార్పులతో సరికొత్తగా అందుబాటులోకి వస్తోంది. వీరి సమగ్ర అభివృద్ధికి 'దృష్టి' ప్రాజెక్టు సిద్ధమైంది. ఇన్నాళ్లు చోటు చేసుకున్న తప్పిదాలు, పథకాల దుర్వినియోగం తదితర అన్ని అవకతవకలకు అడ్డుకట్ట పడనుంది. దీని అమలుకు వీలుగా ఇప్పటికే ప్రత్యేక అవసరాల పిల్లలు, వారి తల్లిదండ్రుల సమస్త సమాచారాన్ని ప్రత్యేక ఉపాధ్యాయులు తమ ట్యాబ్‌లలో నమోదు చేస్తున్నారు. రాష్ట్ర సమగ్ర శిక్షా పీఓ శ్రీనివాసరావు చొరవతో 'దృష్టి' ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. 'డిజిటల్ హోలిస్టిక్ రిసోర్స్ ఫర్ ఇన్‌క్లూజివ్ సపోర్ట్, హైబ్రిడ్ థెరపీ అండ్ ఇన్వెన్షన్'గా దీనిని పేర్కొంటున్నారు. ఇందులో డిజిటల్ సాంకేతికతతో సహిత విద్యను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లేలా కార్యక్రమాలు రూపొందించారు. దివ్యాంగుల రోజువారీ హాజరు, ఉపాధ్యాయుల బోధన వంటివి రియల్ టైం ట్రాకింగ్ ద్వారా అందరికీ స్పష్టం కానున్నాయి. పూర్తి పారదర్శకతతో పిల్లల సాంకేతిక విద్య పురోగతి, వారికి అన్ని సౌకర్యాలు సమకూరుతున్నది, లేనిదీ ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు. అన్నివిధాలా దివ్యాంగ విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రవేశపెట్టిన డిజిటల్ ఉద్యమం ఈ ప్రాజెక్టు అని పర్యవేక్షణ అధికారి మహాలక్ష్మినాయుడు తెలిపారు. వారిలో అన్నిరకాల నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు దోహదపడుతుందన్నారు. ఈ ప్రాజెక్టుపై ఇటీవల ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలంలోని తోటపల్లిలో రాష్ట్రంలోని భవిత కేంద్రాలు ప్రత్యేక ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ తరగతులు చేపట్టారు. ఈ ప్రాజెక్టు క్షేత్రస్థాయి పర్యవేక్షణ అధికారులుగా జిల్లాలోని మేడివాడ ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడు, విజయనగరం జిల్లా తెర్లాం ఉపాధ్యాయుడు సునీల్ నియమితులయ్యారు. వీరు ప్రస్తుతం అనకాపల్లి జిల్లా సమగ్ర శిక్షా ఏపీసీ అప్పారావు ఆదేశాలతో జిల్లాలోని భవిత కేంద్రాల్లోని పిల్లలు వారి తల్లిదండ్రుల పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్న కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

# సంకల్ప కళాగ్రామానికి స్వాగతం




**పెందుర్తి, విశాఖసమాచారం:** పెందుర్తి, విశాఖ వేదికగా జరుగుతున్న అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ నగరానికి తలమానికంగా నిలవగా పెందుర్తి మండలానికి కూడా కీలక పాత్ర దక్కింది. ఈ నెల 20వ తేదీన సుమారు 50 దేశాలకు చెందిన వంద మంది నేవీ డెలిగేట్ల బృందం పెందుర్తి మండలం పెదగాడి సమీప సంకల్ప కళాగ్రామాన్ని సందర్శించనుంది. ఆ రోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగే కార్యక్రమంలో దేశ విదేశాలకు చెందిన నేవీ అధికారులు, సిబ్బంది వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని కళాగ్రామం నిర్వాహకులు ఆకుల చలపతిరావు తెలిపారు. ఈ మేరకు కళాగ్రామాన్ని ముస్తాబు చేస్తున్నారు.

**కార్యక్రమాలివీ..:** నేవీ బృందం కళాగ్రామం సమీప పొలంలో కూరగాయల పెంపకం, కొయ్య బొమ్మల తయారీ, నూలు వస్త్రాల నేత ప్రక్రియ, పూలకుండీల తయారీని పరిశీలిస్తారు. ఎకోఫ్రెండ్లీ నర్సరీలో కలియ తిరుగుతారు. చెక్క గానుగతో నూనె తయారీ ప్రక్రియ, ప్రకృతి సిద్ధమైన ఉత్పత్తులను తిలకిస్తారు. సహజ సిద్ధ రంగుల తయారీ, రంగుల అద్దకంపై జరిగే కార్యశాలలో పాల్గొంటారు.

# 'రక్షణ' గర్జన చూసొద్దాం రండి



**వన్‌టౌన్, విశాఖసమాచారం:** వన్‌టౌన్, అంతర్జాతీయ యుద్ధనౌకల పండగను పురస్కరించుకుని ఆర్కేబీచ్ కేంద్రంగా నిర్వహించే అంతర్జాతీయ సిటీ పరేడ్‌కు సర్వం సిద్ధమైంది. సాయంత్రం 5 గంటల నుంచి 7.20 గంటల వరకు కార్యక్రమం జరగనుంది. మధ్యాహ్నం 3 గంటల నుంచే సందర్శకులు, అతిథులకు అనుమతిస్తారు.

**ఎన్‌క్లోజర్లు- వేదికలు**

బీచ్‌లో ఇసుకతిన్నెల పైనుంచి విన్యాసాలు వీక్షించే సందర్శకులకు 40 ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేశారు. పాస్‌లు ఉన్న వారికి, ఇతర అతిథులకు ఆర్కేబీచ్ నుంచి సబ్‌మెరైన్ మ్యూజియం వరకు 28, గోకుల్ పార్క్ నుంచి ఆర్కేబీచ్ వరకు 12 వేదికలను సిద్ధం చేశారు. ఆయా చోట్ల ఇనుప బారికేడ్లను ఉంచి, సందర్శకుల



రాకపోకలకు వీలుగా ఏర్పాట్లు చేశారు. జిల్లా నలుమూలల నుంచి 1.50 లక్షల నుంచి 2 లక్షల మంది వస్తారని అధికార యంత్రాంగం అంచనా వేస్తుంది.

ప్రత్యేక అతిథుల కోసం ఆర్కేబీచ్ నుంచి సబ్‌మెరైన్ మ్యూజియం వరకు పది వేదికలు సిద్ధం చేశారు. వాటిల్లోకి నౌకాదళం అధికారులు, విశ్రాంత అధికారులు, వారి కుటుంబీకులు, ఇతర ప్రముఖులకు అనుమతి ఉంటుంది.

**అతిథుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు**

బాధ్యతలు అప్పగింత: జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆధ్వర్యంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మొత్తం 600 మంది పర్యవేక్షిస్తున్నారు. సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన ప్రతి ఎన్‌క్లోజర్ వద్ద ఓ అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించారు. జనాభా రద్దీని నియంత్రించి, అవసరమైన సదుపాయాలు కల్పించే బాధ్యతలు అప్పగించారు. పోలీసు యంత్రాంగం పటిష్ఠమైన భద్రత ఏర్పాట్లు చేసింది. పారిశుద్ధ్యం నిర్వహణ, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు తదితరాలను జీవీఎంసీ పర్యవేక్షిస్తోంది.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆరు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆయా శిబిరాల్లో అత్యవసర ఔషధాలతో పాటు ఓ వైద్యుడు, నర్సులు, ఇతర సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ఎవరైనా తీవ్ర అస్వస్థతకు గురైతే ప్రాథమిక వైద్యం అందించి, వెంటనే ఆసుపత్రికి తరలించేందుకు వీలుగా అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచారు.

**సీఎం షెడ్యూల్ రద్దు**

ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరుకావాల్సి ఉండగా, ఆయన షెడ్యూల్ రద్దయింది. బుధవారం నౌకాదళం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలకు ముఖ్యమంత్రి హాజరయ్యారు.

గురువారం సిటీ పరేడ్, నౌకాదళం విన్యాసాలు, ఇతర కార్యక్రమాలకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.

పార్క్‌హోటల్ కూడలి నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు సాగే అంతర్జాతీయ సిటీ పరేడ్‌లో వివిధ దేశాలకు చెందిన సాంస్కృతిక బృందాలు, రాష్ట్రానికి చెందిన కళాకారులు, త్రివిధ దళాల సిబ్బంది, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ప్రదర్శనలు ఉంటాయి.

# రైతులకు అందుబాటులో ఆక్వా కల్చర్ ప్రయోగశాలలు



**అనకాపల్లి, విశాఖసమాచారం:** నక్కపల్లి, రొయ్యలు, చేపలు.. మాంసాహార ప్రియులకు ఎంతో ప్రత్యేకం. వీటి సాగు ద్వారా జిల్లాలో రూ.వందల కోట్ల వ్యాపారం జరుగుతుండగా, సాగులో వివిధ పరీక్షలుచేసే ప్రయోగశాలలు మత్స్య రైతులకు అందుబాటులోకి వచ్చాయి. తద్వారా నాణ్యమైన మత్స్యసంపద ఉత్పత్తికి ఇవి ఉపయోగపడనున్నాయి. జిల్లాలోని ఆరు మండలాల పరిధిలో తీరప్రాంతాన్ని ఆనుకుని రొయ్యలు, చేపల పెంపకం చేస్తుంటారు. దీంతోపాటు చీడికాడ, దేవరాపల్లి, మాడుగుల మండలాల్లో 1,862 చెరువుల పరిధిలో 2,847 ఎకరాల్లో ఆక్వాకల్చర్ ఉంది. ఇందులో మూడొంతుల విస్తీర్ణంలో రొయ్యలు పెంచుతున్నారు. ఆక్వా రైతులు సాగు విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోకుంటే నష్టాలు తప్పవు. వీటిని పెంచడానికి ముందే మట్టి, నీటి స్వభావంతోపాటు, పెంపకానికి తెచ్చే సీడ్ (విత్తనం) నాణ్యతను పరీక్షించుకోవాలి. ఇవన్నీ చేయించుకోవాలంటే కాకినాడలోని మత్స్య ప్రయోగశాలకు తీసుకెళ్లేవారు. దీంతో జిల్లాలోని రైతులకు ఇది ఇబ్బందిగా ఉండేది. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాయకరావుపేట, ఎలమంచిలిలో ఆక్వా కల్చర్ ప్రయోగశాలలు నిర్మించారు. ఒక్కోదానికి రూ. 82 లక్షలు వెచ్చించారు. గత ప్రభుత్వం వీటిని పట్టించుకోకపోవడంతో ఇక్కడ ఎలాంటి ప్రయోగాలు జరగలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రయోగశాలలను పట్టాలెక్కించింది. ఈ మేరకు అవసరమైన రసాయనాలను కాకినాడ నుంచి రప్పించి గతేడాది నుంచి వీటిని మనుగడలోకి తెచ్చారు. ఈ మేరకు మత్స్యశాఖ ఉద్యోగులు ప్రత్యేకంగా శిక్షణ పొందారు. పరీక్షల నిమిత్తం రైతులు నిర్దేశిత రుసుం ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది.

జిల్లాలో ఆక్వాకల్చర్ ఇలా (విస్తీర్ణం ఎకరాల్లో)

| మండలం | చెరువులు | విస్తీర్ణం |
|---|---|---|
| పరవాడ | 119 | 220 |
| అచ్యుతాపురం | 22 | 42 |
| రాంబిల్లి | 493 | 685 |
| ఎస్. రాయవరం | 477 | 746 |
| నక్కపల్లి | 224 | 291 |
| పాయకరావు పేట | 453 | 686 |
| దేవరాపల్లి | 72 | 150 |
| చీడికాడ | 6 | 4.7 |
| మాడుగుల | 6 | 13 |

పరీక్షల ఫీజు వివరాలిలా

నీటి పూర్తిస్థాయి విశ్లేషణకు: రూ. 700


మట్టి పరీక్షలకు: రూ. 200

రొయ్య/చేప సీడ్ పరీక్ష: రైతులకు ఉచితం, హేచరీలకు రూ.50లు

చెరువులో రొయ్య/చేప తెగుళ్లు గుర్తించడానికి: ఉచితం

తెగులుకి సంబంధించి బ్యాక్టీరియా/వైరస్/పారాసైట్ గుర్తించడానికి: రూ.100 జిల్లాలో మత్స్య సంపద సాగు ఏటా పెరుగుతోంది. ప్రస్తుతం అమెరికా టారిఫ్‌లు తగ్గడంతో మరింత మంది సాగుకు సిద్ధమవుతున్నారు. ముందుగా అవసరమైన పరీక్షలు చేయించుకుంటే నాణ్యతతో కూడిన దిగుబడులు వస్తాయి. ఇలాంటి రొయ్యలనే వియత్నాం, అమెరికా, సింగపూర్‌తోపాటు యూరప్ దేశాలకు ఎగుమతి చేస్తారు. నాణ్యత ఉంటేనే ఆదాయమూ వస్తుంది.

# 44 ఏళ్ల ఉక్కు యాత్ర



**ఉక్కునగరం, విశాఖసమాచారం:** ఉక్కునగరం (స్టీల్ సెక్టారు–3), విశాఖ ఉక్కు 44 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లు, కర్మాగారం కేవలం ఉక్కు మాత్రమే ఉత్పత్తి చేయలేదు. ఒక నగరానికి కొత్త గుర్తింపునిచ్చింది. ఒక రాష్ట్రానికి ఆర్థిక బలం అందించింది. ఒక దేశానికి ఆత్మవిశ్వాసం నింపింది. సాదాసీదాగా ప్రారంభమైన ఈ ప్రయాణం ఈనాడు జాతీయంగా గర్వకారణంగా నిలిచింది.

విశాఖ ఉక్కును వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించింది. ఉక్కునగరం అనే ఆదర్శ నివాస కాలనీ నిర్మించి విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి తోడ్పడింది. అంతర్జాతీయంగా విశాఖకు గుర్తింపు తీసుకువచ్చింది. రాష్ట్రానికి ప్రధాన వనరుగా నిలిచింది. అనుబంధ పరిశ్రమల అభివృద్ధికి ప్రోత్సాహం అందించింది. పోర్టు, రవాణా, లాజిస్టిక్స్ రంగాల ఎదుగుదలకు బాటలు వేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక గుర్తింపును బలపరిచింది.

రైల్వేలు, రక్షణ, నిర్మాణ రంగాలకు నాణ్యమైన ఉక్కును అందించింది. ఆత్మనిర్భర్ భారత్ సంకల్పానికి బలం చేకూర్చింది. ప్రజాసంస్థల ప్రతిష్ఠను నిలబెట్టిన మహా సంస్థగా నిలిచింది. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదం ఒక పోరాట చరిత్రను, ప్రజాస్వరం శక్తిని నేటికీ ప్రతిధ్వనిస్తుంది. ప్రతి సైరన్ శబ్దం దేశ సేవ ప్రతిధ్వని, ప్రతి షిఫ్టు కష్టం జాతి నిర్మాణానికి అంకితం. ఉక్కు ఉద్యోగులు ఉక్కును మాత్రమే కాదు నమ్మకాన్ని మలిచారు. సంబంధాలను బలపరిచారు. తీరాలకు నిలిచే వారసత్వాన్ని నిర్మించారు. సేవలో ఉన్నా.. విరమణలో ఉన్నా ఈ అనుబంధం చెరిగేది కాదు. ఉద్యోగుల గుండెల్లో ఎప్పటికీ వెలిగే జ్యోతి విశాఖ ఉక్కు. రాబోయే సంవత్సరాల్లో మరింత పునరుజ్జీవంతో, మరింత శక్తితో, మరింత జాతీయ కీర్తితో విశాఖ ఉక్కు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉద్యోగులు గర్వంగా ఆకాంక్షిస్తున్నారు.

# జనన, మరణాల నమోదుకు కొత్త నిబంధనలు

**అనకాపల్లి, విశాఖసమాచారం:** విశాఖపట్నం: పాఠశాలల్లో ప్రవేశాలు, పాస్‌పోర్టు, ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితరాలు పొందేందుకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. ఆస్తి వ్యవహారాలు, బ్యాంకు ఖాతాల్లోని నిధుల బదలాయింపు, ఇతర పనులకు మరణ ధ్రువీకరణ పత్రాలు కీలకంగా మారుతున్నాయి. చాలా మంది వీటి నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో జనన, మరణాల నమోదుకు ప్రభుత్వం కొత్త నిబంధనలు అమల్లోకి తెచ్చింది. జనన, మరణాలు సంభవిస్తే తప్పనిసరిగా 21 రోజుల్లో నమోదు చేసుకోవాలని సూచించింది. ఈ నిబంధనలు మంగళవారం నుంచే అమల్లోకి వచ్చాయి.

ఆలస్యమైతే అపరాధ రుసుము..

జననం లేదా మరణించిన తేదీ తర్వాత 21 నుంచి 30 రోజుల్లోపు నమోదు చేస్తే రూ.25 అపరాధ రుసుము చెల్లించాలి.

30 రోజుల తర్వాత నుంచి ఏడాది లోపు నమోదు చేయాలంటే జిల్లా రిజిస్ట్రార్ (జనన, మరణాలు) రాతపూర్వక వినతితోపాటు రూ.250 అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

ఏడాది దాటితే కలెక్టర్ (జిల్లా మేజిస్ట్రేట్) లేదా ఆర్డీవో (సబ్–డివిజనల్ మేజిస్ట్రేట్) అనుమతితోపాటు అపరాధ రుసుము కింద రూ.500 చెల్లించాలి. దీంతోపాటు ఫారం–14 ద్వారా అఫిడవిట్ సమర్పించాలి. బిడ్డ పుట్టిన వెంటనే కొందరు జనన ధ్రువపత్రంలో పేర్లు నమోదు చేయడం లేదు. అలాంటివారు 12 నెలల లోపు ఉచితంగా పేర్లు నమోదు చేసుకోవచ్చు. 12 నెలల నుంచి 15 ఏళ్లలోపు పేరు చేర్చాలనుకుంటే రూ.250 అపరాధ రుసుము చెల్లించాలి. వారిదే బాధ్యత..: జననం లేదా మరణం ఆసుపత్రిలో జరిగితే.. ఆ సంస్థ తాలుకూ బాధ్యులే నిర్ణీత ఫార్మాట్‌లో సమాచారాన్ని రిజిస్ట్రార్‌కు పంపిస్తారు. ఇంట్లో జరిగితే ఇంటి యజమాని లేదా కుటుంబ పెద్ద ఆ సమాచారాన్ని అందించే బాధ్యత తీసుకోవాలి. కేజీహెచ్‌లో పుట్టినా, చనిపోయినా ఆసుపత్రి సిబ్బందే ధ్రువపత్రాలు ఇస్తారు.

జీవీఎంసీ పరిధిలో గతేడాది ఇలా..

జననాలు: 13,809

మరణాలు: 14,022

# ప్రాణం తీసిన చక్రం

**అక్కిరెడ్డిపాలెం, విశాఖసమాచారం:** అక్కిరెడ్డిపాలెం, కార్ల చక్రాలు ఊడి పోయి ప్రమాదాలు జరగడం చూస్తుంటాం. కానీ ద్విచక్ర వాహనం చక్రం ఊడి ఓ మహిళ మృతిచెందిన సంఘటన షీలానగర్ పోర్టు రోడ్డులో జరిగింది. దీనికి సంబంధించి గాజువాక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.



నగరంలోని ఏవీఎన్ కళాశాల సమీప ప్రాంతానికి చెందిన దాసరి ఎల్లమ్మాజీ(34) స్కూటీపై బుధవారం ఉదయం షీలానగర్ వచ్చారు. తన తమ్ముడిని ఐయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రంలో దించి ఆమె తిరిగి ద్విచక్ర వాహనంపై పోర్టు రోడ్డులో వెళ్తుండగా.. శిక్షణ కానిస్టేబుల్ గంటా గౌరీనాయుడు (31) షీలానగర్ వద్ద ఆమెను లిఫ్ట్ అడిగారు. వీరి వాహనం షీలానగర్ టోల్‌గేటు సమీపంలోకి వచ్చేసరికి వెనుక చక్రం ఊడిపోయింది. ఇద్దరూ ఒక్కసారిగా కిందపడిపోయారు. ఈ సంఘటనలో ఆమె తల రోడ్డుకి తగలడంతో తీవ్ర రక్తస్రావమై సంఘటన స్థలంలోనే మృతిచెందారు. గౌరీనాయుడు స్వల్పగాయాలతో బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆమెను కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశాఖ సమాచారమ్
శుక్రవారం 20-2-2026

# బాల్యంలో మానసిక హింస..
## పిల్లలపై దీర్ఘకాల ప్రభావం

బాల్యం జీవితానికి పునాది. మనసు, ఆత్మ విశ్వాసం, బంధాలు, నమ్మకాలు అన్నీ చిన్నతనంలోనే నాటుకుపోతాయి. కానీ కొంతమందికి బాల్యం అనేది భయం, బాధ, అవమానం, హింసతో నిండి ఉంటుంది. ఇంట్లోనే అయినా, సమాజంలో అయినా పిల్లలు ఎదుర్కొనే హింసలు .. వారి భవిష్యత్తు వ్యక్తిత్వాన్ని నాశనం చేస్తాయి. దీనినే మానసిక నిపుణులు (Developmental Trauma) అంటున్నారు. కొట్టడం, గట్టిగా కేకలు వేయడం మాత్రమే హింస కాదు. పిల్లల ముందు తల్లితండ్రులు గొడవలాడుకోవడం, ప్రేమను చూపించకపోవడం, నిర్లక్ష్యం చేయడం, వారిని తక్కువగా భావించడం కూడా మానసిక హింసే. కొందరికి లైంగిక వేధింపులు, కుటుంబంలోని సభ్యుల చేతనే ఎదురవుతాయి. ఇవన్నీ వారి మనస్సులో శాశ్వతమైన గాయాలను కలిగిస్తాయి. ఈ హింసలు అప్పటి సమయంలో తక్కువగా కనిపించినా, దీర్ఘకాలంలో ఆ పిల్లలలో నమ్మకం లోపం, ఆత్మ విశ్వాసం తక్కువగా ఉండటం, విద్యలో తగ్గుదల, ఎదుటివారిని నమ్మలేని పరిస్థితులు కూడా ఏర్పడతాయి.

**ఈ సమస్యకు ప్రధాన కారణాలు..**

కుటుంబంలోని మానసిక, శారీరక హింసలు సమాజంలో వచ్చే అపహాస్యం, అణచివేత, కుటుంబాలలో, పాఠశాలలలో, కళాశాలలలో తేడాలు చూపడం, వారి సామాజిక స్థితి ఆధారంగా పిల్లలను అపహాస్యం చేయడం, జాతీయ, భాషా, జెండర్, బాడీ షేమింగ్ పైన ఆధారపడి వారిని తప్పుగా చూడడం ఇవన్నీ చిన్నారుల్లో/ యువతలో తీవ్ర మానసిక ఒత్తిడికి దారి తీస్తున్నాయి. సమాజం నుండి ఎదురయ్యే ఈ అసమానతలు, వారి మానసిక స్థితిని బలహీనంగా మారుస్తూ, వారి భవిష్యత్తుపై ప్రభావం చూపుతున్నాయి. Developmental trauma అనేది చిన్న వయస్సులో ఎదురైన మానసిక, శారీరక లేదా భావోద్వేగ హింస వల్ల మెదడు, మనసు ఎలా అభివృద్ధి చెందుతుందో ప్రభావితం అవుతుంది. ఇది పిల్లల ఆలోచన, అనుభూతులపై బలమైన దెబ్బలు ఇస్తుంది. ఫలితంగా, వయసు పెరిగిన తర్వాత డిప్రెషన్, యాంగ్జైటీ, రిలేషన్‌షిప్ సమస్యలు, ఒంటరితనంతో బాధపడే పరిస్థితులు కనిపిస్తాయి.

**అలాంటి పిల్లలను గుర్తించడం ఎలా..?**

ఇలాంటి వారు భయంతో ఉంటారు. వారిలో ఆత్మవిశ్వాసం ఉండదు. అంతా తప్పు చేస్తారని అనుకుంటారు అనే ఒక భావన కలిగి ఉంటారు. ఒంటరిగా ఫీలవుతారు. ఎవరితోనూ వారి భావాలు పంచుకోవడానికి ఇష్టపడరు. వాళ్ల డెసిషన్ వాళ్లే తీసుకుంటారు, అది మంచి ఐనా చెడు ఐనా, ఎవరిని సంప్రదించ డానికి ఇష్టపడరు. అందరిలో కలవలేరు, కలివిడిగా ఉండలేరు. ఎవరో వీరిని చిన్న చూపు చూస్తారన్న భయం వీరిలో ఎక్కువగా ఉంటుంది. చిన్న విషయాలకు కోపం తెచ్చుకుంటారు. ఆత్మహత్య భావనలు ఉంటాయి, చిటికి మాటికి చనిపోతాం అని బెదిరిస్తుంటారు. వీరి మీద అందరూ జాలి చూపాలని కోరుకుంటారు. చిన్న సమస్య వచ్చిన తట్టుకోలేరు. బాగా బద్ధకంగా ఉంటారు.

**యువతకి సూచన..**

మీరు చిన్నతనంలో బాధ అనుభవించారా? మౌనంగా ఉండ కండి. నమ్మకమైన వ్యక్తులతో మాట్లాడండి, మానసిక నిపు ణులతో చర్చించండి. వారి సలహాలు తీసుకోండి. సహాయం కోరడం బలహీనత కాదు. అదే ధైర్యం. బాల్యంలో పిల్లలు ఎదుర్కొన్న మానసిక హింస.. వారు ఎదిగాక జీవితాంతం వెంటాడే సమస్యగా మారుతుంది. మనం చిన్నతనంలో ఎలాంటి వాతావరణాన్ని పిల్లలకు ఇస్తామో, వారు అలా ఎదుగుతారు. ప్రేమ, శ్రద్ధ, అర్థం చేసుకునే మనసు.. ఇవే పిల్లలకు ఇచ్చే నిజమైన భద్రత.

# పెరుగుతున్న జీవనశైలి..

వ్యాధులు అన్ని వయసుల ప్రజల జీవితం మీద ప్రభావితం చూపుతున్నాయి. పాత తరం జీవనశైలిలో భౌతిక శ్రమ ఎక్కువగా ఉండేది. కానీ ఆధునిక జీవన శైలులలో శారీరక శ్రమ తక్కువగా అవుతుంది. దీని ప్రభావంగా ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా మనదేశంలో అకాల మృత్యువులకు కారణం ఆధునిక జీవనశైలినే. ఆధునికత పేరుతో మన ఆరోగ్యాన్ని మనమే నాశనం చేసుకుంటున్నాం. మన చేతుల చేత మన ఆరోగ్యాన్ని తుడిచిపెడుతున్నారు. మహానగరాల్లో జీవించే ప్రజల్లో ఈ వ్యాధులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. 40 లోపు హార్ట్ ఎటాక్ వస్తుండడం కేవలం జీవనశైలిలో మార్పుల వల్లే.. ఆహారం అలవాట్లలో మార్పు, ఫిజికల్ యాక్టివిటీ లోపం, ఒత్తిడి, నిద్రలేమి వలన నానాటికీ జీవన శైలి వ్యాధులు పెరుగుతున్నాయి. ఆధునిక జీవనశైలిలో మానవుడు ఆరోగ్యాన్ని తాకట్టు పెడుతున్నాడు. ఈ మానసిక ఆరోగ్యానికి పరిరక్షించే కొన్ని చిట్కాలు ముఖ్య మైనవి. రోజు ఒకే సమయానికి నిద్ర, భోజనం కార్యాచరణ ఉండేలా జీవనశైలి సజావుగా ఉండాలి. కనీసం 30 నిమిషాలు వ్యాయామం, యోగ, ప్రాణాయామం చేయాలి. ఇక ధ్యానం, శ్వాస నియంత్రణతో ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. ఆహా రంలో పండ్లు, కూరగాయలు ఒమేగా వంటి వాటిని చేర్చాలి. నిద్ర పరిపూర్ణంగా ఉండేలా చూసుకోవాలి. సెల్‌ఫోన్




వినియోగాలను నియంత్రించాలి. ఈ చిట్కాల వల్ల మనసు ఆరోగ్యంగా ఉండడమే కాకుండా జీవితం సంతృప్తికరంగా మార్పు అవుతుంది. ప్రభు త్వం ఆరోగ్యశాఖ ఈ విషయంపై అవగాహన కార్య క్రమాలు నిర్వహించాలి. అలాగే కుటుంబ సభ్యుల ప్రోత్సాహం కూడా ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో ప్రజలందరూ తమ జీవనశైలి మెరుగుపరుచుకునే కృషి చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుంది.

# సరిగమల్లో నవ మాసాలు

స్త్రీ గర్భం దాల్చాక శిశు జననం వరకూ ఎన్నో ఆనంద ఘడియలు, అన్నే ఆందోళనలు. తల్లి ఆరోగ్యమూ, బిడ్డ ఆరోగ్యమూ కాపాడుకోవాలి. తల్లితో లోపలి బిడ్డ బంధం బలపడాలి. ఇవన్నీ సంగీతం వల్ల సాధ్యమవుతాయంటోంది చెన్నైకి చెందిన మ్యూజిక్ టీచర్ దివ్యలక్ష్మి. గర్భం దాల్చిన తల్లులకు శాస్త్రీయ సంగీతం నేర్పేందుకు దివ్య తయారు చేసిన ఆరు నెలల కోర్సుకు కాబోయే తల్లులు సరిగమలతో బదులిస్తున్నారు. వివరాలు...

దివ్యలక్ష్మి కమలాకన్నన్‌కు ఈ ఐడియా తన కూతురిని చూశాక వచ్చింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో బీటెక్ చదివి ఆ తర్వాత బాల్యం నుంచి నేర్చుకుంటున్న కర్నాటక సంగీతంలోనే తన జీవితాన్ని నిమగ్నం చేయాలని నిశ్చయించుకున్న దివ్య లక్ష్మి మెద్రాస్ యూనివర్సిటీ నుంచి సంగీతంలో పట్టా తీసుకుంది. ఆ తర్వాత సౌత్ చెన్నైలో ఆమె ఎన్నో సంగీత ప్రదర్శనలు ఇవ్వడమే కాక అక్కడి కిల్‌పార్క్ గార్డెన్‌లో 'ఆరోహణ' పేరుతో సంగీత పాఠశాల నెలకొల్పింది. కర్నాటక, హిందూస్తాని, ఇన్‌స్ట్రుమెంటల్ సంగీతాలలో ఇక్కడ శిక్షణ ఇస్తూ గుర్తింపు పొందిన దివ్యలక్ష్మి లాక్‌డౌన్ రావడంతో డీలా పడింది. ఇన్‌స్టిట్యూట్ మూసేసింది. ఆ సమయానికి ఆమె గర్భంతో ఉంది. ఇంట్లో తనే సంగీత సాధన చేస్తూ వెళ్లింది.

కుమార్తె ఆరోహి పుట్టాక ఆ పాప ఒకటిన్నర సంవత్సరాల వయసుకే విపరీతంగా జ్ఞాపకశక్తి ప్రదర్శించడం దివ్యలక్ష్మికి ఆశ్చర్యం కలిగించింది. మూడున్నరేళ్లు వచ్చేసరికి ఆరోహి వయొలిన్ చేత పట్టుకుని సరిగమలు పలికించడం ఇంకా సంతోషపెట్టింది. ఆరోహి తన కడుపులో ఉన్నప్పుడు తాను సాధన చేసిన శాస్త్రీయ సంగీతం పాప తెలివితేటల ఎదుగుదలకు ఉపయోగపడిందని దివ్యలక్ష్మికి అనిపించింది. గర్భవతులకు శాస్త్రీయ సంగీతం నేర్పిస్తే, వారు డెలివరీ అయ్యేంత వరకు శాస్త్రీయ సంగీతం వింటూ ఉంటే



పుట్టబోయే బిడ్డకు అన్ని విధాలా ఉపయోగమని అర్థం చేసుకుంది. ఈ విషయాన్ని మరింతగా నిర్ధారించుకోవాలని నిశ్చయించుకుంది.

**మ్యూజిక్ థెరపీ**

కొన్ని అధ్యయనాల ప్రకారం మ్యూజిక్ థెరపీ కడుపులో ఉన్న బిడ్డ ఆరోగ్యానికి, గుండె స్పందనలకు బాగా పని చేస్తుందని నిర్ధారితమైంది. సంగీతం గర్భిణుల్లో ఉండే యాంగ్జయిటీ, లో బీపీ వంటి సమస్యలను దూరం చేయగలదని స్వీయ పరిశీలన ద్వారా అర్థం చేసుకున్న దివ్యలక్ష్మి తమ కాలనీలో ఉన్న నలుగురైదుగురు గర్భవతులకు ప్రయోగాత్మకంగా శాస్త్రీయ సంగీతం నేర్పించసాగింది. వారికి ఆ పాఠాలు ఆహ్లాదం కలిగించడమే కాదు ప్రసవాలు కూడా కాంప్లికేషన్స్ ఎదురవకుండా జరిగాయి. దాంతో ఆరునెలల కోర్సు తయారు చేసిన దివ్యలక్ష్మి మళ్లీ సంగీత పాఠశాల తెరిచి ఇప్పుడు గర్భిణులకు సంగీత పాఠాలు చెబుతోంది.

ఆమె దగ్గర నేర్చుకోలేకపోయినా, ఉన్నచోట నేర్చుకోలేకపోయినా, గర్భిణులు తరచూ ఆహ్లాదపరిచే సంగీతం వినడం, మంచి పాటలు హమ్ చేసుకుంటూ ప్రశాంతంగా గడపడం వల్ల మాత్రం కచ్చితంగా మేలు జరుగుతుంది.

# జై ఆంధ్ర ఉద్యమంలో విద్యార్థి ఆత్మాహుతి

జై ఆంధ్ర ఉద్యమం ఉధృతంగా ఆంధ్ర ప్రాంతాన్ని కుదుపేస్తున్న కాలంలో (1972)నేను ఒకసారి బందరు ప్రభుత్వ ఆస్పత్రికి నా స్నేహితునితో వెళ్లాను.అక్కడ ఈ ఉద్యమంలో గాయపడిన విద్యార్థులు చికిత్స పొందుతున్నారు.నా స్నేహితునికి తెలిసిన వ్యక్తి గాయపడ్డాడంటే వెళ్లాం.అతను ముఖంలో కొంతభాగం మినహా మిగిలిన శరీరం అంతా సినిమాలో చూపినట్లు బ్యాండేజీలతో ఉన్నాడు. అతను ఏదో ప్రభుత్వ ఆస్తిని తగులబెట్టబోయి అతని శరీరం అగ్నికి కాలింది. శరీరం మొత్తం కాలిపోయింది. అతన్ని పలకరించాం. మాస్నేహితుడు నన్ను అక్కడ కూర్చోబెట్టి మరొకరిని చూడడానికి వెళ్లాడు.అప్పుడు గాయపడిన వ్యక్తి మొఖం ఈగలు ముసురుతున్నాయి. నేను కాసేపు విసిరి,అతనితో మాట్లాడాను. ఇంకా ఆవేశం తగ్గలా. నేను పోయినా ఉద్యమం ఆగదు అని అన్నాడు.నాయకులు విద్యార్థుల మనస్సుల్లో ఎంతగా ఉద్యమ భావాలను నూరిపోసారో అర్థం అవుతుంది. ఆ మరునాడే అతను చనిపోయాడని మా మిత్రుడు చెప్పాడు.ఇప్పటికీ నేను జై ఆంధ్రఉద్యమం, అతను నాతో అన్న మాటలు మరవలేను.అలా ఆవేశంతో ఎంతో మంది విద్యార్థులు ఆంధ్రప్రాంతంలో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి త్యాగాలు చేసారు.అదే సమయంలో ఉద్యమ ప్రధాన మద్దతుదారు ఆంధ్ర ప్రాంత మంత్రి కాకాని వెంకటరత్నం గుండెపోటుతో మరణించడంతో ఉద్యమం మరింతగా ఊపు అందుకుంది.దీనికి తోడు అప్పటి ముఖ్యమంత్రి పీవీ నరహింహారావు తెచ్చిన భూసంస్కరణలకు వ్యతిరేకంగా ఈ ఉద్యమాన్ని తెచ్చి ఆయనను పదవినుంచి దింపేందుకు కొందరు ఇలా చేసారని విమర్శలు ఉన్నాయి.కాని ఉద్యమంలో విద్యార్థుల త్యాగాలు నేటి ఆంధ్రప్రదేశ్ కు ప్రతిరూపంగా భావించాలి.

జై ఆంధ్ర ఉద్యమానికి ముందు కాలంలో నా జీవన పయనంలో జరిగిన సంఘటనలు గురించి కూడా ప్రస్తావించాలి.

10 వ తరగతిలో పాస్ అయిన తరువాత పేపర్లో నా హాల్ టిక్కెట్ నెంబరు చూసుకోవడంలో ఆనందం చెప్పనలవి కాదు.అవనిగడ్డలో 10 వ తరగతి చదివాను.తరువాత వచ్చి విజయవాడ లోనే ఉన్నాను.రిజల్స్ రావడంతో నాన్న పేపర్ తెచ్చారు.దానిలో నా నంబరు చూసి కలిగిన ఆనందం చెప్పలేను.ఇంటర్ మీడియట్ ఎక్కడ చదవాలా అనే ప్రశ్న వచ్చింది.అప్పటికే మా అన్న బందరులో రూంలో ఉంటూ బీఎస్సీ చదువుతున్నాడు.నేను కూడా 1970 జూన్ లో బందరు నేషనల్ కాలేజీలో చేరాలని నిర్ణయించారు.తాతయ్య పర్యవేక్షణలో నేను కూడా ఇంటర్ ఆర్ట్స్ గ్రూప్లో చేరాను.నేను మొదటి సంవత్సరం చదువుతున్నప్పుడు మా మావయ్య బీఎడ్ అదే కాలేజీలో చేరాడు.ముగ్గురం రాజు పేటలో రూంలో ఉన్నాం.వండుకు తినేవారం. జనవరి వచ్చేసరికి ఈ అన్నయ్య పిర్రమీద కురుపు లేచింది.అది నెమ్మదిగా పెద్దదవుతున్నది.దాన్ని పరిక్షలు అయ్యే వరకూ పట్టించుకోకపోవడంతో కణితి గా అయింది.సెకండియర్ పరిక్షలు పూర్తికావడంతో విజయవాడ వచ్చాడు.అక్కడ స్థానిక డాక్టర్ నెలరోజులు మందులతో తగ్గుతుందని ఆలస్యం చేసాడు.చివరికి గుంటూరులో పరిక్ష చేస్తే క్యాన్సర్ గా నిర్ధారణ అయింది.తరువాత అక్కడే ఆపరేషన్ జరిగింది.తరువాత నాన్నతో లేజర్ ట్రీట్మెంట్ కోసం హైదరాబాద్ వెళ్లాడు.నాన్నకు అక్కడికి బదిలీ అయింది.ఇక నేను రెండో ఏడాది ఒంటరిగా రూంలో ఉండి కాలేజికి వెళ్లాను.మావయ్య బీఎడ్ పూర్తయి వెళ్లిపోయాడు.నేను మా అధ్యాపకుడు, తాతయ్య స్నేహితుడు కేఆర్కే వద్ద ఇంగ్లీష్ ట్యూషన్ కు వెళ్లే వాడిని.అలా సంవత్సరం గడిచింది.ఇంగ్లీష్ బాగా చదివేవాడిని.1972 ఫిబ్రవరిలో మా అన్న కాన్సర్ తిరిగ బెట్టి చనిపోయాడు. అంతకు ముందు మా తాతయ్య హైదరాబాద్ వెళ్లి చూసి వచ్చాడు.చిన్నప్పటి నుంచి తాతయ్య దగ్గరే పెరిగిన అన్న ఆయనను చూడ్డానికే బతికి ఉన్నట్లు ఆ తరువాత కొద్దిరోజులకే మృతి చెందాడు.నేను జనవరిలో సంక్రాంతి సెలవులకు హైదరాబాద్ వెళ్లాను.అదే నేను వాడిని చివరి సారిగా చూడడం. అన్న మరణం మా కుటుంబంలో ఊహించని దెబ్బ తీసింది. మార్చి పరిక్షల్లో బాగానే రాసానని భావించాను. కాని ఇంగ్లీషులో నాలుగు మార్కులు తక్కువ వచ్చి ఫెయిల్ అయ్యా.నాలాగే 10 వ తరగతిలో నా పెద్ద చెల్లి మాథ్స్ లో ఫెయిల్ అయింది.నాన్న మాకుటుంబాన్ని విజయవాడ మార్చారు. నేను పరిక్ష లో ఫెయిల్ అయినా నాన్న నన్ను ఏమీ అనకపోవడం ఆశ్చర్యం కలిగించింది.మా అన్న మరణం వల్ల అలా జరిగిందని ఊరుకున్నారని భావించాం. బందరురోడ్డులో స్వరాజ్య మైదానం ఎదురుగా ఉన్న నారాయణ ట్యుటోరియల్స్ లో ఇద్దరం చేరాం.ప్రతిరోజు సైకిల్ మీద వెళ్లి మూడు నెలలు చదివాం. నేను ఇంటికి రాగానే ఇంగ్లీషు తప్పులు లేకుండా రాసేవాడిని.రెండు సంవత్సరాల ఇంగ్లీషు పరిక్ష ఒకేసారి రాయాలి.అలా కష్టపడి సెప్టెంబర్ పరిక్ష లో మేమిద్దరం పాస్ అయ్యాం.72 చివర్లో జై ఆంధ్ర ఉద్యమం చిన్నగా రాజుకుంది. అది తరువాత రాష్ట్రాన్ని కుదిపేసి ముఖ్యమంత్రి మారేవరకూ సాగింది. దాంతో 73 విద్యాసంవత్సరం ప్రారంభంకాలేదు.మళ్లీ 1973 సెప్టెంబర్, అక్టోబర్ నాటికి గానీ ఉద్యమం చల్లబడ లేదు.దాదాపు 10 నెలలు కాలం ఖాళీగా ఉండడంతో నేను మా ఊరు మాజేరువెళ్లి వ్యవసాయంలో తాతయ్యకు సహాయంగా ఉన్నాను.డిగ్రీ చేయడానికి అక్టోబర్లో బెజవాడ వచ్చాను.

**యం.వి.రామారావు**

# వారెన్ బఫెట్..... చరిత్రలో మరే ఇతర కోటీశ్వరుడూ ఇవ్వనంతగా ఎక్కువ విరాళాలిచ్చారు

లక్షలాది మంది ఈ తొంభై అయిదేళ్ళ ధనికుడి పెట్టుబడి వ్యూహాలను ఇప్పటికీ అధ్యయనం చేస్తుంటారు. ఆయనలాగే ధనవంతులు కావాలని ఆశిస్తారు.

కానీ బఫెట్ నేర్పే పాఠాలు డబ్బుకు మించి ఉంటాయి.

తన జీవిత చరిత్ర "ది స్నోబాల్" లో ఆయన ఇలా అన్నారు :

"మీ స్నేహితులు, మీ భాగస్వామి, మీ సహోద్యోగులు కూడా మీ భవిష్యత్తును రూపొందించగలరు. వారు దయగలవారు. నిజాయితీపరులు. శ్రద్ధగలవారైతే, మీరు వారిలాగే మారతారు.

కానీ అలా కాదని వారి కోపాన్నీ లేదా విచారాన్ని ఆలోచిస్తూ ఉంటే, ఆ బాధ కూడా మిమ్మల్ని అనుసరిస్తుంది. కనుక మీ కంటే మంచి మనసున్న వ్యక్తులతో సమయం గడపడం ఎంతైనా మంచిది...."

అయితే ఇది పెట్టుబడి సలహా కాదు. ఇది జీవిత సలహా.

1998లో, ఫ్లోరిడా విశ్వవిద్యాలయ విద్యార్థులు ఎప్పటికీ మర్చిపోలేని ఓ ప్రశ్నను ఆయన అడిగారు.

"మీరు ఒక క్లాస్‌మేట్ భవిష్యత్తు విజయంలో 10 శాతం కొనగలిగితే, మీరు ఎవరిని ఎంచుకుంటారు?" అన్నదే ఆ ప్రశ్న. దానికి ఆయనే ఇలా సమాధానమిచ్చారు....

అప్పుడాయన వారికి అత్యధిక ఐక్యు %ఞు% లేదా ఉత్తమ గ్రేడ్‌లు ఉన్న వ్యక్తిని ఎంచుకోవద్దని చెప్పారు. కానీ దయగల, నిజాయితీపరుడైన, కష్టపడి పనిచేసే, స్థిరంగా ఉండే వ్యక్తిని ఎంచుకోమని ఆయన సూచించారు.

ఎందుకంటే తెలివితేటలు కాదు, క్రమశిక్షణతో కూడిన వ్యక్తిత్వమే మీరు ఎంత దూరం వెళతారో నిర్ణయిస్తుందన్నారు వారెన్ బఫెట్.

చాలా మంది పెట్టుబడిదారులలా కాకుండా, బఫెట్ ఎప్పుడూ వాల్ స్ట్రీట్‌తోనే ముడిపడాలనుకోలేదు.

ఆయన నెబ్రాస్కాలోని ఒమాహాలో నివసించారు. నిశ్శబ్ద ప్రదేశం. అక్కడ ఆయన ముఖ్యమైన వాటిపట్ల దృష్టి పెట్టగలిగారు.

ఆయన ఇప్పటికీ 1958లో 31,500 డాలర్లకు కొన్న ఇంట్లోనే నివసిస్తున్నారు. నిరాడంబరమైన 2014 కాడిలాక్ %ఋ% వాహనాన్నే నడుపుతున్నారు. తన తత్వశాస్త్రంలా తన జీవితాన్నీ సరళంగా ఉంచుకున్నారు.


బఫెట్ తన సంపదలో 99 శాతం దాతృత్వానికి విరాళంగా ఇస్తానని వాగ్దానం చేశారు. ఆ మాటకు కట్టుబడే సాగుతున్నారు.

ఆయనకు, ఇతరులకు సహాయం చేసినప్పుడు మాత్రమే సంపదకు ఓ అర్థం ఉంటుందంటారు.

విజయం అనేది మీ ఇల్లు ఎంత పెద్దది, మీరెంత డబ్బు సంపాదిస్తున్నారు లేదా మీవద్ద ఏమేమున్నాయి అనేవి కావని ఆయన జీవితం మనకు గుర్తు చేస్తుంది. వినయం, ఉద్దేశ్యం, దాతృత్వం ఒకరి విజయవంతమైన జీవితానికి సంకేతాలు అని ఆయన జీవితం చెప్పే పాఠాలు.

ఆయన జీవితం కేవలం ఆర్థిక సంపదతో ముడిపడింది కాదు. ఆయన తన జీవిత గమనంలో దయ, ఓర్పు, సమగ్రత యొక్క వారసత్వాన్ని అనుసరించారు. ఆచరణలో చేసి చూపించారు.

**- యామిజాల జగదీశ్**



# జనరేటివ్ ఏఐ కంటే స్పష్టమైన ఫలితాలిచ్చే దిశగా.


ప్రపంచంలోనే అతిపెద్ద ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఒకటైన సేల్స్ ఫోర్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విషయంలో తన దూకుడును తగ్గించుకుంటోంది. గత ఏడాది కాలంగా లార్జ్ ల్యాంగ్వేజీ మోడల్స్ (LLM) పనితీరుపై నమ్మకం సడలడమే ఇందుకు ప్రధాన కారణం. జనరేటివ్ ఏఐ కంటే మరింత స్పష్టమైన ఫలితాలనిచ్చే నిర్ణయాత్మక (Deterministic)ఆటోమేషన్ వైపు కంపెనీ మొగ్గు చూపుతోంది.నమ్మకం కోల్పోతున్న ఎగ్జిక్యూటివ్‌లు

'ఒక సంవత్సరం క్రితం ఎల్ఎల్ఎంల గురించి మాకున్న నమ్మకం ఇప్పుడు లేదు' అని సేల్స్ ఫోర్స్ ప్రొడక్ట్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంజ్న పరులేకర్ అంగీకరించారు. ఏఐ నమూనాల్లో ఉండే రాండమ్‌నెస్(యాదృచ్ఛికం) వల్ల వ్యాపార పనుల్లో తప్పులు దొర్లే ప్రమాదం ఉందని, అందుకే తమ కొత్త ఉత్పత్తి అయిన ఏజెంట్ ఫోర్స్‌లో మరింత నియంత్రిత ఆటోమేషన్‌ను ప్రవేశపెడుతున్నామని ఆమె వెల్లడించారు.

**సాంకేతిక వైఫల్యాలే కారణమా?**

ఏజెంట్ ఫోర్స్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ మురళీధర్ కృష్ణప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. AI మోడల్స్‌కు ఎనిమిది కంటే ఎక్కువ సూచనలు (Prompts) ఇచ్చినప్పుడు అవి గందరగోళానికి గురవుతున్నాయి. ముఖ్యంగా..ఎక్కువ సూచనలు ఉంటే ఎల్ఎల్ఎంలు కీలకమైన ఆదేశాలను వదిలివేస్తున్నాయి. వినియోగదారులు అసంబద్ధమైన ప్రశ్నలు అడిగినప్పుడు ఏఐ తన అసలు లక్ష్యాన్ని మర్చిపోయి పక్కదారి పడుతోంది.

25 లక్షల కస్టమర్లు ఉన్న వివింట్(%Vivint%) వంటి



కంపెనీలు కస్టమర్ సర్వేలను పంపడంలో ఏఐ విఫలమైందని గుర్తించాయి. దీన్ని సరిదిద్దడానికి ఇప్పుడు మళ్లీ పాత పద్ధతిలో 'ట్రిగ్గర్లను' ఏర్పాటు చేయాల్సి వస్తోంది.

**డేటా ఫౌండేషన్లపై దృష్టి**

ఏఐ ద్వారా వేల కోట్లు ఆర్జించవచ్చని భావించిన సేల్స్‌ఫోర్స్ సీఈఓ మార్క్ బెనియోఫ్ ఇప్పుడు డేటా ఫౌండేషన్లపై దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నారు. సరైన డేటా లేకుండా ఏఐ ఇష్టారీతిన ప్రవర్తిస్తుందని చెప్పారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. ఏఐ ఏజెంట్ల విస్తరణ కారణంగా కంపెనీ తన సహాయక సిబ్బందిని 9,000 నుంచి 5,000కి తగ్గించిందని వెల్లడించారు.

# పిల్లలు బలహీనంగా ఉన్నారంటే ఐరన్ లోపం కావచ్చు, ఇవి తినిపించండి!

**పిల్లలు ఏదీ సరిగ్గా తినరు, అన్నింటిని ఏరుకుంటూ తింటారు. కాబట్టి వారిలో ఐరన్ లోపం తలెత్తకుండా జాగ్రత్తపడాలి.**

పిల్లలు పెరిగేకొద్దీ వారి ఎదుగుదలకు శరీరానికి ఇనుము అవసరం. పిల్లలు వారి ఆహారంలో తగినంత మొత్తంలో ఐరన్ తీసుకోవాలి. ఐరన్ లోపం వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ లోపం ఏర్పడుతుంది. ఫలితంగా ఇది రక్తంలో ఎర్ర రక్త కణాల సంఖ్యను తగ్గిస్తుంది. ఇది క్రమంగా రక్తహీనత వంటి ప్రమాదకరమైన వ్యాధిగా మారే అవకాశం ఉంది, ఇది అందరికీ వర్తిస్తుంది. కాబట్టి పిల్లలైనా, పెద్దలైనా తమ శరీరంలో సరైన మోతాదులో ఐరన్ ఉండేలా చూసుకోవడం చాలా అవసరమని నిపుణులు చెబుతున్నారు.

ఐరన్ లోపం వల్ల పిల్లల్లో ఎలాంటి అనారోగ్య సమస్యలు ఎదురవుతాయో ఇక్కడ చూడండి.

**ఎదుగుదల కుంటుపడుతుంది**

శరీర ఎదుగుదలకు ఇనుము ఒక ముఖ్యమైన మూలకం. ఇది బలమైన ఎముకలు, కండరాల సరైన అభివృద్ధికి సహాయపడుతుంది. పిల్లలలో ఐరన్ లోపం వారి ఎదుగుదలకు ఆటంకం కలిగిస్తుంది. ఎనీమియాకు కారణమవుతుంది.

**రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది**

పిల్లల్లో రోగనిరోధక వ్యవస్థ ఆరోగ్యంగా ఉండాలంటే అన్ని పోషకాలతో కూడిన ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలి. మెరుగైన రోగనిరోధక శక్తి, వ్యాధులతో పోరాడటానికి సహాయపడుతుంది. పిల్లల రోగనిరోధక వ్యవస్థ బలహీనపడటానికి ఇనుము లోపం కారణం. ఇది పిల్లలకు జలుబు లేదా ఫ్లూ వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది.

**మానసిక ఎదుగుదల తగ్గుతుంది**

పిల్లల శారీరక ఎదుగుదలతో పాటు మానసిక వికాసానికి ఇనుము చాలా ముఖ్యం. ఐరన్ లోపం పిల్లల మెదడుపై ప్రభావం చూపుతుంది. దీనివల్ల పిల్లలు ఏకాగ్రత కోల్పోవడంతోపాటు చదువుపై ఆసక్తి తగ్గుతుంది. ఇది వారిలో నైపుణ్యాల అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుంది.

అయితే పిల్లల ఆహారంలో ఐరన్ ఎంత మోతాదులో ఉండాలి? వారిలో ఇనుము లోపం తలెత్తకుండా ఎలాంటి **ఆహారాన్ని అందివ్వాలో తెలుసుకుందాం.**

హెల్త్ రిపోర్ట్స్ ప్రకారం, 6 నెలల వరకు శిశువులు తమ తల్లి పాల ద్వారానే ఇనుము పొందుతారు. కాబట్టి తల్లి సరైన పోషకాహారం తీసుకుంటే సరిపోతుంది. 1 నుంచి 3 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న పిల్లలకు ప్రతిరోజూ 7 మిల్లీగ్రాముల ఇనుము అవసరం, 4 నుండి 8 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు 10 mg% ఇనుము అవసరం. 9 నుండి 13 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు 8 మి.గ్రా అలాగే 14 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు 40 మిల్లీ గ్రాములు ఇనుము అవసరం అవుతుంది.

**ఇనుము ఎక్కువగా లభించే ఆహారాలు**

ఐరన్ సమృద్ధిగా లభించే ఆహార పదార్థాలు అందివ్వడం ద్వారా పిల్లల్లో ఐరన్ లోపం తలెత్తదు. అవేమిటో ఇక్కడ చూడండి. ఆకుకూరలు: పిల్లలు ఆహారంలో అన్ని సీజనల్ పండ్లు, కూరగాయలు తీసుకోవడం మంచిది. పాలకూర, మెంతికూర, బ్రకోలీ వంటి ఆకుకూరల్లో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. పిల్లల ఆహారం కోసం ఇది మంచి **ఎంపిక.** మాంసాహారం: ఎర్ర మాంసం, మటన్ లివర్, చేపలు మొదలైనవి ఇనుముకు ఉత్తమ వనరులు. పిల్లల ఆహారంలో ఇనుమును పెంచడానికి రెడ్ మీట్ మంచి ఎంపిక. డాక్టర్ల సలహా మేరకు ఐరన్ సప్లిమెంట్స్ ఇవ్వవచ్చు. **డ్రైఫ్రూట్స్-**నట్స్: ఖర్జూర పండ్లు, గుమ్మడి గింజలు, చిక్కుళ్లలో మొదలైన డ్రై ఫ్రూట్స్, నట్స్ లలో ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది. స్వచ్ఛమైన 100 శాతం డార్క్ చాక్లెట్ కూడా ఐరన్ కు మంచి మూలం. తినిపేంచేపుడు జాగ్రత్త వారి గొంతులో చిక్కుకోవచ్చు. చిన్నచిన్న ముక్కలుగా చేసి తినిపించవచ్చు.

# మాంగనీస్ పుష్కలంగా లభించే ఆహారాలు..!

మనం రోజూ తినే ఆహారం పోషకాల సరైన మిశ్రమంతో సమతుల్యంగా ఉండాలని పోషకాహార నిపుణులు, వైద్యులు తరచూ నొక్కి చెబుతారు. దీనికి ప్రధాన కారణం ఏమిటంటే, ఈ పోషకాలన్నీ ఒక్కొక్కటి శరీరంలో ఒక్కో ముఖ్యపాత్రను పోషిస్తాయి. ఏదైనా పోషక లోపం తలెత్తితే దాని ప్రభావం మనకు ఏదో రూపంలో కనిపిస్తుంది. అనారోగ్య సమస్యలు బయటపడతాయి. అందుకే వైద్యుల వద్దకు వెళ్లకుండా ఉండాలంటే సరైన ఆహారమే ఔషధంగా పనిచేస్తుంది.

ఉదాహరణకు, మెగ్నీషియం ఒక ముఖ్యమైన పోషకం, ఇది రక్తంలో చక్కెరను నియంత్రించడం, కండరాలు, నరాలు దృఢత్వం, గుండె పనితీరును నిర్ధారించడం వంటి కీలకమైన శరీర విధులను నిర్వహిస్తుంది. ఎముకలు, దంతాల ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. మనం తినే ఆహారంలోని మెగ్నీషియం చాలా వరకు, దాదాపు 60% ఎముకలు సాంద్రతను నిర్వహించడానికి వినియోగం అవుతుంది. శరీరంలో తగినంత మెగ్నీషియం లేకపోవడం వల్లే బోలు ఎముకల వ్యాధికి దారి తీస్తుంది. మెగ్నీషియం అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల మధుమేహాన్ని దూరంగా ఉంచవచ్చని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి.

**మెగ్నీషియంతో ఆరోగ్య ప్రయోజనాలు**

మీ ఆహారంలో సరైన మోతాదులో మెగ్నీషియం ఎందుకు ఉండాలో ప్రధాన కారణాలను ఇక్కడ చూడండి.

1. ఎముకల ఆరోగ్యం

మెగ్నీషియం ఎముకలు, దంతాలను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది: ఇది కాల్షియం శోషణకు అవసరమైన విటమిన్ డిని శరీరంలో సక్రియం చేయడంలో సహాయపడుతుంది కాబట్టి, ఇది ఎముకల ఆరోగ్యానికి అవసరం. ఇది కాల్షియం స్థాయిలను క్రమబద్ధీకరించడానికి, బలమైన ఎముకలు, ఆరోగ్యకరమైన దంతాలను ప్రోత్సహించడంలో సహాయపడుతుంది.

**2. రక్తపోటును తగ్గిస్తుంది**


మెగ్నీషియం హృదయ స్పందనను నియంత్రించడంలో సహాయపడుతుంది. రక్త నాళాలను సడలించడం, విస్తరించడంలో సహాయం చేస్తుంది. ఇది అధిక రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది, తద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**3. ఒత్తిడిని తగ్గిస్తుంది**

మెగ్నీషియం స్ట్రెస్ హార్మోన్ల ఉత్పత్తిని నియంత్రించడం ద్వారా ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఇది ప్రశాంతమైన ప్రభావాన్ని అందిస్తుంది, శరీరం విశ్రాంతి తీసుకోవడానికి సహాయపడుతుంది.

**4. మైగ్రేన్ నొప్పిని తగ్గిస్తుంది**

మెగ్నీషియం మానసిక స్పష్టత, ఏకాగ్రతను పెంచడానికి



సహాయపడుతుంది, మన జ్ఞాపకశక్తిని పదును పెడుతుంది. నిరాశ, ఆందోళన లక్షణాలను కూడా తగ్గిస్తుంది. ఇది మైగ్రేన్ తలనొప్పుల ఫ్రీక్వెన్సీ, తీవ్రతను తగ్గించడంలో సహాయపడుతుంది.

**5. రక్తంలో చక్కెరను నియంత్రిస్తుంది**

చాలా మంది పెద్దలకు రోజుకు 300-400 మిల్లీగ్రాముల మెగ్నీషియం అవసరం. ఇది ఆహారంలో ఉండే గ్లూకోజ్‌ని శక్తిగా మార్చడానికి సహాయపడుతుంది. కాబట్టి శక్తి స్థాయిని స్థిరంగా ఉంచడం వలన ఇది రోజంతా మీకు సహజమైన శక్తిని ఇస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది.

**6. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది**

మెగ్నీషియం స్కిన్ ప్రొటీన్ అయిన కొల్లాజెన్ ఉత్పత్తిని నియంత్రించడంలో సహాయపడుతుంది, కాబట్టి ఇది ఆరోగ్యకరమైన చర్మాన్ని పొందడంలో సహాయపడుతుంది. మెగ్నీషియం చర్మ సంరక్షణ సప్లిమెంట్ , గమ్మీలలో ఉపయోగిస్తారు.

**7. నిద్ర నాణ్యతను పెంచుతుంది**

సరిగ్గా నిద్రపోవాలంటే మన శరీరం, మెదడు విశ్రాంతి తీసుకోవాలి. మెగ్నీషియం మన మెదడు, నాడీ వ్యవస్థను సడలించడానికి పారాసింపథెటిక్ నరాల వ్యవస్థను సక్రియం చేస్తుంది. ఇది నిద్ర హార్మోన్ అయిన మెలటోనిన్‌ను కూడా నియంత్రిస్తుంది. కాబట్టి ఇది మెదడు, శరీరాన్ని నిద్రించడానికి సిద్ధం చేస్తుంది.

**8. తెల్ల రక్త కణాలను మెరుగుపరుస్తుంది.**

మెగ్నీషియం రోగనిరోధక వ్యవస్థతో బలమైన సంబంధాన్ని కలిగి ఉంది. ఇది సూక్ష్మక్రిములతో పోరాడటానికి, వాటిని నాశనం చేయడానికి తెల్ల రక్త కణాలను మెరుగుపరుస్తుంది. కాబట్టి మెగ్నీషియం తక్కువగా ఉన్నప్పుడు, శరీరం సంక్రమణతో పోరాడటానికి బదులుగా దాని స్వంత కణాలు, కణజాలాలపై దాడి చేస్తుంది.

ఆకుపచ్చ ఆకు కూరలు, నట్స్, విత్తనాలు, తృణధాన్యాలు వంటి ఆహారాలలో మెగ్నీషియం పుష్కలంగా లభిస్తుంది. పాలకూర, స్విస్ చార్డ్, గుమ్మడి గింజలు, పెరుగు లేదా కేఫీర్, బాదం, బ్లాక్ బీన్స్, అవకాడోలు, అత్తి పండ్లు, డార్క్ చాక్లెట్లు తినడం ద్వారా మెగ్నీషియం శరీరానికి లభిస్తుంది.

# 'సి' రామ రక్ష



**శక్తిమంతమైన సూక్ష్మపోషకాల్లో విటమిన్ సి ఒకటి. ఇది శరీరంలో రకరకాల పనుల్లో పాలు పంచుకుంటుంది. చర్మం, కండర బంధనాలు, రక్తనాళాలు ఆరోగ్యంగా ఉండటానికి అత్యవసరమైన కొలాజెన్ ప్రొటీన్ తయారీ.. గాయాలు, గాయాలతో తలెత్తే మచ్చలు మానటం.. ఎముకలు, మృదులాస్థి, దంతాల బలోపేతం.. శాకాహారం నుంచి ఐరన్ శోషణ వంటివన్నీ దీని చలవే. ఇంతటి మహా పోషకం కాబట్టే ఆరోగ్య సంరక్షణలో దీనికి అంత ప్రాధాన్యం. దీనిపై అపోహలకూ కొదవలేదు. మాత్రల రూపంలో పెద్దమొత్తంలో తీసుకోవాలని భావించేవారు ఎందరో. ఇందులో నిజమెంత?**

మన శరీరం విటమిన్ సి తయారు చేసుకోలేదు. ఆహారం ద్వారానే తీసుకోవాల్సి ఉంటుంది. రోజుకు ఎంత అవసరమనేది వయసు, లింగ భేదం, జీవిత దశలను బట్టి ఆధారపడి ఉంటుంది. వ్యక్తుల ఆరోగ్య పరిస్థితులు, జీవనశైలి వంటి వాటిని బట్టి కొందరికి ఎక్కువ, తక్కువ అవసరమవ్వచ్చు.

పెద్దవారిలో (19 ఏళ్లు పైబడిన) మగవారికి 90 ఎంజీ, ఆడవారికి 75 ఎంజీ, గర్భిణులకు 85 ఎంజీ, పాలిచ్చే తల్లులకు 120 ఎంజీ అవసరం.

(పొగతారేవారైతే మామూలు వాళ్ల కన్నా 35 ఎంజీ అదనంగా తీసుకోవాలి)

**ఇలా మేలు చేస్తుంది**

సహజ రక్షణ వ్యవస్థలను మెరుగు పరచటం ద్వారా రోగనిరోధక వ్యవస్థ బలోపేతం కావటానికి.. అది సక్రమంగా, సమర్థంగా పనిచేయటంలో విటమిన్ సి కీలక పాత్ర పోషిస్తుంది.

నాడీ కణాల మధ్య సమాచార ప్రసారానికి తోడ్పడే సమాచార వాహకాల తయారీకీ సాయం చేస్తుంది.

కొందరికి వయసు మీద పడుతున్నకొద్దీ కంట్లోని మాక్యులా క్షీణిస్తుంటుంది (ఏఎండీ). ఆహార రూపంలో విటమిన్ సి తీసుంటే ఇది ముదిరే వేగం తగ్గుతున్నట్టు తేలింది. పెద్దమొత్తంలో విటమిన్ సితో శుక్లాల ముప్పు తగ్గుతున్నట్టు బయటపడింది గానీ మాత్రలతో మిశ్రమ ఫలితాలే కనిపించాయి.

విటమిన్ సి అత్యంత శక్తిమంతమైన యాంటీఆక్సిడెంట్ కూడా. విచ్చలవిడిగా సంచరిస్తూ కణాలు, కణజాలాలను దెబ్బతీసే విశృంఖల కణాలనూ నిలువరిస్తుంది. ఇలా క్యాన్సర్ల ముప్పు తగ్గటానికీ తోడ్పడుతుంది. అలాగని మాత్రలు వేసుకుంటే చాలనుకుంటున్నారేమో. ఒక్క విటమిన్ సి మాత్రలతో అంత ఉపయోగమేమీ ఉండదు.

**అతిగా తీసుకోవద్దు**

సాధారణంగా విటమిన్ సి సురక్షితమైందే. కానీ అతిగా.. అంటే రోజుకు 2,000 ఎంజీ కన్నా ఎక్కువగా తీసుకుంటే శరీరం శోషించుకోలేదు. ఫలితంగా విరేచనాలు, వికారం, కడుపు నొప్పి వంటి దుష్ప్రభావాలు తలెత్తొచ్చు. అరుదుగా.. ముఖ్యంగా కిడ్నీ జబ్బులతో బాధపడేవారికి కిడ్నీ రాళ్లు ఏర్పడొచ్చు. గర్భిణులు మరీ ఎక్కువగా తీసుకుంటే పుట్టిన తర్వాత పిల్లల్లో విటమిన్ సి మోతాదుల మీద ప్రభావం చూపొచ్చు.

**అపోహలు వద్దు**

విటమిన్ సి జలుబును నివారిస్తుందని, ఒకవేళ



జలుబైనా త్వరగా తగ్గేలా చేస్తుందని చాలామంది భావిస్తుంటారు. కానీ ఇదేమంత నిజం కాదని పరిశోధనలు సూచిస్తున్నాయి. తరచూ విటమిన్ సి తీసుకోవటం వల్ల జలుబు వచ్చే అవకాశాలు తగ్గుతున్న దాఖలాలు కనిపించలేదు. జలుబుతో బాధపడే రోజులను, తీవ్రతను కొంతవరకు తగ్గిస్తున్నట్టు కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. అందువల్ల జలుబు నివారణకు ప్రత్యేకించి విటమిన్ సి మాత్రలు వాడాల్సిన పనేమీ లేదు. ఆహారం ద్వారా తగినంత లభించేలా చూసుకుంటే చాలు.

అధిక రక్తపోటు, గుండెజబ్బును విటమిన్ సి తగ్గిస్తుందనేది మరికొందరి నమ్మకం. విటమిన్ సి, గుండె ఆరోగ్యం మధ్య సంబంధం ఉంటున్నట్టు స్పష్టంగా బయటపడలేదు. దీన్ని పెద్దమొత్తంలో.. ముఖ్యంగా పండ్లు, కూరగాయల ద్వారా తీసుకుంటే గుండె జబ్బు, పక్షవాతం ముప్పు తగ్గుతున్నట్టు కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. విటమిన్ సిలోని యాంటీఆక్సిడెంట్ గుణాలే దీనికి కారణం. అయితే గుండెజబ్బు తగ్గటం, నివారణలో విటమిన్ సి మాత్రలతో పెద్దగా ప్రయోజనాలు కనిపించటం లేదని ప్రయోగ పరీక్షలు చెబుతున్నాయి.

**వీటిల్లో దండిగా**

గోబీపువ్వు, బ్రోకలీ, పచ్చి మిరప, క్యాప్సికం, క్యాబేజీ, బంగాళాదుంప, చిలగడ దుంప, టమోటా, పాలకూర, నిమ్మకాయ, ఉసిరి వంటి వాటిల్లో విటమిన్ సి దండిగా ఉంటుంది. పండ్ల విషయానికి వస్తే బత్తాయి, నారింజ, జామ, మామిడి, బొప్పాయి, పుచ్చకాయ, కివీ వంటి వాటిల్లో బాగా లభిస్తుంది.

# వృద్ధాప్యానికి ఔషధ కళ్లెం!

వృద్ధాప్య ఛాయలు త్వరగా ముంచుకురాకుండా చూడటానికి వ్యాయామం ఎంతగానో తోడ్పడుతుంది. మరి వ్యాయామం చేయలేనివారి పరిస్థితేంటి? ఓ మామూలు ఔషధ మూలకంతో వ్యాయామ ఫలితాలను పొందగలిగితే? చైనా పరిశోధకులు అలాంటి ఘనతే సాధించారు. శరీరమంతటా వృద్ధాప్యాన్ని అడ్డుకునే ప్రభావాలను వ్యాయామం ఎలా పుట్టిస్తుందో గుర్తించటమే కాదు, వాటిని అనుకరించగల మూలకాన్నీ కనుగొన్నారు. ఈ అధ్యయనంలో భాగంగా- విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు, తీవ్ర వ్యాయామం చేస్తున్నప్పుడు ఒంట్లో జరుగుతున్న పరిణామాలను నిశితంగా విశ్లేషించారు. ఇందులో కిడ్నీలు అదృశ్య కేంద్రంగా పనిచేస్తూ బిటేన్ అనే జీవక్రియ ద్రవ్యాన్ని శరీమంతటికీ సరఫరా చేస్తున్నట్టు తేలింది. ఒంట్లో సమతుల్యతను పునరుద్ధరించటానికి, రోగనిరోధక కణాలను ఉత్తేజితం చేయటానికి, వాపు ప్రక్రియను అదుపు చేయటానికి బీటేన్ తోడ్పడుతుండటం గమనార్హం. మరింత ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే- దీర్ఘకాల వ్యాయామ ప్రయోజనాల్లో చాలావాటిని బీటేన్



ఒక్కటే సాధిస్తుండటం. బీట్‌రూట్, పాలకూర వంటి వాటిల్లో బీటేన్ ఉంటుంది. శరీరమూ దీన్ని సొంతంగా తయారుచేసు కుంటుంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తున్నప్పుడు కిడ్నీలు దీన్ని పెద్దమొత్తంలో విడుదల చేసి, శరీరమంతటికీ వృద్ధాప్యాన్ని అడ్డుకునే సూచనలను పంపిస్తుండటం గమనార్హం. అందుకే దీన్ని ఎలుకలకు మందు రూపంలో ఇచ్చి పరిశీలించగా.. వ్యాయామంతో సమానమైన ఫలితాలు కనిపించటం విశేషం. వాపుప్రక్రియ తగ్గింది. జీవక్రియ, విషయగ్రహణ సామర్థ్యం ఇనుమడించాయి. బీటేన్ సురక్షితమైంది, సమర్థవంతమైంది కావటం వల్ల వ్యాయామం చేయలేనివారికిది ఉపయోగపడగలదని పరిశోధకులు చెబుతున్నారు.


# ఎయిర్‌పాడ్స్‌తో గుండె వేగం తెలుసుకో

శరీరానికి ధరించే వాచ్‌లు, స్మార్ట్‌రింగుల వంటివి యూజర్ల ఆరోగ్యాన్నీ ఓ కంట కనిపెడుతుంటాయి. అంతా వీటిల్లోని హెల్త్ ట్రాకర్ల గమ్మత్తే. గుండె వేగం వంటి వాటిని చిటికెలో తెలుసుకోవటానికివి బాగా ఉపయోగపడతాయి. యాపిల్‌కు చెందిన ఎయిర్‌పాడ్స్ ప్రొ 3 సైతం ఇందుకు సాయం చేస్తోంది. దీని ద్వారానూ అప్పటికప్పుడు గుండె వేగాన్ని గుర్తించొచ్చు. ఈ ఫీచర్‌ను ఆన్ చేసుకోవాలంటే- ముందుగా ఎయిర్‌పాడ్స్‌ను ధరించాలి. ఇప్పుడు ఐఫోన్‌లో సెటింగ్స్ యాప్‌ను ఓపెన్ చేసి, మీ ఎయిర్‌పాడ్స్ పేరు మీద తాకాలి. ఇందులో హార్ట్ రేట్ ఫీచర్‌ను




ఆన్ చేసుకోవాలి. ఆ తర్వాత 'వాట్స్ మై హార్ట్ రేట్' అని సిరిని అడిగి చూడండి. వెంటనే గుండె వేగమెంతో చెప్పేస్తుంది. లేదంటే హెల్త్ యాప్‌లోనైనా చూసుకోవచ్చు.

# కిడ్నీలకు ఆహార రక్ష!



కిడ్నీ జబ్బు నియంత్రణలో ప్రొటీన్, పాస్పరస్, పొటాషియం, సోడియం, ద్రవాలు చాలా ముఖ్యం. ఈ ఐదూ ఏం తింటున్నాం? ఏం తాగుతున్నాం? అనే వాటితో నేరుగా ముడిపడి ఉంటాయి. కాబట్టి దీర్ఘకాల కిడ్నీ జబ్బు గలవారికి ఆహారం మీద ప్రత్యేక శ్రద్ధ తప్పనిసరి. దీని విషయంలో జాగ్రత్త వహిస్తే కిడ్నీల మీద పడే భారాన్ని తగ్గించుకోవచ్చు. జబ్బు త్వరగా ముదరకుండా, దుష్ప్రభావాలు ముంచుకురాకుండా చూసుకోవచ్చు. కిడ్నీలు దెబ్బతిన్నవారికి రక్తపోటు పెరగటం, గుండెపోటు, గుండె వైఫల్యం వచ్చే అవకాశాలు ఎక్కువ. కొన్ని పదార్థాలు.. ముఖ్యంగా ఉప్పుతో రక్తపోటు పెరిగే ప్రమాదముంది. ఇది కిడ్నీలకు హాని చేస్తుంది. ఆహార నియంత్రణతో కిడ్నీ, గుండె రెండింటినీ కాపాడుకోవచ్చు. మిగతా అవయవాలూ బాగుంటాయి. మొత్తంగా ఆరోగ్యమూ మెరుగవుతుంది. హాయిగా జీవించటం సాధ్యమవుతుంది.

ప్రొటీన్ తగ్గించటం ముఖ్యం

కండరాలు, ఎముకలు, అనుసంధాన కణజాలాలు, లోపలి అవయవాలు ఆరోగ్యంగా ఉండటానికి ప్రొటీన్ అత్యవసరం. ఇన్‌ఫెక్షన్లతో పోరాడటానికీ ఇది తోడ్పడుతుంది. చిక్కేంటంటే- ప్రొటీన్ విచ్ఛిన్నమయ్యే క్రమంలో వ్యర్థాలు పుట్టుకురావటం. వీటిని కిడ్నీలే తొలగించాల్సి ఉంటుంది. అవసరానికి మించి ప్రొటీన్ తీసుకుంటే రక్తంలో వ్యర్థాలూ ఎక్కువగా పోగవుతాయి. ఇవి కిడ్నీల మీద అదనపు భారం పడేలా చేస్తాయి. కాబట్టి కిడ్నీ జబ్బు గలవారు ఆహారంలో ప్రొటీన్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు గానీ తగ్గించటం మంచిది. కిడ్నీ జబ్బు దశ, శరీర బరువు, మధుమేహం, కాలేయ జబ్బు వంటి ఇతరత్రా సమస్యలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని దీన్ని పరిమితం చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో ఆహార నిపుణుల సూచనలు కీలకం. ఇంటర్నెట్‌లో చూసో, ఎవరో చెప్పారనో ఎవరికివారు సొంతంగా నిర్ణయాలు తీసుకోవటం ప్రమాదకరం.

మాంసాహార ప్రొటీన్ కన్నా శాకాహార ప్రొటీన్ మంచిది. కంది, మినప, పెసర, శనగ వంటి పప్పులు.. రాజ్మా, సోయాబీన్స్ వంటి వాటితో ప్రొటీన్ దండిగా లభిస్తుంది. మాంసాహారులైతే కొవ్వు తక్కువగా ఉండేవి ఎంచుకోవాలి. గుడ్డు, స్కిన్‌లెస్ చికెన్, చేపల వంటివి మితంగా తినొచ్చు. మాంసం, మాంసం ఉత్పత్తులు తగ్గించుకోవాలి.

ఫాస్ఫరస్ మీద కన్ను

దెబ్బతిన్న కిడ్నీలు రక్తంలోని ఫాస్ఫరస్‌ను అంత సమర్థంగా తొలగించలేవు. అందుకే కిడ్నీజబ్బు గలవారిలో ఫాస్ఫరస్ ఎక్కువగా ఉంటుంది. ఇది మరీ పెరిగితే ఇబ్బందికరంగా పరిణమిస్తుంది. ఒంట్లో క్యాల్షియం, ఫాస్ఫరస్ మోతాదుల సమతుల్యత దెబ్బతిని, ఎముకలు బలహీన పడతాయి. రక్తనాళాల్లో క్యాల్షియం చేరి, గట్టిపడి పూడికలుగా ఏర్పడొచ్చు. దీంతో ఆయా అవయవాలకు రక్త ప్రసరణ తగ్గుతుంది. దీంతో గుండెపోటు, పక్షవాతం వచ్చే ప్రమాద ముంటుంది. కొన్నిసార్లు చర్మం

దురద పెట్టొచ్చు.

ఫాస్ఫరస్ సహజంగా పాలు, పెరుగు, చీజ్, బటర్, పొట్టుతీయని ధాన్యాలతో లభిస్తుంది. పప్పులు, మాంసం వంటి వాటిల్లో ప్రొటీన్‌తో పాటు ఫాస్ఫరస్ కూడా ఉంటుంది. కాబట్టి మాంసాహారమైనా, శాకాహారమైనా జాగ్రత్త అవసరం. రక్తంలో ఫాస్ఫరస్ మోతాదులను బట్టి ఏయే పదార్థాలు ఎంతెంత తినాలో నిర్ణయించుకోవాల్సి ఉంటుంది.

ఆహార పదార్థాల్లోని ఫాస్ఫరస్‌ను శరీరం సగమే శోషించుకుంటుంది. వీటితో పెద్దగా ఇబ్బంది ఉండక పోవచ్చు. కానీ ఫాస్ఫోరిక్ ఆమ్లం కలిపి తయారుచేసే కూల్‌డ్రింక్స్‌లోని ఫాస్ఫరస్‌ను శరీరం పూర్తిగా తీసుకుంటుంది. కాబట్టి కూల్‌డ్రింక్స్, ఎనర్జీ డ్రింక్స్, సోడాల వంటివి అసలే తాగొద్దు.

ఉప్పు మితంగా

ఉప్పులోని సోడియం మూలంగా శరీరంలో నీరు ఎక్కువగా చేరుతుంది. దీంతో బరువూ పెరుగుతుంది. అంతేకాదు, నీటితో పాటు రక్తం మోతాదూ పెరగటం వల్ల గుండె మీద ఎక్కువ భారం పడుతుంది. దీంతో రక్తపోటూ పెరుగుతుంది. కిడ్నీలకు అధిక రక్తపోటు పెద్ద శత్రువు. ఇది కిడ్నీలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ సోడియం వాడకాన్ని రోజు మొత్తంలో 2 గ్రాముల కన్నా (చెంచా కన్నా తక్కువ) మించనీయొద్దు.

వండేటప్పుడు ఎంత ఉప్పు వేస్తామో కచ్చితంగా తెలియదు. అందువల్ల వండిన తర్వాత తినే ముందు కూరల మీద ఉప్పు చల్లుకుంటే మంచిది.

నిల్వ పచ్చళ్లు, సాస్‌లలో ఉప్పు ఎక్కువగా ఉంటుంది. వీటికి దూరంగా ఉండటం మంచిది. అప్పటికప్పుడు రోట్లో నూరుకునే పచ్చళ్లతో పెద్ద ఇబ్బంది ఉండదు.

చిప్స్, బయట శుద్ధిచేసి అమ్మే ఆహార పదార్థాలు, ఉప్పు కలిపి ఎండించిన చేపలకు దూరంగా ఉండటం మంచిది.

ద్రవాలు అవసరమైనంత

కిడ్నీలు చేసే మరో పని ద్రవాల మోతాదులను నియంత్రించటం. పొటాషియం, ఫాస్పరస్ వంటి ఎలక్ట్రోలైట్లు మోతాదులూ ద్రవాలూ ఒకదాని మీద మరోటి ఆధారపడి ఉంటాయి. ఒంట్లో ద్రవాల మోతాదు ఎక్కువైతే వాటిని మూత్రం రూపంలో బయటకు పంపిస్తాయి. అయితే కిడ్నీ జబ్బులో వడపోత సామర్థ్యం, మూత్రం తయారయ్యే ప్రక్రియ నెమ్మదిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ద్రవాలు ఎక్కువగా తీసుకుంటే కిడ్నీల మీద మరింత భారం పడుతుంది. ద్రవాలు సరిగా బయటకు రాకపోతే అవి ఒంట్లోనే ఉండిపోతాయి. గుండె, ఊపిరితిత్తుల చుట్టూరా.. కాళ్లలో, ఒళ్లంతా పోగుపడొచ్చు. దీంతో రక్తపోటు పెరగటం, ఆయాసం, కాళ్లు, ముఖం ఉబ్బటం వంటి సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి అవసరమైన మేరకే నీరు తాగాలి. కొందరికి రోజుకు రెండు లీటర్ల ద్రవాలు సరిపోతే, కొందరు లీటరుకే పరిమితం చేసుకోవాల్సి రావొచ్చు. ఇది కిడ్నీల వడపోత సామర్థ్యాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది. మూత్రం ఎంత వస్తుందనే దాన్ని బట్టి నీరు తాగాలి.

నీరు ఒక్కటే కాదు.. కాఫీ, టీ వంటివీ ద్రవాల కిందికే వస్తాయి. గది ఉష్ణోగ్రత వద్ద కరిగే ఐస్‌క్రీమ్ కూడా ఒకరకంగా ద్రవ పదార్థమే. నీరు తాగాలని అనిపించినప్పుడు ఓ ద్రాక్షపండును నోట్లో పెట్టుకొని నమలొచ్చు. చిన్న ఐస్‌ముక్కను నోట్లో పెట్టుకోవచ్చు. నోరు తడారుతున్నట్టు అనిపిస్తే పిప్పరమెంటు బిళ్లల వంటివి చప్పరించొచ్చు. దీంతో లాలాజలం ఊరుతుంది. దప్పిక తగ్గుతుంది.

డయాలిసిస్ చేయించుకునేవారికి చికిత్సకు ముందు, తర్వాత బరువు కొలుస్తుంటారు. రెండు డయాలసిస్‌ల మధ్య 2-3 కిలోల కన్నా ఎక్కువ బరువు పెరగకూడదు. అంతకన్నా ఎక్కువగా పెరిగితే ద్రవాలు ఎక్కువగా తీసుకుంటున్నారనే అర్థం. డయాలిసిస్‌తో మొత్తం ద్రవాలను తొలగించటం సాధ్యం కాదు. కాబట్టి ముందే తగ్గించుకోవటం ఉత్తమం.

# జేఎన్టీయూకేలో అవాంటెల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రత్యేకత



**కాకినాడ; గాంధీనగర్:** పరిశ్రమ డిమాండ్లను తీర్చగలిగే పాఠ్యాంశాలు (కరిక్యులమ్) రూపొందించినప్పుడే విద్యార్థులు త్వరితగతంగా కొలువులు సాధించొచ్చు. ఇటీవల కాకినాడ జేఎన్టీయూకి వచ్చిన విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఇదే అంశమై మాట్లాడుతూ కంపెనీలు తమ పరిశోధనలకు విశ్వవిద్యాలయాలకు సాయపడాలని సూచించారు. సిగ్నల్, కమ్యూనికేషన్ రంగంలో ప్రసిద్ధిగాంచిన అవాంటెల్ లిమిటెడ్ కంపెనీ.. తాజాగా తమకు అవసరమైన మానవ వనరులను తయారుచేసుకునేందుకు జేఎన్టీయూలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుచేసింది. ఇందులో సీటు పొంది కోర్సు పూర్తిచేసినవారికి కొలువులూ ఇవ్వనుంది. ఈ సెంటర్ స్ఫూర్తితో జేఎన్టీయూకేలో క్వాంటమ్, ఏఐ సబ్జెక్టులకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి.

**నాడు ఇక్కడ చదువుకుని..**

అవాంటెల్ కంపెనీ భారతీయ రక్షణ, నౌకా, విమానయాన, అంతరిక్ష రంగాల్లో కమ్యూనికేషన్ పరికరాలు, సాంకేతిక సేవలందిస్తుంది. ఈ కంపెనీ సీఎండీ ఎ.విద్యాసాగర్ జేఎన్టీయూ పూర్వ విద్యార్థే. తాను చదువుకున్న విద్యాసంస్థలోనే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేశారు. సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్ కోర్సులో ఎంటెక్ ప్రోగ్రాం తెచ్చారు. ల్యాబ్‌కు అత్యాధునిక కమ్యూనికేషన్ పరికరాలు, నెట్‌వర్క్ ఎనలైజర్లు, కంప్యూటర్లు, సాంకేతిక సిబ్బంది, ఫ్యాకల్టీ మొత్తాన్ని ఆ కంపెనీయే సమకూర్చింది.

**25 సీట్లతో..**

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చేరడానికి ఈసీఈ విద్యార్థులు అర్హులు. బీటెక్ అనంతరం ఎంటెక్‌లో ప్రవేశానికి గేట్ రాసి అర్హత సాధించినవారు సిగ్నల్ ప్రాసెసింగ్, కమ్యూనికేషన్‌లో చేరడానికి మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి. మౌఖిక పరీక్షల ద్వారా ఎంపికచేస్తారు. ముందుగా నోటిఫికేషన్ ఇస్తారు. ప్రస్తుతం 25 సీట్లు ఉన్నాయి. ఏడాదికి రూ.50 వేల ఫీజు.. మొదటి ఏడాది ఇక్కడి ఎక్సలెన్స్‌లో చదువుకుంటారు. రెండో ఏడాది హైదరాబాద్ కేంద్రం అవాంటెల్ కంపెనీలోనే ఇంటర్న్‌షిప్ చేయాలి. అప్పుడు నెలకు రూ.25 వేలు ఉపకారవేతనంగా ఇస్తారు.

**ప్రయోగాత్మకంగా ప్రారంభం**

కోర్సు పూర్తిచేసినవారిలో ప్రతిభావంతులకు ఏడాదికి రూ.9 లక్షల ప్యాకేజీతో అవాంటెల్ కంపెనీ ఉద్యోగాలు ఇస్తుందని జేఎన్టీయూకే ఈసీఈ విభాగం హెచ్‌వోడీ లీలాకుమారి చెప్పారు. ఈ ఏడాది ప్రయోగాత్మకంగా కోర్సు ప్రారంభించామని, రానున్న విద్యా సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో ప్రవేశాలు ఉంటాయన్నారు.

# రైతు బజార్లో సౌకర్యాలు కరువు రోడ్లపై కూరగాయల వ్యాపారం



**సాలూరు విశాఖ సమాచారం :** సాలూరు మున్సిపాలిటీ పరిధిలో దండిగావ్ వెళ్లే రహదారి ప్రక్కన సాలూరు మున్సిపాలిటీ పాలకవర్గం రైతు బజారు నిర్మాణం కోసం 39 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు నామమాత్రముగా నిర్వహించారు కనీస సౌకర్యాలు లేని కారణంగా కూరగాయల వ్యాపారులు రైతులు తాము పండించిన కూరగాయలను తీసుకువచ్చి రోడ్డు బయట అమ్మకాలు చేస్తున్నారు రోడ్ల ఇరువైపులా దుమ్ము ధూళి మధ్య వ్యాపారాలు జరుగుతున్నాయి ఒరిస్సా నుండి వచ్చిన కూరగాయల వ్యాపారులు రోడ్ల మీద ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో కూరగాయలు అమ్ముతున్నారు జాతీయ రహదారి రోడ్లపై వాహనాలు నిత్యము రద్దీగా ఉంటాయి మార్కెట్ కమిటీ అధ్యక్షులు సిబ్బంది స్పందించి రైతు బజారు షెడ్లు పనులు త్వరగా పూర్తిచేసి రైతుబజార్లో కూరగాయలు విక్రయాలు జరిగితే సాలూరు పట్టణ ప్రజలు కోరుతున్నారు

# జనసేన ఇంచార్జ్ రామారావుకు షాక్.. మత్స్యకారుల ఝలక్



**తూర్పుగోదావరి:** కొవ్వూరు జనసేన ఇంచార్జ్ టీవీ రామారావుకు చేదు అనుభవం ఎదురైంది. కొవ్వూరులో మత్స్యకారులు ఆయనపై తిరుగబడ్డారు. దీంతో, మత్స్యకారులు, ఆయన మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం, చేసేదేమీ లేక అక్కడి నుంచి రామారావు వెళ్లిపోయారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొవ్వూరు శ్రీనివాస ఘాట్ వద్ద అనుమతులు లేకుండా టూరిజం బోట్ పేరుతో టీవీ రామారావు కట్టడాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో అనుమతులు లేని టూరిస్ట్ బోటు కట్టడాలను ఆపాలని తమ బతుకు తెరువు పోగొట్టుదంటూ మత్స్యకారులు ఆందోళనకు దిగారు. దీంతో, మత్స్యకారులకు, టీవీ రామారావు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో మత్స్యకారులు.. పనులు అడ్డుకోవడంతో చేసేది ఏమీ లేక పర్మిషన్ తీసుకునే వస్తానంటూ పనులను ఆపేసి రామరావు అక్కడి నుంచి జారుకున్నారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ.. తమ జీవనోపాధి దెబ్బతిసేలా తమ పడవలు పెట్టుకునే ప్రాంతంలో టూరిజం బోట్ ఏర్పాటు చేస్తామని తమపై రామారావు దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక ర్యాంపుల మధ్య టూరిస్ట్ బోటు కట్టడాలను కట్టి 100 కుటుంబాలకు జీవనోపాధి పోగొడుతున్నారని అన్నారు. అక్రమ కట్టడాలు కడుతున్నా అధికారులు అటువైపు కూడా కన్నెత్తి చూడకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# యథేచ్ఛగా విద్యుత్తు చౌర్యం 'దొంగలు'



**కాకినాడ కలెక్టరేట్ :** జిల్లాలో అక్రమ విద్యుత్తు వినియోగం యథేచ్ఛగా సాగుతోంది. ఎన్ని చర్యలు చేపట్టినా అక్రమార్కులకు అడ్డుకట్ట పడటం లేదు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 15 వరకు విద్యుత్తు అక్రమ వినియోగానికి సంబంధించిన కేసులను పరిశీలిస్తే విస్తుపోవాల్సిందే. సామాన్యుడు బిల్లు కట్టకపోతే వెంటనే కనెక్షన్ కట్ చేసే అధికారులు.. చౌర్యం చేసే వారికి మాత్రం జరిమానా విధించి ఊరుకుంటున్నారు. అది చెల్లించడానికి గడువూ ఇస్తున్నారు. దీంతో అక్రమార్కులు నాయకులతో సిఫార్సులు చేయిస్తూ పబ్బం గడుపుతున్నారు.

అయిదు రకాలుగా అక్రమం

ఏపీఈపీడీసీఎల్‌కు చెందిన విజిలెన్స్, ఆపరేషన్స్ విభాగాలు ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టినా.. చౌర్యానికి అడ్డుఅదుపూ లేకుండా పోతోంది. అయిదు రకాలుగా అక్రమ వినియోగానికి పాల్పడుతున్నట్లు గుర్తించారు. ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాల నుంచి అక్రమంగా విద్యుత్తు వినియోగం, మీటరు నుంచి చౌర్యం, ఒక కేటగిరీ కింద కనెక్షన్ తీసుకుని అదనపు లోడ్ వినియోగించడం, వ్యవసాయ కనెక్షన్ తీసుకుని చెరువులు వంటి వాటికి వినియోగించడం, మీటరు పనిచేయకుండా చేయడం వంటి చర్యలతో విద్యుత్తుశాఖకు నష్టం చేకూరుస్తున్నారు. వీటికి సంబంధించి కాకినాడ, పెద్దాపురం, జగ్గంపేట డివిజన్లలో 9 నెలల 15 రోజుల కాలంలో 1,514 కేసులు నమోదు చేశారు. రూ.5.82 కోట్ల మేర జరిమానా విధించారు.

వేసవి నేపథ్యంలో నిఘా

జిల్లాలోని జగ్గంపేట, కాకినాడ డివిజన్ల పరిధిలో ఎక్కువగా విద్యుత్తు చౌర్యం జరుగుతున్నట్లు గుర్తించారు. మొత్తం కేసుల్లో ఈ రెండింటిలోనే 1,333 ఉన్నాయి. జగ్గంపేట డివిజన్‌లోని జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో ఎక్కువగా అక్రమ విద్యుత్తు వినియోగం జరుగుతోంది. కాకినాడ డివిజన్‌కు సంబంధించి కరప సబ్‌డివిజన్‌లోని పెదపూడి, కరప మండలాలు, పెద్దాపురం డివిజన్‌కు సంబంధించి పెద్దాపురం, సామర్లకోట గ్రామీణ ప్రాంతాల్లో ఈ చౌర్యం ఎక్కువగా జరుగుతోంది. వేసవి నేపథ్యంలో అక్రమార్కులు మరింత రెచ్చిపోయే అవకాశముంది. గత అనుభవాల నేపథ్యంలో పెదపూడి, కరప, జగ్గంపేట, గండేపల్లి మండలాలపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

అక్రమ విద్యుత్తు వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు చేపడతాం. ఈ విషయంలో ఎవరినీ వదలం. నిరంతరం నిఘా కొనసాగిస్తాం. కేసులు నమోదైన వాటికి జరిమానా చెల్లించకపోతే కనెక్షన్లు నిలిపివేస్తాం.

జి.ప్రసాద్, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్, కాకినాడ సర్కిల్

# టెన్త్ పరీక్షలకు విస్తృత ఏర్పాట్లు



**రాజమహేంద్రవరం** సిటీ: మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు జరగనున్న ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సమన్వయశాఖలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, శానిటేషన్, భద్రతా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సూచించారు. ప్రశ్నాపత్రాల రవాణా, భద్రపరిచే విధానంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు శాఖ సహకారం తీసుకోవాలని ఆదేశించారు. వైద్యశాఖ ద్వారా అత్యవసర వైద్య సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. జిల్లావ్యాప్తంగా ఈ పరీక్షలకు మొత్తం 24,538 మంది విద్యార్థులు నమోదు కాగా, బాలురు 12,555 మంది, బాలికలు 11,983 మంది అని వివరించారు. జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె. వాసు దేవరావు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సాయిరాం ఆలయం వద్ద అన్న సమారాధన



**సాలూరు విశాఖ సమాచారం:** పాచిపెంట మండలం కర్రివలస గ్రామములో నూతనముగా నిర్మాణం చేసిన సాయిరాం మందిరము వద్ద గురువారం మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమము నిర్వహించారు పురోహితులు శ్రీనివాసరావు ఉదయం స్వామివారికి అభిషేకాలు పూజలు నిర్వహించారు అనంతరం మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు ఆలయ నిర్వాహకులు టీ మృత్యుంజయ రావు అలియాస్ చినబాబు మాట్లాడుతూ ఆలయ నిర్మాణము నుండి ప్రతి లక్ష వారం అన్న సమారాధన దాతలు సహాయ సహకారముతో కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు

# రాజమహేంద్రవరంలో ముమ్మర తనిఖీలు



**కంబాలచెరువు(రాజమహేంద్రవరం :** రాజమహేంద్రవరంలోని జిల్లా కోర్టుకు బుధవారం బాంబు బెదిరింపులు రావడంతో అంతా ఉలిక్కిపడ్డారు. కోర్టు అధికారిక ఈ-మెయిల్‌కు బెదిరింపులతో కూడిన మెయిల్ రావడంతో అధికారులు పోలీసులకు సమాచారమిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ పర్యవేక్షణలో వెంటనే డాగ్, బాంబు స్క్వాడ్ బృందాలు రంగంలోకి దిగాయి. కోర్టులో న్యాయవాదులు, కక్షిదారులను బయటికి పంపించి సాయంత్రం వరకు ముమ్మర తనిఖీలు చేపట్టారు. బాంబుకు సంబంధించి ఎలాంటి ఆనవాళ్లు కనిపించకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఇది ఆకతాయిల పనిగా పోలీసులు భావిస్తున్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు.

# కల్వర్టును ఢీకొని యువకుడి మృతి..




**జగ్గంపేట గ్రామీణం, సామర్లకోట :** కొంతకాలంగా నాటుకోళ్ల మకాంలో కూలీపనులు చేస్తున్న తల్లిదండ్రులను చూసేందుకు వచ్చిన ఆ యువకుడు మంగళవారం రాత్రి ప్రమాదానికి గురై మృత్యుఒడికి చేరాడు. వివరాలివీ.. సామర్లకోట బ్రౌన్‌పేటకు చెందిన మర్రి సత్యనారాయణ (26) జగ్గంపేట మండలం గొల్లలగుంటలో తల్లిదండ్రులను చూసేందుకు వచ్చి కల్వర్టును ఢీకొని మృతిచెందాడు. సామర్లకోటలో చేపల వ్యాపారి వద్ద కూలిపనులు చేసుకునే సత్యనారాయణ మంగళవారం ఉదయం తల్లిదండ్రుల వద్దకు వచ్చి రోజంతా వారితో గడిపాడు. సాయంత్రం తిరుగుప్రయాణమై వెళుతుండగా తండ్రి శ్రీనివాస్ కోరిన పెరుగు, దోమలచక్రం కొని తీసుకెళుతుండగా మోటారు సైకిల్ అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతుండగా స్థానికులు 108కు సమాచారం అందించగా జగ్గంపేటలో సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహానికి బుధవారం శవపంచనమా నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. తండ్రి ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**బ్రౌన్‌పేటలో విషాద ఛాయలు**

యానాదుల కాలనీకి చెందిన సత్యనారాయణకు బిక్కవోలుకు చెందిన దేవితో వివాహమైంది. వీరికి మూడు నెలల చిన్నారి ఉంది. బాలింతగా ఉన్న దేవికి భర్త మృతిచెందిన విషయం తెలియడంతో బోరున విలపించారు. సత్యనారాయణ మృతితో బ్రౌన్‌పేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# డ్రైనేజీ కబ్జాలపై అసెంబ్లీలో గళమెత్తిన పంతం నానాజీ



పారుదల

**కాకినాడ రూరల్ విశాఖ సమాచారమ్ :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల్లో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ గత ప్రభుత్వ కాలంలో డ్రైనేజీలపై జరిగిన కబ్జాలు, అక్రమ నిర్మాణాల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ముంపు సమస్యలను తీవ్రంగా ప్రస్తావించారు. కాకినాడ రూరల్, కాకినాడ సిటీ పరిధిలోని వాకలపూడి, వలసపాకల, రమణయ్యపేట, తిమ్మాపురం గ్రామాలు, అదేవిధంగా గోడారిగుంట, పల్లంరాజు నగర్ ప్రాంతాలు ప్రతి వర్షాకాలంలో వరద ముంపుకు గురవుతున్నాయని పేర్కొన్నారు. డ్రైనేజీ మార్గాలను ఆక్రమించడం వల్ల నీటి పారుదల వ్యవస్థ దెబ్బతిందని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించి ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సభాధ్యక్షులను కోరారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# సూర్యకేంద్రక సిద్ధాంత కర్త కోపర్నికస్ జయంతి

**తాళ్లపూడి మండలం విశాఖ సమాచారం :ప్రతినిధి (శివ కృష్ణ) : పైడిమెట్ట :** మండల పరిషత్ బేసిక్ ప్రాథమిక పాఠశాల పైడిమెట్ట నందు ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త కోపర్నికస్ జయంతి గురువారం నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన చిత్రపటం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు కోపర్నికస్ గురించి వివరించారు. ఈ విశ్వమంతటికి సూర్యుడు కేంద్రమని, భూమి ఇతర గ్రహాలు సూర్యుడు చుట్టూ తిరుగుతాయనే సూర్యకేంద్రక సిద్ధాతంను ప్రతిపాదించిన శాస్త్రవేత్త కోపర్నికస్. ఈయన పూర్తి పేరు నికోలస్ కోపర్నికస్. ఈయన 1473 ఫిబ్రవరి 19న పోలాండ్ దేశంలోని థార్న్ పట్టణంలో జన్మించాడు. న్యాయశాస్త్రం, గణిత శాస్త్రం, ఖగోళ శాస్త్రం చదివాడు. గ్రీకు భాష నేర్చుకొని ఎన్నో గ్రంథాలను కంఠస్తం చేసాడు. వైద్య శాస్త్రం అభ్యసించడం కోసం విశ్వవిద్యాలయంలో చేరాడు. కానీ ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త ఆల్బర్ట్ బ్రుడ్జెవిస్కి శిష్యరికంలో చేరి ఖగోళ శాస్త్రంపై ఇష్టం పెంచుకున్నాడు. టాలెమీ ప్రతిపాదించిన భూకేంద్రక సిద్ధాతం తప్పు అని సూర్యకేంద్రక సిద్ధాతంను ప్రతిపాదించాడు. కోపర్నికస్ కంటే ముందే ఎన్నో వందల ఏండ్ల మునుపే భారతీయ, గ్రీకు, ముస్లిం శాస్త్రవేత్తలు



సూర్యకేంద్రక సిద్ధాంతం ప్రతిపాదించినప్పటికీ భూమి, గ్రహాలు సూర్యుని చుట్టూ తిరిగుతున్నాయని మొదటి సారిగా సైద్ధాంతికంగా నిరూపించింది ఈయనే. ఈ సిద్ధాంతం ప్రకారం .....సూర్యుడు స్థిరంగా ఉండగా భూమి, ఇతర గ్రహాలు సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తాయి. భూమి కేవలం చంద్ర భ్రమణానికి మాత్రమే కేంద్రంగా ఉంటుంది. ఈయన ఖగోళ విషయాలపై ఎన్నో గ్రంథములు రాసాడు. అవి టైకోబ్రాహి, కెప్లర్, న్యూటన్, గెలీలియో వంటి ఎంతో మంది శాస్త్రవేత్తలకు మార్గదర్శకం అయ్యాయి. కోపర్నికస్ మానవాళికి ఖగోళ శాస్త్రంపై అందించిన జ్ఞానం వర్ణించలేనిది. కోపర్నికస్ గొప్ప శాస్త్రవేత్త. ఆయన జన్మదినం రోజున ఆయనను స్మరించుకోవడం చాలా అవసరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సహోపాధ్యాయుడు ధర్మాన రాము, విద్యార్థులు ఉన్నారు.

# సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సప్తశక్తి సంగమ్ ముగింపు కార్యక్రమం



**విశాఖపట్నం, విశాఖసమాచారం :** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల శుభ సందర్భంగా విద్యా భారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సప్తశక్తి సంగమ్ ముగింపు కార్యక్రమం విశాఖపట్నం కళాభారతి ఆడిటోరియంలో ఈ రోజు ముగింపు సమావేశం జరిగింది సమావేశానికి అధ్యక్షత వహించిన విద్యా భారతి అఖిల భారతీయ సప్తశక్తి సంగమ్ టోలి సభ్యురాలు మరియు సప్తశక్తి సంగమ్ దక్షిణ క్షేత్ర మరియు దక్షిణ మధ్య క్షేత్ర సంయోజికి డాక్టర్ భండారు ధరణి ప్రియ సంయోజక ప్రస్తావన గావిస్తూ దేశం మొత్తంలో 25 వేల మాతృ సమ్మేళనాల్లో 30 లక్షల మంది మాతృమూర్తులు పాల్గొన్నారు 280 కార్యక్రమాలు 28,000 వేల మాతృమూర్తులు పాల్గొన్నారు అని వారికి కుటుంబ ప్రబోదన్ పర్యావరణ సంరక్షణ అనే విధంగా సమాజ వికాసంలో మహిళా చేయవలసిన యోగ దానం గురించి వక్తలు సందేశాలు ఇచ్చారు మహిళ తనలోని సప్తశక్తులను జాగృత పరుచుకొని దేశానికి ఎలా సేవ చేయాలో వివరించారు గౌరవ అతిథిగా పాల్గొన్న శ్రీమతి క్రాతిట వెంకట భాను మాట్లాడుతూ మహిళా తన కుటుంబాన్ని ఎలా సంరక్షించు కోవాలో తెలిపారు ప్రధాన వక్తగా డాక్టర్ టీ రాధాబాయి రిటైర్డ్ ప్రిన్సిపల్ టీజేపిఎన్ కళాశాల గుంటూరు ప్రసంగిస్తూ వ్యష్టి, సమిష్టి, సృష్టి, పరమేష్టి తత్వం ఏమిటు ? భారతీయ సంస్కృతిలో వ్యక్తి ఏ విధంగా తనను తాను నిర్మాణం చేసికొని తనతో పాటుగా సమాజం, దేశం, విశ్వం, సృష్టిని సమన్వయించు కుంటూ పరమిష్టి ఎలా చేరుకోవాలి మహిళలు సాధించి చూపారని వివరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీమతి భాగ్యలక్ష్మి గారు భారత దేశ ఉన్నతిలో మహిళలు సాధించిన విజయాలు, వారి నుండి మనం గ్రహించవలసిన విషయలను తెలిపారు. ప్రాంత సంయోజితాలు శ్రీమతి అంజలి పుసాద్, శ్రీమతి ఉమా దీవి కార్యక్రమన్ని యొజనా బద్దంగా నిర్వహించారు. సుమారు 850 మంది మషిళలు పాలాని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# హృద్రోగులకు వరం.. స్టెమీ కేంద్రం



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** కొన్నేళ్ల క్రితం ఓ ప్రభుత్వ ఉద్యోగికి గుండెల్లో నొప్పి, ఆయాసం వచ్చాయి. జిల్లా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి గుండెపోటుగా గుర్తించి.. విశాఖ రిఫర్ చేశారు. మార్గమధ్యలో మృతిచెందారు. ఇది నిన్నటి మాట. పార్వతీపురం మండలం వెంకంపేటకు చెందిన వృద్ధుడికి ఇటీవల గుండెలో నొప్పి వచ్చింది. ప్రైవేటు ఆసుపత్రిలో చూపించారు. వారి సూచన మేరకు జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు గుండెపోటుగా గుర్తించి.. తక్షణం టెనెక్టేప్లేస్ ఇంజెక్షన్ ఇచ్చారు. తర్వాత కుటుంబీకులు విశాఖ తీసుకెళ్లి చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పింది.. ఇది నేటి పరిస్థితి. పార్వతీపురం పట్టణం, పాలకొండ: ఛాతిలో నొప్పి అనిపించినప్పుడు తక్షణ వైద్యసాయం అందక ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ పరిస్థితి ఎదురవ్వకూడదన్న ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఆసుపత్రుల్లో తక్షణ ప్రాథమిక చికిత్స అందించాలనే లక్ష్యంతో స్టెమీ (ఎస్‌టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫార్క్షన్) పేరిట వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో అత్యవసర వైద్యం అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలో మూడేళ్లలో 90 మంది వరకు ఈ ఇంజెక్షన్ ద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. అవగాహన లేక సకాలంలో ఆసుపత్రికి రాక ప్రాణాలు కోల్పోతున్నవారు లేకపోలేదు.

**తొలి గంట కీలకం**

'గుండెనొప్పికి గురైన వారికి తొలి గంట(గోల్డెన్ అవర్) ఎంతో కీలకం. ఛాతిలో నొప్పి, ఎడమవైపు భుజం లాగడం, గుండె దడ, ఆకస్మిక ఆయాసం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణం ఆసుపత్రికి వెళ్లాలి. గుండెనొప్పిగా నిర్ధారణ అయితే ప్రభుత్వం సరఫరా చేసిన రూ.45 వేలు ఖరీదైన టెనెక్టేప్లేస్ ఇంజెక్షన్ ఉచితంగా వేస్తారు. ఇది రక్తం గడ్డకట్టకుండా చేస్తుంది. రోగిని విశాఖ తరలించి మెరుగైన వైద్యం అందించడానికి తగిన సమయం లభిస్తుంది.'

అని పార్వతీపురం జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకురాలు నాగశివజ్యోతి చెప్పారు. జిల్లాలో సాలూరు, పాలకొండ, సీతంపేట ప్రాంతీయాసుపత్రులు, భద్రగిరి, కురుపాం, చినమేరంగి సామాజిక ఆసుపత్రులతోపాటు జిల్లా ఆసుపత్రిలో స్టెమీ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. మూడేళ్లలో మొత్తం 102 మందికి ఇంజెక్షన్ ఇవ్వగా ఇందులో 90 మంది ప్రాణాలు నిలిచాయి.

**సద్వినియోగం చేసుకోవాలి**

జిల్లాలో ప్రాంతీయాసుపత్రులు, సీహెచ్‌సీలు, జిల్లా ఆసుపత్రిలో స్టెమి కేంద్రాలున్నాయి. హృద్రోగ సమస్యలు ఉన్నట్లు గుర్తిస్తే ఇంజెక్షన్ ఇస్తున్నాం. తదుపరి వైద్యం అందించేందుకు అవకాశం ఉంటుంది. సకాలంలో వచ్చిన వారి ప్రాణాలకు భరోసా ఉంటుంది. సద్వినియోగం చేసుకోవాలి.

# మీతోనే శక్తి.. మీలోనే శక్తి



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** అత్తింటివారు వేధింపులకు గురి చేస్తున్నారని, దాడికి పాల్పడుతున్నారని విజయనగరానికి చెందిన ఓ మహిళ శక్తి యాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. తక్షణమే పోలీసులు చేరుకుని, కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గుర్తుతెలియని వ్యక్తి తరచూ ఫోన్ చేస్తున్నాడని, అసభ్యకర సందేశాలు పంపిస్తున్నాడని నగరానికి చెందిన యువతి వివరాలు నమోదు చేశారు. సైబర్ క్రైం, పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది అప్రమత్తమై క్షణాల వ్యవధిలోనే సదరు నంబరును బ్లాక్ చేశారు. నిందితుడిని గుర్తించి, కేసు నమోదు చేశారు.

విజయనగరం అయ్యన్నపేట: ఆపదలో ఉండే మహిళలకు అండగా నిలుస్తోంది శక్తి యాప్. 2025 మార్చిలో ఈ సేవలు ప్రారంభం కాగా.. ఉమ్మడి జిల్లాలో వేల మంది వినియోగిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు నవీకరిస్తుండడంతో నిమిషాల వ్యవధిలోనే బాధితులకు న్యాయం జరుగుతోంది. కేవలం అతివలే కాకుండా చిన్నారులు, పురుషులు సైతం సద్వినియోగం చేసుకోవచ్చు.

**కదిపితే చాలు..**

యాప్ తెరుచుకోగానే నాలుగు విభాగాలు కనిపిస్తాయి. ఎస్‌వోఎస్‌ను తాకగానే.. పది సెకండ్ల ఆడియో, వీడియో రికార్డు అయ్యి కంట్రోల్ రూమ్‌కు వెళ్తాయి. అంతే కాకుండా హ్యాండ్ షేక్ ఆప్షన్ ఆన్ చేసుకుంటే.. ఆపద సమయంలో చరవాణిని షేక్ చేస్తే ఆడియో, వీడియో వెళ్తాయి. లొకేషన్ ఆధారంగా క్షణాల్లోనే కనుగొంటారు.

**డౌన్‌లోడ్ ఇలా..**

గూగుల్ ప్లేస్టోర్‌కు వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పేరు, చరవాణి నంబరు, కుటుంబ సభ్యుల ఫోన్ నంబరు, జెండర్, వయసు, చిరునామా తదితర వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. మనకు కావాల్సిన భాషను ఎంచుకోవచ్చు. లొకేషన్‌తో పాటు వివిధ రకాల ఆప్షన్లు అందుబాటులో ఉంటాయి.

**సేవలిలా..**

వ్యక్తిగతంగా, సమాజం, కుటుంబ పరంగా ఎలాంటి ఇబ్బందులున్నా చెప్పొచ్చు.

అసాంఘిక కార్యకలాపాలు, జూదం, గంజాయి రవాణా తదితర వాటిని తెలియజేయొచ్చు.

అదృశ్యం, దాడులు, వేధింపులు, గృహహింస, ఆర్థిక మోసం, ప్రేమ వ్యవహారాలపై వివరాలు నమోదు చేయొచ్చు. ఒంటరిగా ఉంటే భోజనం, వసతి, ఇతరత్రా సేవలను ఆశ్రయించవచ్చు.

దూర ప్రాంతాలకు వెళ్లేసమయంలో సేఫ్‌ట్రావెల్ ఆప్షన్ ఆన్ చేసుకుంటే గమ్యస్థానం చేరేవరకు నిరంతరం పర్యవేక్షిస్తామని ఎస్పీ దామోదర్ తెలిపారు. కళాశాలలు, కూడళ్లు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లలో అవగాహన కల్పిస్తున్నామని, ప్రత్యేకంగా శక్తి బృందాలను నియమించామని వెల్లడించారు

# అంగవైకల్యంతో బాధపడుతున్న వారికి బాసటగా దేవోక్తి



**విశాఖ సమాచారం :ప్రతినిధి (శివకృష్ణ )**

దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన వైజాగ్, తూర్పుగోదావరి జిల్లా, గుంటూరు,గద్వాల్ మరియు ప్రాంతాలకు చెందిన 9 మంది కి ఉచితముగ ఆర్టిఫిషియల్ లింబ్స్ గన్నవరం లోనీ హీల్ సంస్థ సహకారం తో ఇప్పించడం జరిగింది. ప్రయాణ ఖర్చుల నిమిత్తం డాక్టర్ మూర్తి గారు మంగన్న సర్జికల్ అండ్ మెటర్నరీ నర్సింగ్ హోమ్ తాళ్లపూడి. యాజమాన్య వారు 7 వేల రూపాయలు, బాబు అన్న, ప్రవీణ్ అన్న 3 వేలు సహాయం అందించారు. ఈ కార్యక్రమం దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ టీం సభ్యులు ప్రత్తిపాటి నాగరాజు, వేమూలూరి రాజకుమార్, వరకుమార్ సార్,ూా. ూా. ూా జోడాల వెంకటేశ్వరావు గారు పాల్గొన్నారు. కృత్రిమ అవయవాలు కావలసిన దివ్యాంగులు తమ సంస్థ ను 9391089381 సంప్రదించినట్లయితే వారికి ఉచితముగ అందిస్తామని తెలియజేశారు

# చేనేత కార్మికులకు అందని బకాయిలు



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** మగ్గాలపై నేసిన వస్త్రాన్ని మార్కెట్‌లో విక్రయించేందుకు చేనేత కార్మికులు ప్రభుత్వ రంగ సంస్థ ఆప్కోను ఆశ్రయిస్తారు. ఇతర ప్రాంతాల్లో అక్కడి ప్రజల అభిరుచికి తగినట్లుగా ఉత్పత్తులను విక్రయించేందుకు వీలుగా నిల్వలను కార్మికులు అందజేస్తారు. సంస్థ నుంచి సకాలంలో బకాయిలు విడుదల కాకపోవడంతో నేతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. జిల్లాలో చేనేత రంగం సంక్షోభంలో కూరుకుపోతోంది.

జిల్లాలోని 16 చేనేత సంఘాల నుంచి ఆప్కో సంస్థకు వస్త్రాలు ఇస్తున్నారు. చేనేత చీరలు, పంచె, ధోవతి, చొక్కాలు, లుంగీ, తువ్వాళ్లు, చేతి రుమాళ్లు వంటివి ఉత్పత్తి చేస్తున్నారు. ప్రాంతాల వారీగా గిరాకీని దృష్టిలో ఉంచుకుని ఆప్కో సంస్థ వాటిని కొనుగోలు చేసి.. విక్రయిస్తుంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాల్లో పిల్లలకు అవసరమైన దుప్పట్లు, పాఠశాలల్లో ఏకరూప దుస్తులకు అవసరమైన వస్త్రాలను ప్రభుత్వమే ఏటా ఆప్కో నుంచి కొనుగోలు చేస్తుంది. ఆ మొత్తాలను ప్రభుత్వం ఆప్కో సంస్థకు చెల్లించడంలో జాప్యం చేస్తోంది.

**తప్పని నిరీక్షణ..**

2018లో తెదేపా ప్రభుత్వం ఆప్కోకు బకాయిలు చెల్లించింది. ఆ తర్వాత వైకాపా అధికారంలోకి వచ్చాక చెల్లింపులు నిలిపివేసింది. ఇప్పటి వరకు ఆప్కో నుంచి జిల్లాలోని చేనేత సంఘాలకు రూ.3.15 కోట్లు రావాల్సి ఉండగా.. కూటమి ప్రభుత్వం రూ.69 లక్షలు విడుదల చేసింది. మిగిలిన రూ.2.56 కోట్ల కోసం నేత కార్మికులు నిరీక్షిస్తున్నారు. డబ్బులు రాకపోవడంతో చేనేత సంఘాలు నిద్రావస్థకు చేరుతున్నాయి. యార్న్‌కు చెల్లించాల్సిన మొత్తాలను ఇవ్వలేక.. కొత్తగా అప్పులు చేసి యార్న్ కొనుగోలు చేయలేక వస్త్రాల తయారీని నిలిపేస్తున్నారు.

**ప్రభుత్వానికి నివేదించాం..**

గత ఏడేళ్లుగా ఆప్కో నుంచి చేనేత సంఘాలకు బకాయిలు విడుదల కాలేదు. ఇటీవల రూ.69 లక్షలు ఇచ్చింది. సమస్యను ప్రభుత్వానికి నివేదించాం. మిగిలిన డబ్బులు సైతం అందించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీముఖలింగేశ్వరుని చక్రతీర్థ స్నానం



ఆలయం వద్ద ఉత్సవమూర్తులతో అర్చకులు, అధికారులు

**విశాఖసమాచారం:** శ్రీముఖలింగేశ్వరస్వామి లింగాభరణంవంశధార.. జనధార అయ్యింది.. ఆ ముక్కంటి స్మరణతో భక్తి ప్రవాహమై పారింది.. స్వామి సేవలో భక్తలోకం తడిసి ముద్దయింది.. ఇసుక తిన్నెలపై శివనామం మారుమోగింది.. దక్షిణ కాశీగా పేరొందిన శ్రీముఖలింగంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. చివరిరోజు బుధవారం స్వామి చక్రతీర్థ స్నాన ఘట్టం వైభవోపేతంగా సాగింది. లక్షలాది జనులు వెంట రాగా ఆ పార్వతీ పరమేశ్వరులు నంది వాహనంపై వంశధార నదికి చేరుకున్నారు. ఉత్తర ముఖంగా పయనించిన ఉత్సవమూర్తులకు మిరియాపల్లి గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. అక్కడ ఏర్పాటు చేసిన పచ్చని కొబ్బరి ఆకుల పందిరిలో సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శాస్త్రోక్తంగా క్రతువు నిర్వహించారు.

ఆలయం వద్ద ఉత్సవమూర్తులతో అర్చకులు, అధికారులుదారులన్నీ అటువైపే..

చక్రతీర్థస్నాన ఘట్టం తిలకించేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దారులన్నీ శ్రీముఖలింగం వైపే సాగాయి. ఉదయం 11.40 గంటల సమయంలో పార్వతీపరమేశ్వరుల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, వేదమంత్రాలతో ప్రధాన ఆలయం నుంచి అర్చకులు బయటకు తీసుకొచ్చారు. ఆర్డీవో కె.సాయిప్రత్యూష, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్, డీఎస్పీ లక్ష్మణరావు కొబ్బరికాయలు కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



భక్తులతో కిటకిటలాడుతున్న నదీ తీరం

# ఇసుక అక్రమ తవ్వకాలతో రూపు కోల్పోయిన నది



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** వైకాపా పాలనలో బాహుదా నదిని నిర్లక్ష్యం చేయడంతో రైతులు వ్యవసాయానికి, ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. 11 ఓపెన్ హెడ్ ఛానళ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించినా అమలుకు నోచుకోలేదు. మరోవైపు నదిలో ఎక్కడ చూసినా ఇసుకకు బదులు ఎర్ర, బురద మట్టి, పనికి రాని మొక్కలు కనిపిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో పొక్లెయిన్లతో ఇసుకను అక్రమంగా తవ్వేస్తుండటంతో వేసవిలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండే అవకాశం ఉంది.

**పిల్ల కాలువను తలపిస్తోంది..**

జగనన్న కాలనీలు, నాడు-నేడు పనుల పేరిట నదిలో ఇసుక తవ్వకాలు ప్రారంభమయ్యాక.. అనుమతులతో సంబంధం లేకుండా ఇతర ప్రాంతాలకు జోరుగా తరలిస్తున్నారు. తవ్వకాలు యథేచ్ఛగా సాగుతుండటంతో మరింత చిక్కిపోతోంది. నదిలో అక్రమంగా తవ్వేసిన ఇసుకను కొందరు సరిహద్దులోని ఒడిశా గ్రామాలు, తోటల్లో నిల్వ చేస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గతేడాది అక్టోబరులో భారీ వర్షాలకు నిండుగా ప్రవహించింది. అదే ప్రాంతం ఇప్పుడు రాళ్లు, రప్పలతో నిండిపోయి పిల్ల కాలువను తలపిస్తోంది. ఫిబ్రవరిలోనే ఈ పరిస్థితి ఉంటే ఏప్రిల్, మేలో మరింత తీవ్రంగా ఉంటుందని పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాం..**

బాహుదా నది పరిరక్షణకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. ఇప్పటికే ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాం. ఒడిశాతోనూ చర్చలు జరిగాయి. ఇసుక తవ్వకాలను అడ్డుకునేలా అధికారులకు సూచనలు చేస్తున్నాం. ఇచ్ఛాపురం పురపాలక సంఘ పరిధిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా గతేడాది వంశధార జలాలను అనుసంధానం చేశాం. గ్రామాల్లోనూ సమస్య ఉత్పన్నం కాకుండా అధికారులను అప్రమత్తం చేస్తాం

# మహారాజ్ శ్రీ చత్రపతి శివాజీ 396వ జయంతి ఘనంగావేడుకలు



**తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి మండలం**

**తాళ్లపూడి విశాఖ సమాచారం :ప్రతినిధి (శివ కృష్ణ )**

విశ్వహిందూ పరిషత్ కార్యకర్త చిరువూరి శ్రీను ఆధ్వర్యంలో ఆయన మాట్లాడుతూబస్టాండ్ సెంటర్లో చత్రపతి శివాజీ ఫోటోకి పూలదండ ఆవిష్కరించి పుడితే హిందువుగా పుట్టాలని మన చత్రపతి శివాజీ369 వ జయంతి సందర్భంగా అలుపెరగని పోరాట యోధుడు, ఆయన హిందువుల కోసం 40 రోజులు ఏకదాటినపోరాటం చేసిన జీవిత కథ ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని ఈ సందర్భంగా హిందూ బంధువులు అందరూ మన భారత జాతి ముద్దుబిడ్డ మహారాజ్ శ్రీ చత్రపతి శివాజీకి పాలాభిషేకం చేసి ఘనమైనా నివాళిఅ ర్పించారు. ఈ కార్యక్రమంలో ఇందుగల రామకృష్ణ ,గోకవరపు జితేంద్ర రవి, కడలి కిరణ్ కుమార్ ,ఎలుగుబంటి బాలకృష్ణ ,రవితేజ ,బొర్రా శ్రీ రామమూర్తి ,నాగులకొండ భద్రం , గోకవరపు మాణిక్య, మారం కృష్ణ ప్రసాద్ ,గురుగుబెల్లి మనివర్మ ,శబరీష్ , అప్పన జగదీష్ , కంకిపాటి వినయ్ ,అనిల్ మాలి,వాడరేవు మాణిక్యాల రావు పల్లాల నారాయణరెడ్డి పాల్గొని విజయవంతం చేశారు.

# రేణుక ఎల్లమ్మ అమ్మవారి దేవాలయంలో అన్నదాన కార్యక్రమం



శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి దేవాలయంలో దమ్మర్ సింగ్ శ్రీమతి రేవతి దంపతులచే అన్నదాన కార్యక్రమం. ప్రతి లక్ష్మివారం జరిగే అన్నదాన కార్యక్రమలో భాగంగా ఈరోజు అనగా 19-2-2026. న అన్నదాన కార్యక్రమం జరిగినది యొక్క కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షులు చినబాబు అధ్యక్షులు కర్రి నీలకంఠం జనరల్ సెక్రెటరీ పోలరావు టిడిపి ఆర్గనైజింగ్ సెక్రెటరీ గనగలసత్య 28 వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుర్రం కనకారావు ఆలయ సిబ్బంది బడే నాగరాజు కోరువాడ లక్ష్మి పాకలపాటి అప్పారావు తదితరులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు

# శ్రీ సంపత్ సాయి దేవాలయం నందు అన్నదాన కార్యక్రమం



**విశాఖసమాచారం::** శ్రీ సంపత్ సాయి దేవాలయం నందు అన్నదాన కార్యక్రమం పాల్గొన్న జాఫ్ యూనియన్ అధ్యక్షుడు కీర్తన్ 28వార్డ గంజిపేట నందు ప్రతి లక్ష్మివారం అన్నదాన కార్యక్రమం జరుగును ఈ యొక్క కార్యక్రమంలో 28 వార్డు ప్రజలు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు




## లవ్ స్టోరీ రివీల్ చేసిన శివాని.. ఆ అబ్బాయి ఎవరో




కాత్యాయిని.. లిటిల్ హార్ట్స్ సినిమాతో ఓవర్ నైట్ లోనే స్టార్ స్టేటస్ ను సొంతం చేసుకుంది ఈ ముద్దుగుమ్మ. ఈమె అసలు పేరు శివాని నాగారం..కానీ లిటిల్ హార్ట్స్ సినిమాలో కాత్యాయిని పాత్రతో ఊహించని ఇమేజ్ దక్కించుకుంది. అలాంటి ఈమె తాజాగా నటిస్తున్న చిత్రం హే భగవాన్. సుహాస్ , శివానీ నాగారం జంటగా సీనియర్ నటుడు వీ.కే.నరేష్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న కామెడీ ఎంటర్టైనర్ హే భగవాన్. గోపి అచ్చర దర్శకత్వంలో బి.నరేంద్ర రెడ్డి నిర్మాణంలో వస్తున్న ఈ చిత్రం ఈనెల 20వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. బన్నీ వాసు, వంశీ నందిపాటి కలసి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు.

ఇటీవల ఈ సినిమా సెన్సార్ కి వెళ్లగా..కొన్ని కారణాలవల్ల ఈ సినిమా టైటిల్ లో మార్పు చేస్తూ.. 'హే భగవాన్' కాస్త 'హే బల్వంత్' గా చివరిలో మార్చేశారు. ఇకపోతే విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో తాజాగా చిత్ర బృందం ఒక స్పెషల్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. సత్యం రాజేష్ యాంకర్ గా వ్యవహరిస్తున్న ఈ ఇంటర్వ్యూలో ఎన్నో విషయాలను చర్చించారు. ముఖ్యంగా ఇండస్ట్రీకి కొత్తగా వచ్చిన శివాని నాగారం వ్యక్తిగత విషయాలను కూడా ఆయన బయటకు తీసే ప్రయత్నం చేశారు.. అందులో భాగంగానే సత్యం రాజేష్ మాట్లాడుతూ.. "లిటిల్ హార్ట్స్ సినిమాలో మీకంటే చిన్న అబ్బాయిని ప్రేమించినట్టు.. రియల్ లైఫ్ లో కూడా ఎవరైనా మీకు అలా ప్రపోజ్ చేశారా?" అని ప్రశ్నించారు.

శివాని నాగారం మాట్లాడుతూ.. "ట్యూషన్ లో ఒక అబ్బాయి నాకు ప్రపోజ్ చేశాడు అని చెబుతుండగానే.. నేను ఇదివరకే సుహాస్ తో మాట్లాడాను..ఆ అమ్మాయికి బాయ్ ఫ్రెండ్ ఉంటారు అని.. కానీ నువ్వేమో లేదన్నయ్యా.. మంచి అమ్మాయి అని చెప్పావు.. మరి ఇదేంటి అని ఆమెను ఆట పట్టించే ప్రయత్నం చేశారు సత్యం రాజేష్. మళ్లీ ఆమె మాట్లాడుతూ.." నిజంగా బాయ్ ఫ్రెండ్ లేదు. నా తమ్ముడి వయసున్న అబ్బాయి నా దగ్గరకు వచ్చి చాక్లెట్ ఇచ్చి అక్క ఐ లవ్ యు అని చెప్పాడు. అంతకుమించి ఇంకేం లేదు" అంటూ చెప్పుకొచ్చింది శివాని నాగారం. మొత్తానికైతే శివాని నాగారం కంగారు పడ్డ దృశ్యాలు అందరికీ నవ్వు తెప్పిస్తున్నాయి. సత్యం రాజేష్ ఏదో బయటకు లాగాలనే ప్రయత్నం చేసి.. ఆమెను కంగారు పెట్టేశారు అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇకపోతే ఇదే ఇంటర్వ్యూలో కాలేజీలో కానీ ఇండస్ట్రీలో కానీ మీకు ఎవరంటే క్రష్ అని ప్రశ్నించగా.. ఆమె మాట్లాడుతూ "అప్పట్లో మహేష్ బాబు, అల్లు అర్జున్ అంటే చాలా ఇష్టం ఉండేది " అంటూ చెప్పుకొచ్చింది. మరి ఇప్పుడు మీ అభిప్రాయం మారిపోయిందా అని మళ్లీ ప్రశ్నించగా.." వారికి పెళ్లయిపోయింది కదా" అంటూ సిగ్గుతో తలవంచుకుంది. శివాని మొత్తానికైతే అప్పట్లో మహేష్ బాబు అల్లు అర్జున్ తన క్రష్ అంటూ చెప్పకనే చెప్పేసింది ఈ ముద్దుగుమ్మ. కానీ ప్రస్తుతం ఎవరూ లేరు అని కూడా తెలిపింది.

## అల్లు అరవింద్ తమిళుల కోసం ఫైట్ చేశారా?



అల్లు అరవింద్..టాలీవుడ్‌లో వున్న అత్యంత స్టార్ ప్రొడ్యూసర్‌లలో ఆయన ఒకరు. ఇండస్ట్రీలో అత్యంత కీలకమైన వ్యక్తిగా, మెగాస్టార్ చిరంజీవి బావమరిదిగా, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఫాదర్‌గా ఆయనకున్న ప్రత్యేకత గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సినిమాల నిర్మాణంలో ఈ మధ్య పెద్దగా ఇన్‌వాల్వ్ కావడం లేదు. ఆ బాధ్యతల్ని యంగ్ ప్రొడ్యూసర్ బన్నీ వాసుకు అప్పగించి కేవలం ప్రజెంటర్‌గా మాత్రమే వ్యవహరిస్తూ వస్తున్నారు. అయినా సరే సినిమా ఈవెంట్‌లలో చురుగ్గా పాల్గొంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తున్నారు. హిందీ వ్యతిరేకోద్యమం ఈ మధ్య విడుదలై -పరాశక్తి- సినిమాతో మళ్లీ నెట్టింట ట్రెండ్‌గా మారిన విషయం తెలిసిందే. బలవంతంగా సౌత్ స్టేట్‌లపై, అందులో ముఖ్యంగా తమిళనాడుపై కేంద్రం రుద్దుతోందని 1960లో తమిళనాట హిందీ వ్యతిరేకంగా భారీ ఉద్యమమే నడిచింది. ఇందులో ఎంతో మంది విద్యార్థినాయకులు పాల్గొన్నారు. ఎంతో మంది ప్రాణాలు కూడా కోల్పోయారు. తాజాగా ఈ ఉద్యమంపై స్టార్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ స్పందించారు. -విద్యార్థి నాయకుడిగా హిందీ వ్యతిరేకోద్యమంలో తాను ఎదుర్కొన్న అనుభవాల్ని ఆయన పంచుకున్నారు. ఓ యూట్యూబ్ ఛాన్ పోడ్ కాస్ట్‌లో మాట్లాడుతూ తమిళనాట 1060లో జరిగిన హిందీ వ్యతిరేక ఉద్యమంపై ఆనాటి జ్ఞాపకాల్ని పంచుకున్నారు. హిందీకి వ్యతిరేకంగా జరిగిన నిరసనలలో తమిళుల కోసం తాను ఎలా పోరాటం చేసింది చెప్పుకొచ్చారు. -పరాశక్తి- మూవీ స్టోరీ కోసం 60వ దశకంలో జరిగిన పోరాటంలో పాల్గొన్న విద్యార్థి నాయకులని కలిసి కీలక వివరాల్ని సేకరించే క్రమంలో దర్శకురాలు సుధా కొంగర ప్రొడ్యూసర్ అల్లు అరవింద్‌ని కలిశారట. అది జరిగి 50 ఏళ్లకు పైనే అవుతోందని, అది తెలుసుకుని ఇప్పుడు ఏం చేస్తావని తనని అడిగానన్నారు.

అంతే కాకుండా తాను ఆ ఉద్యమంలో పాల్గొన్నానని తాను ఎలా తెలుసుకుందని ఆశ్చర్యపోయానన్నారు. తాను చెన్నైలో విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పుడు హిందీ వ్యతిరేకోద్యమం జరిగింది. ఆ సమయంలో సహ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని రేకెత్తించేందుకు తాను సాహశక్తులా కృషి చేశానని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. అంతే కాకుండా ఆ సమయంలో జరిగిన ఓ సంఘటనని ఈ సందర్భంగా వివరించారు. ఓ ప్రభుత్వ బస్సుకు సంబంధించిన సంఘటన ఒకటి జరిగింది. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తోటి విద్యార్థుల్ని రక్షించే క్రమంలో బస్సు డ్రైవర్‌ని తప్పించి తానే స్వయంగా బస్సు నడిపారట.

అంతే కాకుండా రైలుకు ముందు వంద మంది విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేసిన సందర్భాన్ని కూడా వివరించారు. గ్రాండ్ ట్రక్ ఎక్స్‌ప్రెస్ రైలును వంద మంది విద్యార్థులం నిలిపివేసి పెద్ద నిరసన వ్యక్తం చేశాం. ఆ సమయంలో నాతో సహా అందరిని పోలీసుల అరెస్ట్ చేసి గోపాలపురంలోని కరుణానిధి నివాసానికి తీసుకువచ్చారు. అప్పుడు కరుణానిధి మాట్లాడుతూ మా నిరసనలకు పూర్తి మద్దతు ఇస్తానని ప్రకటిస్తూనే మరోసారి రైలు రోకోలు చేయొద్దని అభ్యర్తించారని, నిరసనలని ఆపేసి బుద్ధిగా కాలేజీలకు వెళ్లి చదువుకోవాలని సూచించారని, ఆ టైమ్‌లో నేను స్టూడెంట్ లీడర్‌గా ఉన్నానని తెలిపారు- అల్లు అరవింద్. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## మైఖేల్ జాక్సన్ బయోపిక్‌ని కొట్టేలా..!



దివంగత పాప్ లెజెండ్ మైఖేల్ జాక్సన్ (ఎంజే) ఒక సంచలనం. ప్రపంచవ్యాప్తంగా అతడి నృత్యవిన్యాసాలకు ఉన్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. అతడు వేదికపై ఆడి పాడుతుంటే, ఆ షోలో ప్రజల ఎమోషన్స్, కన్నీళ్లను లైవ్ లో వీక్షించేవాళ్లకు ఆశ్చర్యం కలిగిస్తుంది. అలాంటి ఎమోషన్ వేరొక నటుడు లేదా డ్యాన్సర్ విషయంలో ఎప్పుడూ చూసి ఉండరు. కోట్లాదిగా ఫ్యాన్స్ పూనకాలతో ఊగిపోతారు.

అయితే జాక్సన్ చనిపోయినా, అతడి పాటలకు ఇప్పటికీ యూట్యూబ్ ఆదాయంతో పాటు, రాయల్టీ వంటివి ఆ కుటుంబ సభ్యులు, ట్రస్ట్ కి చేరుతున్నాయంటే అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు మైఖేల్ జాక్సన్ జీవితంపై అద్భుతమైన బయోపిక్ తెరకెక్కుతోంది. హాలీవుడ్ దర్శకుడు ఆంటోనీ ఫుక్వా తెరకెక్కిస్తున్న -మైఖేల్- చిత్రం ఏప్రిల్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇందులో ఎంజే పాత్రను అతడి సొంత సోదరుడి కుమారుడు -జాఫర్ జాక్సన్- పోషిస్తున్నారు. జాక్సన్ బయోపిక్ కి భారతదేశంలో వసూళ్ల సునామీ ఖాయమా? అంటే ఖచ్చితంగా అవుననే అభిమానుల్లో చర్చ సాగుతోంది. భారత్‌లో మైఖేల్ జాక్సన్‌కు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. 80, 90వ దశకాల్లో ఆయన డ్యాన్స్ స్టైల్ ఒక విప్లవం సృష్టించింది. హాలీవుడ్ మ్యూజికల్ బయోపిక్‌లకు ఇండియాలో మంచి మార్కెట్ ఉంది. ఈ సినిమా కేవలం ఎంజే అభిమానులనే కాకుండా, నేటి తరం డ్యాన్సర్లను కూడా థియేటర్లకు రప్పిస్తుంది. బాక్సాఫీస్ వద్ద ఇది వసూళ్ల రికార్డులు సృష్టించే అవకాశం పుష్కలంగా ఉందని అంచనా.

అయితే జాక్సన్ బయోపిక్ స్ఫూర్తితో భారతదేశంలో ఏవైనా కొరియోగ్రఫీ బేస్డ్ సినిమాలు రూపొందుతున్నాయా? హాలీవుడ్‌లో ఇప్పటివరకూ వచ్చిన డ్యాన్స్ బేస్డ్- బయోపిక్ సినిమాల వివరాల్లోకి వెళితే.. తెలిసిన సంగతులివి.. ప్రపంచవ్యాప్తంగా గొప్ప డ్యాన్సింగ్ స్టార్స్ బయోపిక్ చిత్రాలు: డ్యాన్స్ నేపథ్యంలో వచ్చిన కొన్ని ముఖ్యమైన అంతర్జాతీయ బయోపిక్స్ వివరాల్లోకి వెళితే.. ఆల్ దట్ జాజ్ (1979) అనే చిత్రం పాపులర్ కొరియోగ్రాఫర్ బాబ్ ఫోస్సే జీవితం ఆధారంగా తీసిన సెమీ ఆటోబయోగ్రఫీ. క్యూబన్ బ్యాలెట్ డ్యాన్సర్ కార్లోస్ అకోస్టా జీవిత కథ ఆధారంగా -యూలి- అనే చిత్రం 2018లో తెరకెక్కింది. రాక్ అండ్ రోల్ స్టార్ రిచీ వాలెన్స్ కథతో -లా బాంబా- అనే చిత్రం 1987లో విడుదలైంది. వైట్నీ హౌస్టన్: ఐ వన్నా డ్యాన్స్ విత్ సమ్ బడీ చిత్రం 2022లో విడుదలైంది. ఇది సింగర్ బయోపిక్ అయినా కానీ వేదికలపై పెర్ఫార్మెన్స్‌లు, డ్యాన్స్‌కు ప్రాధాన్యత ఉంటుంది. భారతదేశంలో ఇప్పటివరకు డ్యాన్స్ బేస్డ్ ప్యూర్ బయోపిక్స్ తక్కువగా వచ్చాయి. కానీ కొన్ని ముఖ్యమైన బయోపిక్ ల వివరాల్లోకి వెళితే.. లెజెండరీ కొరియోగ్రాఫర్ సరోజ్ ఖాన్ జీవితంపై బయోపిక్ నిర్మాణంలో ఉంది. దీని హక్కులు టి సిరీస్ ఛేజిక్కించుకుంది. ఆధునిక భారతీయ నృత్య పితామహుడిగా పిలుపు అందుకున్న లెజెండరీ కొరియోగ్రాఫర్ ఉదయ్ శంకర్ జీవితం ఆధారంగాను సినిమా విడుదలైంది. ఈయన జీవితంపై పూర్తిస్థాయి బయోపిక్ రాకపోయినా.. -కల్పన- (1948) సినిమా అతడి నృత్య ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుంది.

## యూఏఈపై ఘనవిజయం




టీ20 ప్రపంచకప్‌లో లీగ్ దశను దక్షిణాఫ్రికా అజేయంగా ముగించింది. సూపర్-8కు ముంగిట ఆ జట్టు అదిరే విజయాన్ని అందుకుంది. బుధవారం గ్రూప్-డి మ్యాచ్‌లో మార్‌క్రమ్ సేన 6 వికెట్ల తేడాతో యూఏఈని ఓడించింది. పేసర్లు కార్బిన్ బోష్ (3/12), నోకియా (2/28) విజృంభించడంతో మొదట యూఏఈ 20 ఓవర్లలో 122/6కే పరిమితమైంది. అలీషన్ షరాఫు (45; 38 బంతుల్లో 5x4, 1x6), కెప్టెన్ మహ్మద్ వసీమ్ (22; 12 బంతుల్లో 4x4) చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. ఛేదనలో డెవాల్డ్ బ్రెవిస్ (36; 25 బంతుల్లో 1x4, 3x6), రికెల్టన్ (30; 16 బంతుల్లో 3x4, 2x6), మార్‌క్రమ్ (28; 11 బంతుల్లో 5x4, 1x6) మెరుపులతో దక్షిణాఫ్రికా 13.2 ఓవర్లలోనే 4 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఇప్పటికే సూపర్-8 చేరిన సఫారీ జట్టు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలవగా.. యూఏఈ ఒకే విజయం (కెనడాపై)తో టోర్నీని ముగించింది. ఈ గ్రూప్‌లో న్యూజిలాండ్ (6) ఇప్పటికే సూపర్-8 చేరింది. నామమాత్రపు పోరు కావడం, భారత్‌తో ఆదివారం సూపర్-8 మ్యాచ్ ఉండడంతో లుంగి ఎంగిడి, మార్కో యాన్సెన్‌లకు బుధవారం దక్షిణాఫ్రికా విశ్రాంతి ఇచ్చింది. నోకియాను టోర్నీలో తొలిసారి ఆడించింది.

మెరిసిన బ్రెవిస్, రికెల్టన్: మొదట యూఏఈ పరుగుల కోసం కష్టపడిన పిచ్‌పై ఛేదనలో దక్షిణాఫ్రికా అదరగొట్టింది. ఓపెనర్లు మార్‌క్రమ్, డికాక్ (14) 2.5 ఓవర్లలో 32 పరుగులు జోడించి శుభారంభం అందించారు. ముఖ్యంగా ఉన్నంతసేపు మార్‌క్రమ్ చెలరేగాడు. హైదర్ అలీ వేసిన మూడో ఓవర్లో అతడు 3 ఫోర్లు, ఓ సిక్స్ బాదాడు. అదే ఓవర్లో చివరి బంతికి అతడు ఔటయ్యాడు. కొన్ని షాట్లు ఆడిన డికాక్ సైతం మరో ఓవర్ తర్వాత మార్‌క్రమ్‌ను అనుసరించాడు. ఈ స్థితిలో బ్రెవిస్, రికెల్టన్ స్కోరు తగ్గకుండా చూశారు. 8వ ఓవర్లో బ్రెవిస్ ఓ సిక్స్, ఫోర్ కొట్టగా... 10వ ఓవర్లో రికెల్టన్ రెండు సిక్స్‌లు బాదాడు. సఫారీ జట్టు విజయానికి చేరువైన స్థితిలో రికెల్టన్, బ్రెవిస్ స్వల్ప వ్యవధిలో వెనుదిరిగినా.. స్టబ్స్ (6 నాటౌట్), జేసన్ స్మిత్ (3 నాటౌట్) పని పూర్తి చేశారు. అంతకుముందు యూఏఈ బ్యాటర్లకు సఫారీ పేసర్లు బోష్, నోకియా కళ్లెం వేశారు. యూఏఈ ఇన్నింగ్స్‌ను కాస్త మెరుగ్గానే ఆరంభించింది. 4.2 ఓవర్లకు 38/0తో నిలిచింది. అయితే ఓవర్ తేడాతో ఓపెనర్లు మహ్మద్ వసీం, ఆర్యాంశ్ (13) వికెట్లను కోల్పోయిన యూఏఈ ఇబ్బందుల్లో పడింది. ఒకవైపు అలీషన్ షరాఫు నిలిచినా.. అతడికి మద్దతు ఇచ్చేవాళ్లు లేకపోయారు. బోష్, నోకియాతో పాటు లిండ్ కట్టుదిట్టంగా బంతులు వేయడంతో యూఏఈ బ్యాటర్లు బ్యాట్ ఝుళిపించలేకపోయారు.

## గ్రూప్ దశలో భారత్‌కు అగ్రస్థానం




టీమ్‌ఇండియా లాంఛనాన్ని పూర్తి చేసింది. టీ20 ప్రపంచకప్‌లో వరుసగా నాలుగో విజయం సాధించిన భారత్.. అగ్రస్థానంతో గ్రూప్ దశను ముగించింది. దూబె చెలరేగిన వేళ.. నెదర్లాండ్స్‌ను ఓడించింది. సౌకర్యంగానే గెలిచినా.. పసికూనపై టీమ్‌ఇండియా బంతితో, బ్యాటుతో ఆశించినంత ఆధిపత్యాన్ని ప్రదర్శించలేకపోయింది. బంతితో భారత్‌ను నిలువరించగలిగిన నెదర్లాండ్స్.. బ్యాటుతోనూ పోరాడింది

అహ్మదాబాద్ టీ20 ప్రపంచకప్ గ్రూప్ దశను భారత్ అజేయంగా ముగించింది. గ్రూప్-ఎ ఆఖరి మ్యాచ్‌లో బుధవారం 17 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించింది. శివమ్ దూబె (66; 31 బంతుల్లో 4x4, 6x6) మెరవడంతో మొదట భారత్ 6 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. ఆర్యన్ దత్ (2/19), డెలీడ్ (0/28) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. వాన్ బీక్ 56 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో నెదర్లాండ్స్ 7 వికెట్లకు 176 పరుగులు చేసింది. బాస్ డెలీడ్ (33; 23 బంతుల్లో 3x4, 1x6) టాప్ స్కోరర్. మరో అయిదుగురు బ్యాటర్లు 20పై స్కోర్లు చేశారు. వరుణ్ చక్రవర్తి (3/14), శివమ్ దూబె (2/35) రాణించారు. బుమ్రా (1/17) పొదుపుగా బౌలింగ్ చేశాడు. దూబెకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. భారత్ గెలుపుపై ఏ దశలోనూ సందేహాలు లేకున్నా.. ఛేదనలో నెదర్లాండ్స్ బ్యాటింగ్ ఆకట్టుకుంది. అయితే ఆరంభం నుంచి ఆ జట్టు వెనుకబడే ఉంది. పవర్‌ప్లే ముగిసే సరికి ఆ జట్టు 36/1తో నిలిచింది. ఆ తర్వాత లెవిట్ (24)ను హార్దిక్ ఔట్ చేశాడు. ఆకర్‌మ్యాన్ (23)తో కలిసి డెలీడ్ ఇన్నింగ్స్‌ను నడిపించడంతో 12 ఓవర్లకు నెదర్లాండ్స్ 94/2తో నిలిచింది. అయితే వరుణ్ తర్వాతి ఓవర్లో ఆకర్‌మ్యాన్, ఆర్యన్ దత్‌ను ఔట్ చేసి.. ఆ జట్టును దెబ్బతీశాడు. కాసేపటి తర్వాత డెలీడ్‌ను దూబె వెనక్కి పంపాడు. డచ్ జట్టు 14వ ఓవర్లకు 112/5తో నిలవగా.. సాధించాల్సిన రన్‌రేట్ బాగా పెరిగిపోయింది. నెదర్లాండ్స్ ఇన్నింగ్స్‌ను భారత్ ఇక తేలికగానే ముగిస్తుంది అనిపించింది. కానీ అది సాధ్యం కాలేదు. క్యాషే (26), క్రోస్ (25 నాటౌట్), ఎడ్వర్డ్స్ (15) తమ జట్టును పోటీలో ఉంచే ప్రయత్నం చేశారు. నెదర్లాండ్స్ ఆఖరి బంతి వరకూ ఆడింది.

ఆఖర్లో విధ్వంసంతో..: అంతకుముందు టీమ్‌ఇండియాకు అంత తేలికగా పరుగులు రాలేదు. కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన డచ్ బౌలర్లు.. ఇన్నింగ్స్‌లో చాలా భాగం భారత బ్యాటర్లకు కళ్లెం వేయగలిగారు. కానీ ఒకే ఒక్కడి మెరుపు ఇన్నింగ్స్ టీమ్‌ఇండియాకు మెరుగైన స్కోరును అందించింది. అతడే శివమ్ దూబె. మిగతా బ్యాటర్లు భారీ షాట్లు ఆడేందుకు ఇబ్బందిపడ్డా.. దూబె మాత్రం బ్యాట్ ఝుళిపించాడు. దూకుడైన బ్యాటింగ్‌తో భారత్ గట్టి లక్ష్యాన్ని నిర్దేశించడానికి ప్రధాన కారకుడయ్యాడు. అతడు నిలవకుంటే టీమ్‌ఇండియా పరిస్థితి భిన్నంగా ఉండేదే. స్పిన్నర్ల బౌలింగ్‌లో భారత బ్యాటర్లు ఇబ్బందిపడ్డారు. ముఖ్యంగా ఆఫ్‌స్పిన్నర్ ఆర్యన్ దత్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అయితే ఆఖరి అయిదు ఓవర్లలో విధ్వంసంతో ఇన్నింగ్స్‌ను టీమ్‌ఇండియా సంతృప్తికరంగా ముగించింది.

దూబె ధనాధన్: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలో గట్టి దెబ్బతగిలింది. పేలవ ఫామ్‌ను కొనసాగిస్తూ ఓపెనర్ అభిషేక్ మూడో బంతికే వెనుదిరిగాడు. ఆర్యన్ దత్ అతణ్ని వెనక్కి పంపాడు. ఇషాన్ కిషన్ (18; 7 బంతుల్లో 2x4, 1x6) కొన్ని చక్కని షాట్లు ఆడినా.. ఎక్కువసేపు నిలువలేదు. అయిదో ఓవర్లో, దత్ బౌలింగ్‌లోనే బౌల్డయ్యాడు. బంతి తక్కువ ఎత్తులో రావడంతో షాట్లు ఆడడం బ్యాటర్లకు కాస్త కష్టమైంది. తిలక్ వర్మ (31; 27 బంతుల్లో 3x4, 1x6), సూర్యకుమార్ (34; 28 బంతుల్లో 2x4, 1x6) నిలిచినా.. పరుగులు వేగంగా రాలేదు. 9వ ఓవర్లో తిలక్ వెనుదిరిగేసరికి స్కోరు 69 పరుగులే. 6 నుంచి 11 ఓవర్ల మధ్య భారత్‌కు 32 పరుగులే వచ్చాయి. అయితే చెలరేగి ఆడిన దూబె.. ఇన్నింగ్స్ స్వరూపాన్నే మార్చేశాడు. నిలదొక్కుకోవడానికి కాస్త సమయం తీసుకున్న అతడు.. ఆ తర్వాత బ్యాట్ ఝుళిపించాడు. ఆకర్‌మ్యాన్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లు, ఓ ఫోర్ బాదేశాడు. స్వేచ్ఛగా ఆడలేకపోయిన సూర్యకుమార్ 14వ ఓవర్లో వెనుదిరగడంతో 41 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. అతడి స్థానంలో వచ్చిన హార్దిక్ (30) మొదట భారీ షాట్లు ఆడలేకపోయాడు. కానీ దూబె మాత్రం రెచ్చిపోయాడు. వాండెర్‌మెర్వ్ ఓవర్లో రెండు సిక్స్‌లు, వాన్‌బీకర్ ఓవర్లో రెండు సిక్స్‌లు, ఫోర్‌తో అభిమానులను ఉర్రూతలూగించాడు. హార్దిక్ తొలి 16 బంతుల్లో 16 పరుగులే చేశాడు. అతడు 19వ ఓవర్లో జోరందుకున్నాడు. ఆ ఓవర్లో రెండు సిక్స్‌లు బాదిన హార్దిక్.. ఆఖరి ఓవర్లో ఇంకో సిక్స్ కొట్టి, ఇన్నింగ్స్ ఆఖరి బంతికి ఔటయ్యాడు. అంతకంటే ముందు దూబె ఓ సిక్స్ కొట్టి నిష్క్రమించాడు. ఆఖరి 5 ఓవర్లలో భారత్ 75 పరుగులు రాబట్టింది.

ఇప్పటికే సూపర్-8 చేరిన భారత్‌కు నెదర్లాండ్స్ మ్యాచ్ నామమాత్రమే. కానీ ఈ మ్యాచ్‌ను అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఆడడం జట్టుకు కలిసొచ్చే అంశం. ఇక్కడే భారత్ ఆదివారం తన తొలి సూపర్-8 మ్యాచ్‌ను దక్షిణాఫ్రికాతో ఆడుతుంది. ఈ టోర్నీలో భారత్ తర్వాత అంత ఆధిపత్యం చలాయిస్తోంది దక్షిణాఫ్రికానే. ఆ జట్టు కూడా గ్రూప్ దశను నాలుగు విజయాలతో ముగించింది. ప్రపంచకప్‌నకు రెండు నెలల కిందటే భారత్‌లో పర్యటించిన అనుభవాన్ని ఆ జట్టు బాగానే ఉపయోగించుకుంటోంది. టోర్నీలో ఫామ్‌ను బట్టి చూస్తే ఆ జట్టుతో పోరు భారత్‌కు సవాలే. అహ్మదాబాద్ పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు బాగా సహకరిస్తుంది. కానీ ప్రపంచకప్‌లో ఇక్కడ బ్యాటింగ్ కొంచెం కష్టంగానే ఉంటోంది. నెదర్లాండ్స్ లాంటి చిన్న జట్టుపై భారత బ్యాటర్లు కూడా ఇబ్బంది పడ్డారు. పిచ్ స్పిన్‌కు బాగా అనుకూలించడంతో తడబాటు తప్పలేదు. ఆదివారం కూడా స్పిన్నర్లను ఎదుర్కోవడం అంత తేలిక కాదన్నది స్పష్టం. బుధవారం నాటి అనుభవంతో బ్యాటర్లు మరింత బాగా సన్నద్ధం కావాల్సిన అవసరం కనిపిస్తోంది. మన స్పిన్నర్లు దక్షిణాఫ్రికా బ్యాటర్లను బాగానే ఇబ్బంది పెట్టే అవకాశముంది.

## సిక్సర్లు కొట్టడం ఇష్టమే.. కానీ గుడ్డిగా ఆడను: శివమ్ దూబే




తనకు సిక్సర్లు కొట్టడం అంటే చాలా ఇష్టమని, కానీ గుడ్డిగా ఏ మాత్రం ఆడనని టీమిండియా బ్యాటింగ్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే అన్నాడు. పరిస్థితులకు తగ్గట్లు ఆడటానికి తాను ప్రయత్నిస్తానని చెప్పాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా అహ్మదాబాద్ వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన టీమిండియా 17 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌ను చిత్తు చేసింది.

శివమ్ దూబే ఆల్‌రౌండ్(66, 2/35) ప్రదర్శనతో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. సహచర బ్యాటర్లంతా ఇబ్బంది పడిన వికెట్‌పై శివమ్ దూబే అలవోకగా సిక్సర్లు బాదాడు. అరడజన్ సిక్సర్లు బాది ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన శివమ్ దూబే తన బ్యాటింగ్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. అందుకే ఆరంభంలో ఆచితూచి ఆడాను..

'అవును.. ఈ వికెట్‌పై బ్యాటింగ్ చేయడం కొంచెం కష్టంగా అనిపించింది. కానీ ఇలాంటి పరిస్థితుల్లోనే నేను బ్యాటింగ్ చేయడానికి ఇష్టపడతాను. నా ఆటను ఆస్వాదించాను. కొన్ని సందర్భాల్లో ఒత్తిడికి గురైనప్పటికీ అధిగమించగలిగాను. ముఖ్యంగా నెదర్లాండ్స్ ఆఫ్ స్పిన్నర్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. దాంతో నేను వరుసగా నాలుగు డాట్ బాల్స్ ఆడాల్సి వచ్చింది. ఆ సమయంలో బౌలర్‌కు అది మంచి ఓవర్ అయినా.. ఆ తర్వాత స్కోర్‌ను కవర్ చేయగలనని నాకు తెలుసు. బంతి కొన్నిసార్లు స్కిడ్ అయ్యింది. మరికొన్నిసార్లు లో-బౌన్స్‌లో వచ్చింది. ఒక బంతి అయితే బాగా టర్న్ అయ్యింది. నేను ఆ బౌలర్‌ను కొట్టగలనని నాకు తెలుసు. కానీ అప్పటి పరిస్థితి కాస్త క్లిష్టంగా ఉంది. దాంతోనే నేను ఆచితూచి ఆడాల్సి వచ్చింది. ఆ తర్వాత నేను బౌండరీలు, సిక్సర్లు కొట్టడానికి ప్రయత్నించాను. నాకు సిక్సర్లు కొట్టడం చాలా ఇష్టం. కానీ పరిస్థితులను పట్టించుకోకుండా గుడ్డిగా ఆడలేను. బౌలర్ మంచి బంతులు వేస్తున్నప్పుడు.. అందుకు తగ్గట్లు బౌండరీ బాదేందుకు నన్ను నేను సిద్ధం చేసుకుంటాను. పరిస్థితులకు తగ్గట్లు బ్యాటింగ్ చేయడంపై నేను వర్క్ చేస్తున్నాను. ఎందుకంటే బౌలర్లు నన్ను బోల్తా కొట్టించడానికి ప్రయత్నిస్తారని నాకు తెలుసు. వారు నాకు యార్కర్లు, లెంగ్త్ బాల్స్ వేయరు. అందుకు బదులుగా షార్ట్ బాల్స్, స్లోయర్ బాల్స్ వేస్తారు. అందుకే నేను సిద్ధంగా ఉండి, వాటి కోసం వేచి చూశాను.

అతని వల్లే ఈ విజయం.. అది నాకు తలనొప్పే: సూర్యకుమార్ యాదవ్అతని వల్లే ఈ విజయం.. అది నాకు తలనొప్పే: సూర్యకుమార్ యాదవ్ మిడిల్ ఓవర్లలో నేను బ్యాటింగ్‌కు వచ్చినప్పుడు రన్ రేట్‌ను వేగంగా పెంచాలని కెప్టెన్, కోచ్ నాకు చెప్పారు. అయితే అది పూర్తిగా మ్యాచ్ పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. ఈ రోజు నేను క్రీజులోకి వచ్చినప్పుడు వెంటనే వేగంగా ఆడే పరిస్థితి లేదు. కానీ ఒకానొక సమయంలో మాత్రం 'ఇక నేను చెలరేగి ఆడాల్సిన సమయం వచ్చింది' అని నాకు అనిపించింది. నా బౌలింగ్‌పై కూడా నేను చాలా కష్టపడుతున్నాను. అందుకు తగ్గట్లుగా ఫలితాలు వస్తున్నాయి. కానీ ఇది టీ20 మ్యాచ్ కొన్నిసార్లు పరుగులు ఇచ్చుకున్నా.. వికెట్లు వస్తాయి.'అని శివమ్ దూబే చెప్పుకొచ్చాడు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, vspnews4@gmail.com